# ఏకాదశీ మహాత్మ్యం

- యామిజాల పద్మనాభస్వామి



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# ఏకాదశీ మాహాత్మ్యం

రచయిత

**యామిజాల పద్మనాభస్వామి**

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**2006**

**EKADASI MAHATMYAM**

by

**Yamijala Padmanabhaswamy**

Edited by

**Mudivarthi Kondamacharyulu**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No : 471

First Edition : 1991

Re-Prints : 1996, 2002, 2003, 2006

Copies : 5,000

Published by:

**Sri A.P.V.N. Sarma, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati — 517 507

*Art :*
P. Siva Prasad

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందుమాట

భగవదారాధన విధానాల్లో వ్రతం ఎక్కువ ప్రాధాన్యం వహించింది. కఠినమైన వ్రతనియమాలను పాటించి మనస్సును భగవంతుని మీద లగ్నంచేస్తే ఆయనకు చేరువయ్యే అవకాశం ఉందనీ, సద్గతి ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. శ్రీహరికి ప్రీతికరమైన వ్రతాలలో ఏకాదశీ వ్రతం చాలా శ్రేష్ఠమైనది.

ఏకాదశీ మాహాత్మ్యం నారదీయపురాణం ఉత్తరభాగంలో ఉంది. సూతుడు నైమిశారణ్యంలోని మునులకు రుక్మాంగదరాజు అనుష్ఠించిన ఏకాదశీవ్రతాన్ని వినిపిస్తాడు.

రుక్మాంగదుని రాజధాని విదిశాపురం. అక్కడి ప్రజలంతా ఈ వ్రతాన్ని రాజశాసనం ప్రకారం అనుష్ఠించడంతో పాపదేవతకు నిలువనీడ లేకుండాపోతుంది. ఆ సంయమి నగరంలో పాపాత్ములు అడుగుపెట్టడమే మానివేస్తారు.

ఈ అవాంతరాన్ని గుర్తించి సమవర్తి బ్రహ్మతో మొరపెట్టుకుంటాడు. బ్రహ్మ మోహినిని సృష్టించి రుక్మాంగదుడి వ్రతనిష్ఠను చెడగొట్టి రమ్మంటాడు. ఆమె ప్రయత్నించి విఫలురాలవుతుంది. చివరకు రుక్మాంగదుడు నిజపరివార సమేతంగా శ్రీహరికృపకు పాత్రుడౌతాడు. ఆయన పాలనలో రాజ్యంలోని ప్రజలంతా ధర్మవర్తను లయి సమవర్తిబారిని పడకుండా ఇహపరసుఖాల్ని అనుభవిస్తారు.

సరళమైన శైలిలో రచన సాగింది. ఇంత చక్కని గ్రంథాన్ని అందించిన యామిజాల పద్మనాభస్వామిగారిని మనఃపూర్వకంగా అభినందిస్తున్నాము.

పాపభీతిని, దైవప్రీతిని పెంపొందించడమే మన ధార్మిక సంస్థల ప్రథమ కర్తవ్యం. ఆ ఉద్దేశంతోనే ఏకాదశీమాహాత్మ్యం ప్రచురించడం జరిగింది. అనతికాలంలోనే ప్రతులు అన్నీ అయిపోవడంవల్ల పునర్ముద్రిస్తున్నాం. ప్రజలు ఎప్పటిలాగే దీనిని కూడా సమాదరిస్తారని ఆశిస్తున్నాము.

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

శ్రీరస్తు

# ఏకాదశీ మాహాత్మ్యం

★★★★

శ్రీమత్కళ్యాణమూర్తులు, జగజ్జననీ జనకులైన లక్ష్మీనారాయణులకు నమస్కారం.

పేరుకి అరణ్యమే గాని అది తపోధనులకు శరణ్యం. అదే నైమిశారణ్యం. పుణ్యానికి కుదురు. యజ్ఞయాగాదులకు సంబంధించిన వైదిక మంత్రాలకు ఆటపట్టు. సిద్ధులకూ సద్బుద్ధులకూ జన్మభూమి. ఆచారానికి పాదు. దురాచారానికి సవతి తల్లి. జపతపాలకు కల్పవల్లి. పాపాలకు భైరవ మంత్రం.

అలాటి నైమిశారణ్యమందు ఒకప్పుడు కణ్వుడు, శాండిల్యుడు, మాండవ్యుడు, కశ్యపుడు, గౌతముడు, మార్కండేయుడు, వశిష్ఠుడు మొదలైన బ్రహ్మవేత్తలు లోకక్షేమం కోసం ఒక యజ్ఞం చేస్తూ విశ్రాంతి సమయంలో శివకేశవులకు సంబంధించిన లీలలు చెప్పుకుంటూ ఉండగా ఒకనాడు వ్యాసభగవానుని శిష్యుడు పురాణకథా నికేతుడు సూతుడు వచ్చాడు. మునులందరూ సూతునికి ఆదరంగా స్వాగతం పలికి, అభివాదాలు చెప్పి సముచితంగా ఆతిథ్యం ఇచ్చి ఆసనాసీనుణ్ణి చేశారు. సూతుడు వారందరికీ ప్రత్యభివాదం చేసి వారి వారి ఆసనాలపై కూర్చోండని సవినయంగా అన్నాడు. అందరూ కూర్చున్నారు. ఒక్క క్షణం నిశ్శబ్దం...... ....

తరువాత వారిలో ఒకరు అందరి అభిప్రాయంగా సూతునితో అన్నాడు:

''ఉగ్రశ్రవసా! నీ రాక మా మునిలోకానికి నిజంగా రాక అయింది. మేము చేస్తున్న ఈ యజ్ఞం సఫలమయిందని మా విశ్వాసం. బ్రహ్మాండ, మత్స్య, కూర్మ, వరాహాదులు పురాణాలన్నీ నీ నాలుకపై నాట్యం చేస్తూ ఉంటాయని మేమే కాదు, ముల్లోకాలూ అంటూ వుంటాయి. రామకథ, భారతం, భాగవతం నీ నోటనే వినాలి. నిజంగా నారాయణుని అంశావతార పుణ్యపురుషుడైన వ్యాసభగవానునికి తగిన శిష్యుడవయ్యా! అన్నిటా సమర్థుడైన గురువుకి శిష్యులెందరో ఉంటారు. కానీ వ్యాసుని వంటి గురువు, నీ వంటి శిష్యుడూ న భూతో న భవిష్యతి. పొగడ్త కాదిది స్వభావోక్తి. విషయం తెలియడమే ప్రధానం కాదు. దానిని అన్ని విధాలా నింపుగా ఇంపుగా చెప్పడంలోనే ఉంది చెప్పేవాని పలుకుబడి తనం. దైవానుగ్రహమే

అనుకో! గురువు ఆశీర్వచనమే అనుకో!'' ఆ చెప్పే గొప్పతనం నీలో ఉంది. ఇదివరకు నీ ముఖతః ఎన్నో పురాణాలు ధర్మాలూ విని ఉన్నాము. అలాగే ఇప్పుడు కూడా లోకక్షేమం లక్ష్యంగా వీనులవిందుగా ఒక వ్రతకథ చెప్పి మమ్మల్ని ధన్యుల్ని చెయ్యవలసిందని కోరుతున్నాము.

ఆ ముని మాటలు విని సూతుడు చిరునవ్వు నవ్వి 'ఘనులారా! మునులారా! మనసారా మీ రన్న మాట కాదనగలనా? కాని మీరు స్వభావోక్తిగా అన్నా అది నా యెడల అతిశయోక్తే! మీరు మహానుభావులు! ఆగతానాగతాలు మీ కరతలామలకాలు. తపోధర్మం మీ మూర్తులలో కీర్తి పొందింది. మీ దయాగుణం అలాటిది. కనుక నన్ను పెద్దచేసి ఏదో చెప్పమంటున్నారు. అలాగే కానీయండి. సెలవీయండి ఏ వ్రతకథ కావాలో. గురువులవల్ల నే విన్నంత, నా బుద్ధికి తెలిసినంత చెప్పడానికి ప్రయత్నిస్తాను' అని సవినయంగా అన్నాడు.

'వ్రతకథ మాత్రమే కాదు. పూర్తిగా ఒక పురాణ గ్రంథమే వినాలని ఉంది. కాని సమయం చాలదు. మేము చేస్తున్న యజ్ఞం చాలవరకు అయిపోయింది. శేషభాగం అయ్యేలోపల దానికి అనుగుణమైన విష్ణు కథ చెప్పుకుంటే సమయం సరిగా వెళ్ళించినట్టవుతుందని మా ఉద్దేశం.

చెప్పకేమి? ఒకప్పుడు నీవే చెప్పావు బ్రహ్మాండపురాణం గొప్ప గ్రంథం అని, దానిలో రుక్మాంగదుడనే రాజు విష్ణుభక్తులలో అగ్రగణ్యుడనీ, ఏకాదశీ వ్రతం ఆయన పాలించినట్టు ఎవ్వరూ పాలించలేదు, పాలించలేరు అనిన్నీ. కాబట్టి ఆ వైష్ణవ శిరోమణి కథ వినిపిస్తే సంతోషిస్తాము' అని ఆ ముని అన్నాడు.

'మంచిది. బాగా జ్ఞాపకం చేశావు మునీంద్రా! జరుగుతూన్న యజ్ఞం కూడా వైష్ణవమే. ఇలాంటి సమయంలో భుక్తి ముక్తి ప్రదమైన ఏకాదశీ వ్రతకథ పవిత్ర చరిత్రులైన మీ ముందు చెప్పే మహద్భాగ్యం కలిగించిన మీ కందరికీ వందనాలు' అని సూతుడు గురుదేవుణ్ణి మనసా స్తుతించి సభాభివందనం చేసి ఏకాదశీ వ్రతకథ చెప్ప నారంభించాడు.

## రుక్మాంగదుడు:

తెల్లని పాముపానుపుపై నిద్రించేవాడు, తెల్లని ద్వీపమునందు నివసించేవాడు, తెల్లని (గుఱ్ఱము) వాహనముపై ఎక్కే కొడుకు కలవాడు, తెల్లని కూతురుకి తండ్రి, తెల్లని తామరపూవులను పోలిన కన్నులు కలవాడు, తెల్లని మోముగల గుఱ్ఱము, తెల్లని మామ, తెల్లని ఆయుధం, తెల్లని కోడలు కల దేవునికి జేజేలు అని విష్ణువుని ప్రార్థించాడు.

## ఏకాదశీ మాహాత్మ్యం

పాపాలను రూపుమాపేవి, సంసార తాపాన్ని చల్లబరచేవి, భూదేవికి పులకరింత కలిగించేవి, మునుల మనస్సులను శాంత తేజస్సుతో వెలిగించేవన్నీ అయిన శ్రీహరి పాదాలకు అభివాదాలు.

'సంసార సాగరమునకు నౌకలు, శుభకరములు, లక్ష్మీప్రదములు, సౌభాగ్యవర్ధనములున్నూ అయిన శ్రీహరి పాదాలకు జోతలు' అని శ్రీహరి పాదసరోజవందనం చేసి అవధరించండి మునిచంద్రులు!

భూదేవికి పేరుతెచ్చిన పట్టణాలలో మున్నెన్నదగినది విదిశ. విదిశాపురములో ఉన్న విప్రులు పెదవి కదిపితే చాలు వేదాలు గలగల లాడుతాయి. శాస్త్రాలు చరచర సాగుతాయి. ఆ వూరి రాజకుమారులు ప్రతాపానికి చండకరులు. వైశ్యులు కుబేరునికి అప్పులిస్తారు. భటులు అగ్నిజ్వాలలకు రూపాలు.

ఆ పురమందున్న ఏనుగులు కులపర్వతాలకు గురువులు, గుర్రాలు వేగానికి వాయువిజేతలు, తరుణీమణులు రతనాల బొమ్మలు. అందరూ యాచకులకు లేదనక ఇవ్వడములో కల్పవృక్షాలు.

మంచితనానికి మారుపేరుగా జీవితం గడిపే మానవులు విదిశా నగరానికి వెలకట్టలేని మంచిపేరు తెచ్చారు. ఒక్కమాటలో చెప్పాలంటే అన్నివిధాలా విదిశాపురం రత్నాకరం అని చెప్పడానికి సందేహించను.

అలాటి నగరం రాజధానిగా, శత్రువులకు చండకరుడుగా, తన జనానికి చందమామగా దొరతనం నెరపుతూన్న ధన్యాత్ముడు రుక్మాంగదుడు. చదువు, సంస్కారం, సౌజన్యం, సౌందర్యం అనే గుణాలు రుక్మాంగదునికి జన్మతో వచ్చినవిగా అందరూ అంటారు. తన వంశమందు పుట్టి రాజుగా చెల్లుబడి అయి, మంచి పలుకుబడితో ప్రజారంజకముగా పరిపాలన చేసి వెళ్లిపోయిన ప్రతిరాజునూ తన చల్లని దొరతనమున మరపించి సూర్యవంశానికి శాశ్వతమైన కీర్తిపతాక ఎగురవేసిన రాజ మాణిక్యం రుక్మాంగదుడు.

రుక్మాంగదుని పరిపాలన మాంధాతను, అంబరీషుణ్ణి, సగరుణ్ణి, రఘువును ఇలా పేరుపొందిన పూర్వరాజుల దొరతనాన్ని మరచిపోయేట్టుగా సాగుతూంది.

ధర్మం నాలుగుపాదాలతో నడుస్తూంది. రాష్ట్రములో రాజధానిలో సిరిసంపదలు పిలిస్తే పలుకుతూన్నట్లున్నాయి. కరవు కరవైపోయింది. అలా చల్లగా పరిపాలిస్తూ ఒకనాడు రుక్మాంగదుడు నిండుకొలవులో రతనాల

సింగపుగద్దెపై కూర్చుని ఉన్నాడు. ఆనాటి వైభవం సుధర్మలో ఉన్న మహేంద్రుని వైభవానికి దీటుగా ఉంది. హితులు, పురోహితులు, బంధువులు ఒక వంక, సామంతులు ఒక ప్రక్క, కవులు గాయకులు, యాచకులు మాగధులు ఒక వంక, వేశ్యాసుందరీ వీరభటముఖ్యులొక ప్రక్క, వేదావేదాంగవేత్తలైన విద్వాంసులొక వంక, మణు లొక ప్రక్క మంత్రులొకవంక, ప్రకృతి జనం ఒక ప్రక్క సముచితాసనాల మీద ఆసీనులై ఉన్నారు.

ఆ సమయంలో శుక శౌనకాది మహామునులు సభకు విచ్చేశారు. అనుకోకుండా వచ్చిన మునులను చూచి రుక్మాంగదుడు భయసంభ్రమాలతో గద్దెమీంచి లేచి, ఎదురువెళ్ళి వారి పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసి, సవినయంగా తోడితెచ్చి తగిన ఆసనాలు వేయించి ఆసీనులను చేసి 'ఏమి సెలవు' అన్నట్టు దోసిలొగ్గి నిల్చున్నాడు. ఆ మునులు అప్యాయంగా దీవించారు.

''రాజా! సుస్థిరమైన ఆరోగ్యమూ, సుదీర్ఘమైన ఆయువూ కలుగుగాక! నీ యశస్సు భాస్కరప్రభతో, నీ కీర్తి శారదచంద్రికతో నిత్యమైత్రితో నెగడు గాక! నీ యందలి హరిభక్తి స్థిరమై వర్ధిల్లుగాక! విప్రానుగ్రహంవల్ల నీ విభవం నిరతిశయమై వృద్ధిపొందు గాక! నీ పరాక్రమం విజయలక్ష్మికి వీరతిలకం దిద్దుతూ విరాజిల్లు గాక! నీ సామ్రాజ్యం నిత్యసంపన్నమై నిఖిలజన సంపూజ్యమగు గాక! నీ దాన గుణం నిర్జరవృక్షాలకు కూడా నీతిని బోధించుగాక! ధన కనక వస్తువాహన సమృద్ధితో పుత్రపౌత్రాభివృద్ధితో నిత్యసౌభాగ్యముతో నీ వంశం వర్ధిల్లుగాక!''.... తర్వాత ఆచారం ప్రకారం పాద్యం, అర్ఘ్యం ఇచ్చి రుక్మాంగద మహారాజు వారిని ఉద్దేశించి-

**ఏకాదశి:**

''మహాత్ములారా! ధన్యుణ్ణి అయ్యాను. మీ దయకి పాత్రుణ్ణి అయ్యాను. సమస్త రాజులలో మాన్యుణ్ణి అయ్యాను. మీరాక సామాన్యమా? సామాన్యుణ్ణి సర్వజనమాన్యుణ్ణి చేసే మునిలోక మూర్ధన్యులు మీరు. అనుకోకుండా వచ్చి నన్ను అనుగ్రహించారు. ఈ పేదకు పెన్నిధులు మీరు. ఇక సెలవీయవలసిందని వేడుతున్నాను. అన్ని లోకాల వారికి అసాధారణమైన పుణ్యఫలం ఇచ్చే వ్రతం ఏది? వ్రతాలన్నిటిలో ఉత్తమం అని చెప్పదగినది, సంపత్కరము, విష్ణు దేవునకు సంతోషకరమున్నూ అయిన వ్రతమేది? దయచేసి సెలవీయండి'' - అని సవినయంగా అడిగాడు. ఆ మాటకు మునులు సంతోషించి ''రాజా! మంచి ప్రశ్న వేశావు విను. అన్ని శాస్త్రాలూ, పురాణాలు విమర్శించి చూస్తే చెప్పదగిన వ్రతం ఒక్కటే ఉందని మా అభిప్రాయం.

## ఏకాదశీ మాహాత్మ్యం

పాపాలనే అరణ్యాన్ని సమూలంగా దగ్ధం చేసి పరమపుణ్యం ఇచ్చేది అది. ఏమిటో తెలుసునా? ఏకాదశీవ్రతం.

పుణ్యభూములలో పురుషోత్తమం, గ్రహాలలో సూర్యుడు, సముద్రాలలో పాలకడలి, పర్వతాలలో మేరువు, ఆశ్రమాలలో గృహస్థాశ్రమం వృక్షాలలో కల్ప వృక్షం, దానాలలో అన్నదానం, రత్నాలలో కౌస్తుభం, లోహాలలో సువర్ణం, ఆవులలో కామధేనువు ఎలా ఉత్తమములో వ్రతాల్లో ఏకాదశీవ్రతం అలా ఉత్తమమైనది. ముల్లోకాలలో దానికి సాటిగా చెప్పదగిన ఉత్తమమూ, సంపత్కరమూ, శుభంకరమూ అయిన వ్రతం మరొకటి లేదు.

ఏకాదశీవ్రతాన్ని చక్కగా పాలించేవాడు ఏలాటి పాపకర్ముడైనా సర్వపాప విముక్తుడై జన్మాంతరమందు శ్రీపతి సాయుజ్యం పొందుతాడు.

దానిని పాలించే పద్ధతి చెప్తాము విను.

**ఏకాదశినాడు:**

సూర్యోదయం కాకముందే నిదురనుంచి లేచి దంతధావనం చేసి చల్లనినీళ్ళతో శిరఃస్నానం చేయాలి. తరువాత పరిశుద్ధములు, తొలినాడు ఉతికి ఆరవేసిన తెల్లని వస్త్రాలు ధరించాలి. (ఒకటి కట్టుకునేది, ఒకటి ఉత్తరీయం, ఉత్తరీయం లేనిదే ఏకవస్త్రధారియైన వ్యక్తి చేసే దేవ పితృ కార్యాలకు ఫలం లేదు, రాదు.) అశుచిగా ఉన్న వ్యక్తిని చూడ కూడదు. అసత్య మాడరాదు. కాని పనులు చేయకూడదు. నిద్రించరాదు. మనసు ఏలాటి దుష్టచింతనకూ లోను కారాదు. విడెము వేయకూడదు. విష్ణుకథలనే చదవాలి, చదివించుకోవాలి.

దశమినాడు ఏకభుక్తం. మర్నాడు పగలూ రాత్రీ పూర్తిగా ఉపవాసం, విష్ణ్వాలయానికి వెళ్లి ఈ రాత్రి జాగరం చెయ్యాలి.

వేగుజాము కాగానే స్నానం చేసి హరినామ సంకీర్తనం..... ద్వాదశి గడియలు తగలగానే విష్ణుభక్తులూ విద్వాంసులున్నూ అయిన విప్రులకు షడ్రసోపేతమైన విందుచేసి వారికి సంతృప్తి కలిగించాలి. భోజనానంతరం తాంబూలం సువర్ణపు నాణెములు దక్షిణగా ఇవ్వాలి. తరువాత మిత్రులతో సహపంక్తిగా పారణ చెయ్యాలి. ఆ భోజనం నూనె పిండివంటలతో మాంసముతో చెయ్యకూడదు. శాస్త్ర నిషిద్ధమైన కూర తినరాదు. ఆ పగలు కూడ నిద్రించకూడదు. ఆ రాత్రి భుజించరాదు. స్త్రీ సంగమం ఆ రేయి నిషిద్ధం.

## ఏకాదశీ మాహాత్మ్యం

దశమినాడు ఏకభుక్తం చెయ్యలేనివారు ఏకాదశినాడైనా రెండు పూటలా ఉపవసిస్తే హరిప్రీతి అవుతుంది.

ఒక్కటి జ్ఞాపకం ఉంచుకో! ఏకాదశినాడు స్వేచ్ఛావిహారం పనికి రాదు.

ఆషాఢ, భాద్రపద, కార్తీక మాసాలలో శుక్ల పక్షములందలి ఏకాదశులందు శుష్కోపవాసం చెయ్యాలి. ఒకప్పుడు ఈ మూడు మాసాలలో ఏకాదశుల ఉపవాసాలు ఏ కారణము చేతనైనా చెయ్యలేని పక్షములో ఏ ఒక్క మాసమునందలి ఏకాదశినాడైనా ఉపవసించడం శ్రీమన్నారాయణునకు ప్రీతికరమూ పుణ్యప్రదమూ అవుతుంది.

ఈలాగు చెయ్యక ఏకాదశినాడు పశువులాగా తెగ దిని యథేచ్ఛగా విహరించే మానిసి చచ్చి నరకములో నానాయాతనలు అనుభవించవలసి వస్తుంది.

పంచ మహాపాతకాలనూ, దేవ బ్రాహ్మణమాన్యాలనూ వశపరచు కున్నందువల్ల వచ్చే పాపమును అనుభవించడం వల్లను, మద్యపానంవల్లను, అసత్యభాషణవల్లను, కొండెములు చెప్పడంవల్లను వచ్చే పాపాలనూ దానాలూ, జపాలూ, హోమాలూ, తీర్థయాత్రలూ, గోదానాలూ చేసి పోగొట్టుకోవచ్చు గానీ, ఏకాదశినాడు భుజించినందువల్ల వచ్చే పాపాన్ని పోగొట్టుకోవడం ఏ పుణ్యకర్మమువల్లనూ జరగదు.

పుణ్యసంపాదన కోసం ఏవేవో వ్రతాలు చెప్పారు. అవి చెయ్యక పోయినా పాపం రాదు. ఏకాదశీ వ్రతం మాత్రం తప్పక చెయ్యాలి. ఇది పాటించకపోతే వదలని పాపం వచ్చిపడుతుంది.

ప్రభుకార్యం నిర్వహించే తొందరలోనైనా, ఆకలిలేకున్నా, అరుచి అయినా, స్త్రీ వియోగంతో సతమతమౌతున్నా, సమయానికి అన్నం లభ్యం కాకున్నా, ఆటపాటలలో ఉన్నా, జ్వరం పీడిస్తున్నా, యుద్ధ సమయమైనా, కరువు కాటకాలైనా, ఏమైనా కానీ ఏకాదశినాడు పగలూ రాత్రీ శుష్కోపవాసం చెయ్యడమయిందంటే ఆ వ్యక్తి అదృష్టవంతుడన్నమాట. పేదరికం ఎరుగక ఈ లోకములో లక్ష్మీ కరుణా కటాక్షముతో అన్నవస్త్రాలకు లోటులేక సుఖంగా జీవిస్తాడు. మరణాంతమందు వైకుంఠములో శ్రీహరి కరుణాకటాక్షముతో హాయిగా ఉంటాడు.

కుక్కమాంసం మెక్కినవాడి పాపానికైనా పరిహారం ఉంది గాని ఏకాదశినాడు అన్నం తిన్నవాడి పాపానికి శాంతి లేదు.

అని మునులు రుక్మాంగదునకు ఏకాదశీవ్రతంగురించి బోధించి, దినకరవంశ సుధాకరా! ఈ వ్రతం చేస్తూ సుఖంగా ఉండు. మేము పోయి వస్తాము. శుభమస్తు, అని దీవించి ఆసనాల నుండి లేచారు. రాజు కూడా లేచి వారికి నమస్కరించి, 'కరుణా సముద్రులారా! నా అదృష్టం ఏమని చెప్పేది! ఇతరులు ఏదో కారణాన్ని పురస్కరించుకుని చుట్టాలవుతారు. మీరు అకారణ బంధువులు. శ్రీమన్నారాయణ వ్రతపరాయణుణ్ణి చేసి నన్ను ధన్యుణ్ణి చేసారు. మీ సేవలు మరువరానివి'.

అని కొంతదూరం వారివెంట వెళ్ళి 'ఇక ఉండు' అని వారిచే అనిపించుకొని తిరిగి వచ్చాడు. కొలువులో ఉన్న ఆప్తులను, బంధువులనూ, పురోహితులనూ చూచి ఆనందంగా అన్నాడు:

'విన్నారా! ఆ వేదవేత్తల మాటలు! అనుకోకుండా మబ్బులేని వానలాగా వచ్చి ఈ వ్రతకథ చెప్పి నన్ను ధన్యుణ్ణి చేశారు మహానుభావులు. ఇది నేను ఏమి తపస్సు చేసి, దాని ఫలముగా ఆ మునీశ్వరుల అనుగ్రహం పొందగలిగానో! నా పుణ్యం ఏమని ఎన్నగలను?'

ఆ యోగిపుంగవులు సెలవిచ్చినట్టు శ్రీహరిప్రీతిగా ఏకాదశీవ్రతం ఆరంభిస్తాను. మీరు కూడా ఏకాదశీవ్రతం ఆచరించడానికి సంకల్పించండి. శ్రీహరి కరుణకు పాత్రులై ఐహిక సుఖం పొందండి. ఆముష్మికం సాధించండి.

మీరే కాదు, మీ బంధువులకు, మిత్రులకు కూడా ఈ వ్రతవిధానం చెప్పి చేయించండి' అని అనగా వారందరూ పరమానందభరితులై ప్రభూ! హరివాసరవ్రతం పాలించండి అని మాకు వేరే చెప్పాలా? రాజానుమతే ధర్మం. రాజు ననుసరించే ప్రజలు నడుస్తారు. మేమే కాదు. రాష్ట్రమునందలి ప్రజలందరూ ఏకాదశీవ్రతం తప్పక పాటిస్తూ ఉండాలని చాటించాలి! అని అన్నారు.

రాజు ఆ మాటకు మరీ సంతోషించి మంత్రిని చూచి 'ఔను. మన రాష్ట్రమంతటా హరివాసరవ్రతం అందరూ అవలంబించాలని వెంటనే చాటించాలి' అని కాస్త ఆజ్ఞగనే చెప్పాడు.

చిత్తం! అలాగే చాట పంపుతాను అని అన్నాడు మంత్రి.

మంచిది. శుభస్య శీఘ్రమన్నారు పెద్దలు. ఈ నాటికి కొలువు చాలిస్తున్నాము. వెంటనే రాష్ట్రమంతటా చక్కగా చాటించండి తలారులను పంపి అని రాజు గద్దెమీంచి లేచాడు.

మంత్రులు తలవరులను రప్పించి ఏకాదశీవ్రత విషయాన్ని అర్థమయ్యేలా వారికి చెప్పి, దేశమంతటా ఈ వ్రతం పాటించాలి. ఇది రాజాజ్ఞ అని చాటిరండని పంపారు.

తలవరులు ఊరూరా, పల్లెపల్లె, పురంపురం తిరిగి తిరిగి వీధులలో తమ్మటలు, భేరులు, శంఖాలూ, కాహళాలూ మ్రోగిస్తూ ఆకాశం మార్మోగేట్టు చాటారు.

వినండయ్యా వినండి. అమ్మలారా వినండి. రుక్మాంగద మహారాజు గారి అజ్ఞ!

సూర్యోదయం అయేసరికి అభ్యంజన స్నానం చేసి దశమినాడు ఒంటిప్రొద్దు ఉండాలి. మర్నాడు ఏకాదశినాడు నిరాహారులై రాత్రంతా జాగరం చెయ్యాలి. ద్వాదశినాడు తొలిజాము దాటకుండా యథాశక్తి శుచిగా రుచిగా ఆహారపదార్థాలు సిద్ధంచేసి బ్రాహ్మణ సంతర్పణ చేసి పారణ చెయ్యాలి. ఆనాడు కూడా ఏకభుక్తం జాగరం చెయ్యాలి. ఇది తప్పరాదు. ఇలా చేసేవారు పుణ్యాత్ములై విష్ణుసాయుజ్యం పొందుతారు. రాజాజ్ఞ ఇది అని చాటి వచ్చారు. ఆ చాటింపు విని రాష్ట్ర ప్రజలు ఏకాదశీ వ్రతం చెయ్య నారంభించారు. రుక్మాంగదుడు కూడా తన భార్యలతో ఆనందంగా ఆ వ్రతం చేస్తున్నాడు.

**వ్రత పద్ధతి:**

వీధులన్నీ ముందుగా తుడిపించి గంధమూ, కస్తూరి కలిపిన మంచినీటితో తడిపిస్తున్నాడు. తర్వాత మంచి ముత్యములతో ముత్తెపు పొడితో నేర్పుగా ముచ్చటగా ముగ్గులు వేయిస్తున్నాడు. భవనాల గోడలపై శ్రీకృష్ణలీలలు వ్రాయిస్తున్నాడు. పట్టుబట్ట జెండా లెత్తిస్తున్నాడు. ప్రతి ఇంట గుమ్మాలకుపైన మామిడాకు తోరణాలు అరటి స్తంభాలు కట్టిస్తున్నాడు. మేడలపై బంగారు కుంభాలు పొందుగా అమరిస్తున్నాడు. తాను కూడా దగ్గర ఉండి ఆ యా పనులు చేసేవాడికి తోడౌతున్నాడు.

పురం సింగారం కాగానే నదిలో స్నానం చేసి వచ్చి పట్టుబట్ట కట్టుకుని గోపీచందనం దీరుగ ఫాలభాగాన దిద్దుకొని కాళ్లూ చేతులూ కడుగుకొని శ్రీహరి మందిరంలో ప్రవేశిస్తూన్నాడు. అక్కడ చిత్రకంబళము మీద పద్మాసనం వేసుకొని కూర్చొని నిశ్చలమనస్కుడై సంధ్యోపాసన ముగించి ద్వాదశాక్షరమంత్రం జపిస్తున్నాడు. తరువాత శ్రీహరి పూజ.

అభిషేకం, వస్త్ర సమర్పణ, అర్ఘ్యపాద్యాలు, ఆచమనీయం, శ్రీగంధం, అలంకారం సమర్పించి పరిమళపుష్పాలతో శ్రీహరి పూజ. సక్రమంగా ధూపదీపాలు, అమృతోపహారం. ఈ విధంగా పగలు ఏకాదశి నాడు విష్ణుప్రీతిగా షోడశోపచారాల పూజ చేస్తున్నాడు.

పూజ ఆరంభించగానే వివిధములైన మంగళవాద్యాలు వాయిద్య గాండ్రు వాయిస్తున్నారు. భరతశాస్త్రంలో ఆరితేరిన భావలు అభినయ నాట్యాలు ప్రదర్శిస్తున్నారు. భాగవతులు భాగవతం, నరసింహ, వామన వైష్ణవ పురాణాలు తీరుగా చదువుతున్నారు. గాయకులు శ్రుతిలీవంగా, కర్ణామృతంగా శ్రీహరి కీర్తనలు పాడుతున్నారు.

ఈ విధంగా పూజావిధి నిర్వర్తించి వివిధములైన ఆహారపదార్థాలు స్వామికి నివేదించి ఆ రాత్రి తెల్లవారేదాకా శ్రీహరి కథాగోష్ఠులతో జాగరం చేస్తున్నాడు.

తెల్లవారగానే ప్రజలతో నదికివెళ్ళి స్నానం చేసివచ్చి శ్రీహరి మందిరానికి వెళ్ళి దర్శనం చేసి సాష్టాంగ నమస్కారం చెల్లించడం విశేషించి చెప్పదగినది.

**శరణు:**

లోకాలకు చికాకు కలిగించే రాకాసి మూకలను పోకార్చే దుష్టశిక్షకా! నీకు దండం. కనకాంబరధారీ! నీ పాదసేవకుడను. సురముని సంస్తుత పాదపద్మా! జోహారు. వైకుంఠవాసా! శాశ్వత పురుషా! శరణార్థిని. లక్ష్మీవదన సరోరుహ మిత్రా! జేజే. పద్మాక్షా! అభివాదాలు. కైటభగర్వ నిర్వాపణా! జోత. శ్రీబ్రహ్మాండ భాండోదరా! నీకు మనవి. కరుణా సముద్రా! నీకు దోసిలి. కోటి సూర్య ప్రభాభాసమానా! నీకు ప్రణామం. యదువంశ తిలకా! నీకు కైమోడ్పు. గోపాలక భూపాలకా! శరణు శరణు అని రుక్మాంగదుడు శ్రీహరికి నమస్కరించే తీరు ఎంత ముచ్చటగానో ఉంటుంది. అంత విభవ సంపన్నుడున్నూ ఆ దేవదేవుని పాదాల ముందు సవినయంగా శిరసువంచి నుతించడం ఏమనాలి? అంత అమాయకు డా రాజు.

ప్రభూ! ఎడమ భుజాన బంగారు చల్దిగిన్నె వ్రేలాడగట్టుకుని, నడుమునకు కట్టిన పట్టుకాసెలో మురళి చొనిపి, పెరుగు కలిపిన బువ్వ కుడి అరచేతిలో ఉంచుకుని, రతనాల ఉంగరపు కాంతులు తురంగలించే వ్రేళ్ళసందున వడపిందె ఇరికించి గోపబాలకుల నడుమ కూర్చుండి నవ్వుచూ నవ్విస్తూ వేల్పులకు కూడా నోరూరేటట్లు చల్ది అరగించడం నీ బాల్యలీలగా భావించి నుతిస్తాను.

స్వామీ! ముక్కంటి ముంజేతి కడియం నీకు నునుదూదిపాన్పు. లోకాలకు సుఖభిక్ష పెట్టే దివ్యవరాత నీ వక్షః స్థలవాసిని అంఘ్రిన ఇల్లాలు. నీ

బొడ్డుతామరయందు పుట్టిన బిడ్డడు సకల చరాచర సృష్టికర్త. పక్షి రాజు నీ గుర్రం. వేదాలు నీ గండపెండేరం. నీ కూర్చునే పీఠమున్నూ నేల నింగి నీ మూర్తి. నీ శక్తియుక్తులూ, నీ దొరతనమూ, నీ కలిమీ బలిమీ ఎవరు తెలియగలరు?

నీ చిన్ని కొడుకు అంటితే కందిపోయే పువ్వులు కోలలుగా లోకాలను చీకాకుపెట్టే అపురూపపు విలుకాడు. వేడి వెలుగుకీ, చలువ వెన్నెలకీ ఆధారములైన చక్రాలు నీ నేత్రాలు. ఈలాటి మహనీయమైన సంసారం నీకు తప్ప ఇంకెవ్వరికి ఉంది విష్ణుదేవా! ఏ వేలుపైనా నీకు సాటి కాగలడా?

అచ్యుతా! ధ్రువుడు నీకు ఏనాటి చుట్టం? అహల్య ఏలాటి బంధువు? కుబ్జ ఎలాటి ఇష్టురాలు? గజేంద్రుడు ఏనాటి భృత్యుడు? ఏమీ కారు. వారిని నీవు ఆదరించావంటే, ఆదుకున్నా వంటే అది వారి వారి అదృష్టం. వారి యందు కారణం వినాగా నీకున్న దయ అంతే. ఇలాటి కరుణాపయోనిధి అయిన వేలుపు ఎవరున్నారు నీవు తప్ప. పద్మాక్షా! భక్త రక్షామణీ!

అనుకున్నంతనే రాజసమూర్తివై సృష్టించే విధాత వవుతున్నావు. సమయానుసారంగా భీమతేజస్సుతో తామసమూర్తివై ఈ సృష్టిని సంహరిస్తూ రుద్రుడవవుతున్నావు. ఆ తరువాత విశ్రాంతిగ వేయి పడగల వింత పాముపానుపుపై యోగనిద్ర. దొంతులు దొంతులుగ బొమ్మలను పేర్చి ఆడించి క్షణములో అంతకీ స్వస్తి చెప్పే జగన్నాటక సూత్రధారివి నీ ఆట మాటలతో చెప్పడం సాధ్యమా సర్వేశా!

శౌరీ! మురారీ! హరీ! అసురారీ! మధువైరీ! అఘవిదారీ! పుణ్యాచారీ! సువిచారీ! శృంగారీ! గిరిధారీ! కలిసంహారీ! కటాక్షించు! రక్షించు!

అని ఇందిరా రమణుణ్ణి అనేక విధాల స్తుతించి శ్రీపాద తీర్థం స్వీకరించి నిజ భవనానికి వెళ్ళే సమయంలో-

ఏ వీధిలో చూసినా విష్ణుభక్తులను పారణకు పిలిచేవారూ, ఏ దేవాలయం చూసినా శ్రీహరి సహస్రనామస్తోత్రం పఠించేవారూ, ఏ వేదికలు చూసినా శ్రీహరి సహస్రనామస్తోత్రం పఠించేవారూ, ఏ యింటి ముంగిట చూసినా పంక్తులు పంక్తులుగ నిల్చి హరికీర్తినలు పాడేవారు కనిపిస్తున్నారు. గాని వృథాకాలక్షేపం చేసే వ్యర్థులు కనిపించరు.

ఆరగింపువేళ అయింది. ఈ పూట మా ఇంటికి దయచెయ్యండని కొందరు బ్రాహ్మణులు వీధిలో పోతున్న హరిదాసులను సవినయంగా ఆహ్వానించి తీసుకు వెళ్తున్నారు.

ఏకాదశీ మాహాత్మ్యం

అరగింపు ఏదో మాటవరుసకు ఉడికీ ఉడకనట్టు ఇంత ముద్ద పెట్టడం కాదు.

పాయసాన్నం, పెసరపప్పు, అప్పుడు కాచిన ఆవునెయ్యి, తియ్యని కూరలు, చారు, తిమ్మనం, అప్పాలు, అరటిపళ్ళు, కలకండ, అమవడలు, మీగడ, చెరుకుపానకం, అప్పడాలు, రుచ్యములైన పచ్చడులు, పనసతొనలు, మామిడితాండ్ర, ఊరవేసిన ఉసిరికపళ్ళు, గడ్డపెరుగు, కొంరి మజ్జిగ........ మహారాజ భోగం ఆ భోజనం.

ముందు కాళ్ళు కడిగి, గంధాక్షతలతో పూజించి, సగౌరవంగా వెండి పువ్వులపీటపై కూర్చుండబెట్టి చక్కని లేత అరటాకులో విందు. భోజనం ముందు శ్రీ కేశవార్పణమస్తు అని హస్తోదకం. భోజనానంతరం వసారాలో తుంగచాపలపై విశ్రాంతి. అప్పుడు కప్పురపు తాంబూలం.

ఈ విధంగా నిత్యమూ హరిభక్తులకు ఆ పట్టణంలో గృహస్థులు సత్కారం చేస్తూ ఉంటారు. అది చూసి రుక్మాంగదుడు పరమానందభరితుడై నగరికి వెళ్ళి తానూ ఆ విధంగా హరిదాసులకు పారణ జరిపి తరువాత తాను అరగిస్తున్నాడు. ఆ విందులో ఆప్తమిత్రులు, మంత్రులు, బంధువులు నిం(డు)గా బంతులు తీర్చి కూర్చుంటున్నారు. ఆ విందు అయిన తర్వాత రాజు యోగ్యులైన భక్తులకు బంగారు నాణెములు హెచ్చు తక్కువలు లేక సంభావనగా ఇచ్చి సంతృప్తులను చేస్తున్నాడు.

ఈ విధంగా రుక్మాంగద మహారాజు వరుస తప్పక ఏకాదశీవ్రతం సలక్షణంగా జరుపుతూ ఉండగా అతని పేరు వినవచ్చేంత నేలంతా సిరి సంపదలతో భోగభాగ్యాలతో భూలోకవైకుంఠమా అన్నట్లుంది. కావాలన్నంతనే సస్యానుకూలంగా వానలు కురుస్తున్నవి. ఆవులు కుండల నిండుగా పాలిస్తున్నాయి. కొండ నేలలు కూడా నిండుగా పండుతున్నాయి. వృక్షాలు అన్ని ఋతువులా ఫలవృక్షాలుగా కనువిందుగా కన్పిస్తున్నాయి. సత్సంతానముతో ప్రజలు అభ్యుదయాభివృద్ధి పొందుతున్నారు. ధర్మం నాలుగు పాదాలతో నడుస్తూంది. దేశం శ్రీధాన్యకటకమై శోభిస్తూంది, మారుమూల పల్లెలు కూడా భోగభాగ్యాలతో తులతూగుతున్నాయి. వ్యాధులూ, అకాలమరణాలు ఊరూపేరూ లేకుండా పోయాయి. కరవు కరవయింది, దొంగతనం దొర్లిపోయింది.

క్రిమికీటకాలు, పశుపక్షులు, మృగాలు మరణించాక మోక్షం పొందుతున్నాయంటే విష్ణుభక్తులైన ఆ దేశం ప్రజలు వైకుంఠానికే వెళ్తున్నారని చెప్పనేల? యమదూతలకు రుక్మాంగద రాజ్యంలో తేరి చూడడానికి శక్యం కాలేదు.

## ధర్మాంగదుడు:

ఈ విధంగా రుక్మాంగద మహారాజు రాజ్యమంతా పుణ్యభాజ్యమై జనులందరూ అమందానందంతో తామరతంపరగా పుత్ర మిత్ర కళత్రాదులతో అభివృద్ధి పొందుతున్నారు. అంత కొంతకాలమునకు శ్రీహరి కరుణా ఫలముగా రుక్మాంగదుని భార్య సంధ్యావళి గర్భవతి అయింది. ఈశ్వరానుగ్రహం వల్ల ఏలాటి చీకాకులు లేకుండా పదవమాసాన సుఖప్రసవంగా పనసపండులాటి కొడుకును కన్నది. ఆ సమయములో దిశలన్నీ విశదము లయ్యాయి. వాయువు చల్లగా మెల్లగా సుగంధ మిళితమై వీచింది. సముద్రా లేడున్నూ ఉత్సాహంగా పొంగాయి. సూర్యుడు శుభప్రభతో భాసించాడు. అగ్ని యజ్ఞశాలలో దక్షిణార్చియై విలసిల్లాడు. పువ్వులతో తీగలు, ఫలాలతో చెట్లు ప్రకృతి రామణీయకానికి స్వాగతం చెప్పాయి. నదులు నిర్మలంగా పదిలంగా ప్రవహించాయి. అఖిల జీవులూ ఆనందంతో పొందు కలిపాయి.

నెల పొడుపుతో పూర్వదిగ్భాగం లాగా ఆ శిశూదయంతో అంతఃపురమంతా ఎంతో చల్లనిప్రభతో కలకలలాడింది.

కొడుకు పుట్టాడని దాసివచ్చి చెప్పగానే కొలువులో ఉన్న రుక్మాంగదుడు పట్టరాని ఆనందంతో ముంజేతికంకణం తీసి దానికి పారితోషికంగా ఇచ్చి అలాగే అంతఃపురభాగమైన సూతికాగృహానికి వెళ్ళి కొడుకు నెమ్మోము తనివితీరా చూసి స్నానగృహానికి పోయి, సంప్రదాయజ్ఞుడు కనుక సచేలస్నానం చేశాడు.

స్నానానంతరం పండితులకూ, చుట్టాలకూ, నిరుపేదలకూ, ఆశ్రితులకూ, యాచకులకూ, చిన్నవారికి పెద్దవారికి సుమంగళులకు రెండు చేతులా పుత్రోత్సవం పంచిపెట్టాడు.

పన్నెండవనాడు పుణ్యాహం జరిపించి ధర్మాంగదుడు అని కొమారునికి నామకరణం చేశాడు. ఆ పేరు విని అందరూ సెబాస్ మంచిపేరు అని ఆనందించారు.

ధర్మాంగదుడు శుక్లపక్ష శశిలాగా దినదినప్రవర్ధమానుడై తలిదండ్రుల నయనకుముదాలకు ఉత్సవకరు డౌతున్నాడు.

క్రమంగా రుక్మాంగదుడు కొడుకుకి అన్నప్రాశన చౌలోపనయనాదులు చేసి అక్షరాభ్యాసము ఆదిగా వేదశాస్త్ర పురాణాలు కావ్యనాటకాదులు వాటి విశేషప్రక్రియలు తగిన గురువులవద్ద నేర్పించాడు. తరువాత తానే గజ తురగ రథారోహణాదులు నేర్పి అన్నివిధాల శస్త్రాస్త్ర విద్యలలో నైపుణ్యం కలిగించాడు.

సిరిసంపదలున్నచోట విద్యలూ, విద్యలున్నచోట సిరిసంపదలూ, రెండూ ఉన్నచోట సలక్షణమైన ఆకారరేఖా, ఆకారరేఖ ఉన్నచో విద్యావిభవాదులూ ఉండడం లోకంలో అరుదు. ఇది ధర్మాంగదునియెడ తార్మారయింది. విత్తము, విభవము, విద్య, అందచందాలూ, పౌరుషము, ధైర్య స్థైర్యాలూ, సుగుణసంపదా కలిసి ధర్మాంగదుడుగా అవతరించాయని లోకం ఏకోక్తిగా వాకొంటూంది. ఆ మూర్తిత్వం, సుగుణస్ఫూర్తిత్వం చూసి బంధువులు అసూయచెందక ఆమోదిస్తూ ఉండేవారు.

క్రమంగా ధర్మాంగదుడు మదలేఖతో ఐరావతం, పూదీగతో కల్పవృక్షం, నిండువెలుగుతో జాబిల్లి రాణించినట్టు యౌవనరేఖతో చూపరులకు నేత్రోత్సవకరుడైనాడు. అలాగే అన్ని గుణాలు తండ్రిని పోలి తండ్రికి జనులకున్నూ ఆనందకరుడైనాడు.

యుక్తవయస్కుడైన కొడుకునకు రుక్మాంగదుడు పెండ్లిచెయ్యాలనీ, రాజ్యభారం అప్పగించాలనీ సంకల్పించి మంత్రులతో ఆలోచించాడు. మంత్రులు మనసా సమ్మతించి మాళవదేశాధిపతి కూతురు చంద్రలేఖ అందకత్తె, బుద్ధిమతి, గుణవతి అని పురోహితునివల్ల తెలుసుకుని తెలియజేశారు. వారూ వీరూ మాటాడుకున్నారు. ఇష్టపడ్డారు. శుభముహూర్తాన చంద్రరేఖా ధర్మాంగదుల కళ్యాణం సకల హృదయానందంగా జరిగింది.

వివాహానంతరం ఒక శుభదినాన రుక్మాంగదుడు ప్రధానుల అంగీకారంతో పౌరానందంగా కొడుకును పట్టాభిషిక్తుణ్ణి చేసి రాజ్యపాలనాధికారం అప్పగించి తాను విష్ణుపదసేవతో కాలక్షేపం చేయసాగాడు.

ధర్మవర్ధనుడైన ధర్మాంగదుడు రాజ్యాధిపతి యయి శత్రువులకు భయంకరుడై మిత్రులకు పరమమిత్రుడై ప్రజలకు మారట తల్లిదండ్రియై పరిపాలన చేస్తూ అందిరిచే సెబాస్ అనిపించుకుంటున్నారు. ఏకైక పుత్రుడు జనస్తుతిపాత్రుడై రాజ్యం పాలించడం చూసి తల్లిదండ్రులు పరమానందం పొందుతున్నారు.

**యమపురిలో :**

ఇది ఇలా ఉండగా ఒకనాడు సకల ధర్మవిశారదుడైన నారదుడు 'సంయమనీ' పురానికి బయలుదేరాడు. ప్రయాణం అంటే అతనికి గుర్రాలు కావాలా? విమానాలు కావాలా? సంకల్పమే వాహనం. గాలిలో తేలిపోతూ తెలిమబ్బులాగా గగనవీధిలో కాలు కదపకుండా వెళ్ళిపోయే శక్తిగల విశిష్టగమనుడు.

నందివర్ధనం పువ్వులాటి శరీరవర్ణం కట్టుకున్న కాషాయవస్త్రానికి వెండిపూత పూస్తూంది. వక్షమందున్న తామరపూసదండ మనస్సుతో ఏదో మాటాడుతూన్నట్టు ఉండుండి అటూ ఇటూ ఊగుతూంది. మహతీ తంత్రులు మీటకుండానే నారాయణ సంకీర్తనం సుతారంగా చేస్తున్నవి. దండం వేదార్థమండనమే. కమండలువు పుణ్యనదీజలాల కలగలుపు. జపమాలికలో సప్తలోకాలు తిరుగుతూ ఉంటాయి. అలాటి విశిష్టవ్యక్తి యమపురిలో కాలుపెట్టి నాలుగడుగులు వెళ్ళేసరికి ఎలా తెలుసుకొన్నాడో ధర్మరాజు అర్ఘ్యపాద్యాలతో ఎదురు వచ్చాడు. శిరసా పాదాభివందనం చేశాడు. ఆ సమయంలో ధర్మరాజు కిరీట మణికాంతులు నారద పాదపద్మాలకు దివ్యప్రభతో నీరాజనమిచ్చి నట్టయింది. అలాగే సవినయంగా తోడ్కొని వెళ్ళి సముచితమైన ఆసనం మీద ఆసీనుణ్ణి చేసి-

నారదమునీంద్రా! పిచ్చుక గుంటుపై గంగానది ప్రవహించినట్టు నాపై దయపుట్టి దయచేసి నన్ను ధన్యుణ్ణి చేశావు. నీవు సామాన్య మునివి కావు. ముల్లోకాలలో స్వేచ్ఛగా సంచరిస్తూ మురారి చరిత్రలు మహతిపై గానం చేస్తూ ప్రజల సంసారాంధకారాన్ని పోగొట్టుతూ ఉంటావు. నీకు తెలియని లోకవార్తలుండవు. శ్రీనాథుని పాదభక్తితో లోకాలకు ముక్తిపై రక్తి ఆసక్తి కలిగించే దివ్యజ్ఞానాచారం నీ సొమ్ము. ఆధ్యాత్మిక విద్య నీవు పిలిచినట్టు పలుకుతుంది. నీరాక సుజనుల ఇండ్లకే. ఒకచోట నిల్చుండి నీవు చూస్తే లోకవృత్తం అంతా నీ కన్నుల యెదుట ప్రభ కట్టినట్టు గోచరిస్తుంది. అన్ని ప్రాణులనూ సమదృష్టితో చూసే విజ్ఞానివి. నీకు మిత్రత్వ శత్రుత్వాలు లేవు. అంతా నీకు ఒక్కటే - అని ప్రస్తుతించి-

జ్ఞానమూర్తీ! ఒక ప్రశ్న. సముచితమైన సమాధానం దయచేయవలసిందని మనవి. ప్రస్తుతం మానవలోకవాసులు మరణానంతరం మా దరికి రావలసేవారు ఒకరూ రాలేదు. అందరూ అంతపుణ్యానికి నోచుకున్నారా? వారికి అలాటి సద్గతి రావడానికి కారణం ఏమిటో? లేక మర్త్యులు అమర్త్యులైపోయారా? ఉన్నది ఉన్నట్లు చెప్తున్నాను ఆలకించు అమరమునీంద్రా!

ధర్మధర్మాలు వాటి ననుసరించే పుణ్యపాపాలు సమంగా విమర్శించి తగిన ఫలాలు నిర్ణయించే యీ రాచరికం నా కెందుకా! అని విసుగుపుట్టి చెప్తున్నాను. నా వద్దకు తప్పక వచ్చేవారెవరో చెప్పనా?

అన్న విక్రయులు, మద్యం త్రాగేవారు, ఆవులను, అమాయకులైన బ్రాహ్మణులను, స్త్రీలను చంపేవారు, పరకాంతా వ్యామోహం కలవారు, పరులసొత్తు

వపహరించేవారు, విశ్వాసఘాతుకులు, అనాచారపరులు, అసత్యమాడేవారు, పజ్జనులను దూషించేవారు, గురుద్రోహులు, కొండెగాండ్రు, జూదరులు, ఇళ్ళు తగులబెట్టేవారు, శివదూషకులు, విష్ణుద్వేషులు, కులధర్మాలు విడిచినవారు, అంటరాని సతుల నాక్రమించిన వారు, పిన్నలూ, వృద్ధులు భుజించక ముందు ఆరగించువారూ, ప్రజా ద్రోహులైన ప్రభువులూ నా లోకానికి వస్తారు. రావాలి.

కూటసాక్షులు, కులభ్రష్టులు యుద్ధంలో వెన్ను చూపినవారు, చోరులు, జారులు, పాషండులు, సత్కర్మలు చేసి వాటి ఫలితం ధనాశచే ఇతరులకు ధారాదత్తం చేసినవారు, గురుహంతకులు, బ్రాహ్మణఘాతుకులు, శరణన్న వానిని కాపాడనివారు, మిత్రఘాతుకులు, స్వామిద్రోహులు, ఆశ్రితులను విడిచినవారు, విషం పెట్టినవారు, నిత్యమూ మానవలోకం నుంచి నా లోకానికి వస్తూ ఉండేవారు అలాటి పాపులను నా దూతలు కాళ్ళూ చేతులూ విరిచికట్టి కుయ్యో మొర్రో అన్నా కనికరించక ఈడ్చుక వచ్చి పలువిధములైన నరకాలలో పడద్రోస్తూ ఉంటారు. పడద్రోసిన తరువాత కత్తులతో ఖండఖండాలుగా తెగనరుకుతూ శూలాలతో పొడుస్తూ చురకత్తులతో గీకుతూ గొడ్డళ్ళతో తలపై మొత్తుతూ చిత్రహింస చేస్తూ ఉంటారు.

కొందరిని చాపరాళ్ళపై త్రాళ్ళతో బంధించి ఈడుస్తూ, కొందరిని చీకటి నూతులలో పడద్రోసి రాళ్ళతో మొత్తుతూ, కొందరిని చెట్లకి తలక్రిందులుగా వ్రేలాడగట్టి కళ్ళలో సూదులను గుచ్చుతూ, కొరడాలతో తట్లుపేరేట్లు కొట్టుతూ, కొందరిని క్రూరజంతువులచే కరిపిస్తూ, కొందరిని నిశితశరప్రయోగముతో ఏడిపిస్తూ నా భటులు దురంతసంతాప సంతప్తులను చేస్తూ ఉంటారు.

ఈ విధంగా ఎల్లకాలం నా భటులు అనేక విధాల పాపులను బాధపెడుతూ ఉండడం, వాళ్ళు హోరుమని ఏడవడం నా నగరానికి లక్షణం. ఇప్పుడు వాసనకైనా అలాటిది ఎక్కడా లేక నా పట్టణం వట్టిపోయిన గొడ్డు అయిపోయింది. ఈ దురవస్థ నాకు వింతగా విచారంగా ఉంది.

నగర వీధులలో, అసిపత్రవనములో, డాకినీశాలలో, రాజభవనాగ్రములో, చెరసాలలో పాపులు క్రిక్కిరిసి ఉండేవారు. ఈనాడు ఎక్కడా ఒక్కడూ మందుకైనా కనిపించడే!

నా సంయమనీ నగరం, నరకభవనాలూ, పాపులతో నిండుగా కలకలలాడుతూ నా కనులపండువుగా కనిపించేది ఎన్నడో కదా! నారద మునీంద్రా! ఇప్పుడు ఏ పనీలేక నాకు మతిపోయినట్టుంది. చేతులు ముడుచుకుని నోరు

మూసుకుని వెలవెలలాడుతూ ఇలా కూర్చోడం ఎంతకాలం? పాపులను చేతులారా శిక్షించే పనితో నా భటులు నవ్వు మొగాలతో ఎప్పుడు నా ముందు తిరుగుతారో? ..... ఇలాగే ఇంకా కొంతకాలం జరిగితే శిక్షాస్మృతి నా మతి నుండి మాయమైపోయే దుఃస్థితి పట్టేట్టుంది. అప్పుడు నా పేరు ఊరు ఏమయేట్టు? నారద మునీశ్వరా! త్రికాలవేదివి నీవు. ఇప్పుడు నా ఉద్యోగం ఇలా స్తంభించిపోవడానికి కారణం ఏమిటో చెప్పవయ్యా! మళ్ళీ నా అధికారం సక్రమంగా సాగే మంచిరోజులు వస్తాయా అని విసవిసలాడుతూ యము డనగా నారదుడు చిరునవ్వు నవ్వి యిలా గన్నాడు:

ధర్మరాజా! విసవిసలాడి ప్రయోజనంలేదు. నీ అధికారానికి వచ్చిన యీ సుడిగాలికి కారణం చెప్తాను విను.

నేలపై రుక్మాంగదుడనే రాజమాణిక్యం ప్రస్తుతం పరిపాలన జరుపుతున్నాడు. అతడు విష్ణుభక్తులలో మణిపూస, సద్గుణరత్నాకరుడు. ఏకాదశీవ్రతం ఏ మాసంలోను విడువక తాను చెయ్యడమే కాక, తన రాష్ట్రమందున్న ప్రజలందరూ శ్రద్ధాభక్తులతో చెయ్యవలసిందని ఒక కట్టడి చేశాడు. ఆ శాసనాన్ని తలదాల్చి ప్రజలు భయంతోనేకాక భక్తితో సహ చెయ్య నారంభించారు. ఇక చెప్పేదేముంది? ఆ వ్రతమహిమవల్ల ప్రజలు పుణ్యాత్ములై మరణించిన వారంతా వరుసతప్పక వైకుంఠానికి వెళ్ళిపోయారు. అందువల్ల ఈ పట్టణం వట్టిపోయింది. విచారించి చేసే పని లేదు. ప్రయోజనమూ లేదు. నీవు సరాసరి సత్యలోకానికి వెళ్ళు. మా నాయనగారిని చూచి ఇప్పుడు నాకు చెప్పినదంతా ఆయనకు అప్పగించు. తరువాత ఆయన ఏదో దారి కల్పిస్తాడు. అంతకన్నా నేను చెప్పేది లేదు. వస్తానని ఓదార్పుగా ఒక మాట పలికి తనదారిన తాను పోయాడు.

## 2

అలాగూ హితవుగా ఒక పలుకు పలికి నారదుడు వెళ్లిన తర్వాత యముడు మహిషవాహనం అధిష్ఠించి తగిన పరివారంతో సత్యలోకానికి వెళ్ళాడు. సింహద్వారం ముందు వాహనమ్మీంచి దిగి తనరాక తెలుపవలసిందని ద్వారపాలకులకు చెప్పగా వారు వెళ్ళి బ్రహ్మ అనుమతిని తీసుకొని తిరిగివచ్చి ధర్మరాజుకి చెప్పారు. ధర్మరాజు లోపల ప్రవేశించి బ్రహ్మ సభను చూసి వినమ్రుడై తన ఆయుధాలు క్రిందపెట్టి చేతులు జోడించి నమస్కరించాడు.

ధర్మరాజు నలువసభను ప్రవేశించిన సమయంలో సనక సనంద నాది యోగీంద్రులు, వసిష్ఠ వామదేవాది మునీంద్రులు, ఇంద్రాది దిక్పాలకులు, సూర్యాదిగ్రహాలు, గరుడ గంధర్వులు, సిద్ధసాధ్యులు, యక్షరాక్షసులు,

మూర్తిమంతములై ఋతువులు, మాసాలూ, పక్షాలూ, రేయింబవళ్ళు, సప్త కులపర్వతాలు, సప్త సముద్రాలు, సప్తద్వీపాలూ, నదీ నదాలూ చతుర్ముఖుని స్తుతిస్తూ వివిధ విద్యాగోష్ఠులు నడుపుతున్నారు. వజ్రసింహాసనం మీద భారతీపతి భద్రమూర్తియై కూర్చున్నాడు.

కాలదండ కాలపాశాలు క్రిందపెట్టి చేతులు మొగిచి మ్రొక్కి నిలుచున్న ధర్మరాజును చతుర్ముఖబ్రహ్మ లలితోక్తులతో స్వాగతం చెప్పి ఆసనం చూపి ధర్మరాజా! సేమమా! ఏమిటి ఇలా వచ్చావు? వార్తలేమైనా వింతలా?, అని సానుభూతిగా అడిగాడు.

ప్రభూ! సర్వజ్ఞుడవు. నీకు సంకల్పమాత్రాన సర్వమూ అవగతం అవుతుంది, అయినా అడిగావు కనుక మనవి చేస్తున్నాను. అవధరించు.

## సర్వశూన్యం:

మానవలోకంలో ఒక మంచిరాజు. అతని పేరు రుక్మాంగదుడట! హరిభక్తులలో మణిపూస. ఏకాదశీవ్రతం తానేకాక తన పలుకుబడి చెల్లేంతమేర రాష్ట్రంలో ఉన్న జనులందరూ ఏమరక ప్రతిమాసమూ చెయ్యడం జీవిత వ్రతమట! ఆ పరిస్థితిలో ఏకాదశీవ్రత మహిమవల్ల నరులు పుణ్యాత్ములై మరణించిన తరువాత శ్రీహరి పదానికే పోతున్నారు. నా వద్దకు ఒక్కరూ రాలేదు. ఇక యమలోకం అనే దానిలో ప్రభువుగా ఉండి పాపపుణ్య పరీక్ష చెయ్యడం, పాపులను శిక్షించడం అనే విధిని నేను నిర్వహించడం ఎప్పుడు? అంతవరకు నేను ఏమి చేసేది? నా ఆధీనంలో ఉన్న శిక్షాస్మృతి ఏమయేట్టు? అని చికాకుగా సిగ్గుగా కొంచెం పెద్ద గొంతుకతోనే అన్నాడు ధర్మరాజు. అంతవరకు ఆయన మాటలు విని నలువ ఒక్క క్షణం ధ్యానించినట్టు చూసి 'ఊఁ కానీ! నీవు చెప్పవలసింది పూర్తిగా చెప్పు. తరువాత నీ కర్తవ్యం చెప్తాను!' అని అనగా ధర్మరాజు ఇలా చెప్పాడు.

ఇదివరకు నరకంలో ఉన్న మానవులు వారి పుత్ర పౌత్రులు చేసే ఏకాదశీపాలన మహిమవల్ల దివ్యతేజస్కులై దివికి వెళ్ళిపోవడం కొత్త నీరు వచ్చి పాతనీటిని తీసుకుపోయినట్టయింది.

బ్రాహ్మణుల ఇళ్ళను మోరతోపుగా ఆక్రమించి వాటిలో నివసించే వారిని మంటలలో తోయించడం, బ్రాహ్మణనింద చేసినవాడి నాలుక కోయించడం, ఆ నింద విన్నవాడి చెవులలో వాడికోరలతో పొడిపించడం, బ్రాహ్మణుల సొమ్ము తినే పాపాత్ముని కడుపు రంపముతో తరగించడం, విప్రులపై అధికారం చేసి బాధించిన అధముణ్ణి అసితపత్ర వనములో దొర్లించడం, క్రాగిన నూనెలో ముంచడం శిక్షలు. ఇవి ఈనాడు నేను చేయించ నక్కర లేకపోయింది.

దేవాలయాల ఆదాయం ఉబ్బరగా తింటూ ఔచిత్యం గుర్తించక అన్యాయప్రవృత్తితో జీవించే అధికారులనూ, దేవాలయ ప్రాంగణాలలో కాముకులై ప్రవర్తించే నీచులను, ఏ తప్పు ఎరుగని భార్యలను బహిష్కరించిన దుర్మార్గులను పట్టి అగ్నికుండాలలో పడద్రోయించడం అనే శిక్ష విధించడానికే నాకు అవకాశం లేక పోయింది.

అసత్యభాషణుల నాలుకలు కోయించడం, యుద్ధములో శరణన్న వానిని అభయమిచ్చి ఆదుకొనని దుర్మార్గుణ్ణి నిప్పులయేటిలో ముంచడం అవసరానికి అప్పుచేసి తీసుకున్న ధనం ఎగవేసిన దుర్జాతిని ఎండుగడ్డి మెంటితో కాల్పించడం అనేవి ప్రస్తుతం నా పురములో గగన కుసుమాలై పోయాయి.

ఇచ్చిన ఋణానికి ఇబ్బడిగా వడ్డీతో సొమ్ము వసూలుచేసే దురార్జన పరుణ్ణి చెట్టుకి తలక్రిందులుగా వ్రేలాడగట్టి ఇనుపగుదియతో మోదించే పని ఇప్పుడు నా పరిపాలనలో లేదు.

బంగారం దొంగిలించిన వాని మేనికండలు కోయించడం, కొండెగానిని సలసల మరుగుతున్న నూనె కాగులలో పడద్రోసి ఉడికించడం అక్కరలేకపోయింది.

ఆవులను, బ్రాహ్మణులను, ఆడువారిని చంపినవారికి ఆకల్పాంతం నానావిధ నరకాలలో పడద్రోయడానికి స్వస్తి పలుకవలసి వచ్చింది. విందుకి పిల్చిన వానిని ఏదో నెపముపెట్టి చంపిన క్రూరుణ్ణి, పరకాంతల నిందించే నీచుణ్ణి మరిగే నీటివరదల్లో దొర్లించడ మనేది మా ఊరిలో ఇప్పుడు లేదు.

అన్నవస్త్రాలిచ్చి పోషిస్తూ ఉంటే యజమాని పనులను పాడుచేయడం, లంచం తిని ప్రభువును పరరాజులకు లొంగేట్టు చేయడం, ఏకాకిగా ఉన్న ప్రభువుని ధనాశతో, బలాధిక్యముతో హత్య చెయ్యడం, ప్రభువు మాటకి ఎదిరివాదుతో నిల్చి తూలనాడడం, దుర్మార్గులతో చేయి కలిపి ప్రభుద్రవ్యం దోచుకోవడం మహాపాతకాలు. అలాటి దుష్టులేమయారో? మా ఊరి పొలిమేరకేనా రారు. ఆశ్చర్యం కాదా మరి?

పరాయివా డిచ్చే ధనానికి ఆసపడి తన ప్రభువు లోపాలు చెప్పి వానికి చోటివ్వడం ప్రభుద్రోహం. అలాటి వారేమయారో తెలియుడు.

సమయానికి ప్రభువుకు తోడుపడక పారిపోయే పిరికిపందను నా లోకములో ముళ్లపొదలలో దొర్లించాలి. అలాటి సేవకులు నా నగరికి రానే లేదు.

చేసిన ధర్మాలు సిగ్గులేక ఉల్లాసముతో చెప్పుకొనే వివేకశూన్యుల నోళ్ళలో సీసం పొయ్యాలి. అలాటి అవివేకులు మా చోటికి రాలేదు. ఇక ఎవరినోళ్లలో పోయించేది?

విప్రకాంతలను చెరపట్టిన వెంగలులకూ, దంపతుల నెడబాపిన దారుణకర్ములకూ కొరత వేయించాలి. ఇది ఇప్పుడు పుస్తకములో మాట గాని మా వీట లేదు. ధర్మం మీరి మాటాడే దుర్మార్గులకు నీరులేని నిండు చీకటి నూతిలో నిరంతర నివాస శిక్ష. అలాటిశిక్ష ఇపుడెవరికి విధించేది?

మగని కళ్ళుకప్పి పరపురుషునితో ప్రవర్తించే నారీపిశాచి శరీరం చురకత్తులతో ఇంతింతగా నరికించాలి. ఇది నా శిక్షాస్మృతిలో ఇప్పుడు ఏష్యమై పోయింది.ఆస్తికోసం సోదరుణ్ణి హతమార్చిన వానిని ఇనుపముళ్ల తీగలతో కట్టించి, భగభగమండే మంటలలో దొర్లించడ మనే శిక్షావాక్యం సంయమనీ నగరంలో ఈనాడు స్వప్నంలో కూడ కనిపించదు.

ధనికుడిచ్చే దుర్దానం కోసం ధర్మకార్యఫలం ధారపోసేవాడిని కరిచే పురుగులనూతిలో ముంచి ఉంచడం అనేశిక్ష మాసిపోయిందనే చెప్పాలి.

కన్యావిక్రయం చేసేవారిని అసిపత్రవనంలో దొర్లించడం, గురుద్రోహులను దారుణయంత్రాలలో ఇరికించి త్రిప్పడం, పాడితప్పిన పాలకులను ముండ్లచెట్లకు పెనవేసి కట్టించి ఇనుపరోకళ్ళతో మొత్తించడం, విశ్వాసఘాతుకులను కాలపాశాలతో కట్టి ఈడ్పించడం, ఇళ్ళు తగులబెట్టిన వారిని అగ్నికుండాలలో ఉడికించడం, విషాన్నం పెట్టిన దుష్టుల్ని బొబ్బులులచే కరిపించడం – పరలోక శిక్షలు. ఇప్పుడు వీటికి మావీట చోటే లేకపోయింది. అలాటివాడు ఒకడూ మా ఊరికి రాలేదు.

పంక్తిభేదం చేసిన పాపినోట నిప్పులు పోయడం, బ్రాహ్మణుణ్ణి, తల్లిని, సోదరిని, ఆవును తన్నిన వాడి పాదాలు మొండికత్తులతో నరకించడం నేను విధించే శిక్షలు. వీటికి ఈనాడు నరకవీధిలో వెలలేకుండా పోయింది.

దాహం తీర్చుకునేందుకు దప్పితో డస్సివచ్చిన నోరులేని జంతువులను నీరుగలచోట చాటుగా మాటువేసి చంపే దుర్మదులను కాళ్ళుచేతులు కలియగట్టి ఆకలిదప్పులతో అలోమని ఏడిపిస్తూ కాలుతూన్న ఇసుకనేల మీద ఈడ్పించడం ఎన్నాళ్లయిందో నేను విధించి.

చేసిన ఉపకారం మరచిన పాపాత్ముణ్ణి కాళ్ళుచేతులు విరిచికట్టించి చెట్టుకి తలక్రిందులుగా వ్రేలాడదీసి కొరడాలతో కొట్టించే మాట తెరచాటయిపోయింది.

హరిభక్తులై శివుని నిందించే దైవద్రోహుల్ని, శివభక్తులై హరిని నిందించే దురితాత్ముల్ని అన్న పానీయా లీయక ఏడిపించడం ఇప్పుడు కలలో వార్త అయింది మా ప్రభుత్వములో.

ఫలవృక్షాలను నరికిన ఖలులనూ, చెఱువులగట్లు తెగగొట్టిన దుష్టులను కొండకోనలనుంచి క్రిందనున్న బండలమీదికి త్రోయించడం శిక్ష. దాని కిప్పుడు దారి లేదు.

ప్రభువు దగ్గర సజ్జనులపై లేనిపోని తప్పులు కల్పించి నిందించి ప్రభువులవల్ల వారికి చెందవలసే ఫలితాన్ని తప్పించే సాధుకంటకుల చర్మం ఒలిపించడం మరచిపోయి చాలకాల మయింది.

అన్నం, వేదం అమ్ముకొన్న వాని నోట కొత్త సున్నం వేయించడం, పశుగ్రాసాలయిన పచ్చికబీళ్లను దున్నించిన దుష్టుల శరీరాలు ఇనుప శూలాలతో పొడిపించడం ఏష్యమైపోయాయి.

ఆవులను బందెలో ఉంచి గడ్డి నీరు పెట్టని కఠినచిత్తుని నిప్పులకుంపట్లలో చొప్పించ లేదు. అన్నకు పెండ్లి కాకముందు పెండ్లి చేసుకున్న తమ్ముళ్లను కాలుసేతులు కట్టించి కరకురాళ్లపై ఈడిపించలేదు.

దేవాలయ మందున్న పూదోటలో పువ్వులు తెచ్చి దండ లల్లుకుని మెడలో వేసుకున్న పాపినీ, దొంగలను పోషిస్తూ ధనం సంపాదించే దుష్టుణ్ణి కటికచీకటి నూతుల్లో పడవేయించలేదు.

పరకాంతను ఆశగా చూసే వాడి కళ్లు పెరికించడం, పరభామ చేయిపట్టిన పాపిచేతుల్ని కాకులచే పొడిపించడం, పరసతీ ముఖం ముద్దు లాడిన దుష్టుని నోట కొఱ్రుకొట్టించడం, పరుని ఇల్లాలిని కౌగిలించుకొన్న తులువ శరీరచర్మం ఒలిపించడం, పరుని పత్నిని కూడిన పాపిశరీరం కండకండలుగ ఖండించడం నేను వేయించే శిక్షలు. ఇప్పుడు వాటికి సంయమనీ నగరంలో వెల లేదు.

తల్లిదండ్రులను, అన్నను ఆదరించక హీనంగా చూస్తూ నొప్పించే వదరుబోతు తల గొడ్డలితో చిదగగొట్టించడం అనే శిక్షకి ఒక్కడేనా లక్ష్యం కాలేదు.

భర్తను పెడసరించి ఎదిరించి అలక్ష్యంగా మాటాడుతూ ఏడిపించే ఆలిని మొగం మీద మొండికత్తులతో వాతలు పెట్టించడం, ముక్కముక్కలుగా మేను చెక్కించడం నేను వేసే శిక్షలు. వాటిని ఇప్పుడు వేయించే అవకాశమే లేకపోయింది.

గురువును నిందించే శిష్యుణ్ణి అసిపత్రవనంలో మెసలిస్తూ సూదులతో నాలుకపై గ్రుచ్చడం ముచ్చటకైనా ఇప్పుడు మా నగరంలో జరగకుండా ఉంది.

నదులలో చెరువులలో తోటలలో దేవాలయ ప్రదేశాలలో పసులశాలలలో పచ్చికబీళ్లలో మలవిసర్జన చేసిన నరాధముల తలలు మెదడ్లు చిదిగేట్టు మా భటులు నడవడం లే దిప్పుడు.

అశుచిగా ఉండి ఆవుని అగ్నిని బ్రాహ్మణుణ్ణీ తాకిన వానిని, సూర్యచంద్రులను చుక్కలనూ చూచిన వానిని కన్నులు పెరికించి కాల్పించలేదు.

శ్రాద్ధకాలములందు పితృదేవతలను భక్తితో అర్చించని మూర్ఖులను కాలపాశాలతో బంధించి కరకునేలమీద ఈడ్పించ లేదు.

శరణు జొచ్చిన వానిని శత్రువు కప్పగించిన దర్మతిని కరకుకత్తులతో ఖండఖండాలుగా కోయించలేదు.

కుక్కను, కోడిని, పేడిని, వ్యభిచారిని, ఊరబందిని, బహిష్ఠను, కల్లు త్రాగినవానిని, కులభ్రష్టుణ్ణీ, మైలపడినవాణ్ణి, ఏనుగును, ఎలుకను, గాడిదను, పిల్లిని తాకి వెంటనే స్నానం చేయని పాపిని భగభగమండే అగ్నిలో పడద్రోయాలి. అలాటివారు రాలేదు నా రాజ్యానికి, మరెవ్వరిని త్రోయించడం?

మా చిత్రగుప్తుడు పాపుల వివిధ పద్ధతులను పేరు పేరునా వ్రాస్తూ ఉండాలి. ఇప్పుడు ఒక్క అక్షరమైనా వ్రాసే పనిలేక చేతులు ముడుచుకుని ఆకులూ, గంటమూ మూల పారవేశాడు. రెండు చేతులలో తలపట్టుకుని తలపుచాటున కూర్చున్నాడు. అసిపత్రవనమంతా వాడిపోయింది. రేకులూ, ఆకులూ ఊడిపోతున్నాయి. నా కాలదండం తుప్పుపట్టింది. కాలపాశం తెగిపోతూంది. కాలకింకరులందరూ మాటామంతీ లేక కాళ్ళు ముడుచుకుని కూర్చున్నారు.

ఇదీ నేను వచ్చిన పని. నా కెందుకీ యమాధికారం? నీవే తీసుకో. ఉంటే నా కింకేదేనా వృత్తి కల్పించు కమలసంభవా! నమస్తే.

అని ధర్మరాజు చెప్పగా విని చిరునవ్వు నవ్వి మన్ననగా చెప్పనారంభించాడు నలువ.

**హరి దివస మహిమ:**

దండధరా! నీ దొరతనం గురించి విచారించకు.ఇక నేను చెప్తాను విను. భూమిలో రుక్మాంగదుడనే రాజు ఏకాదశీవ్రతం తాను పాటిస్తూ ప్రజలచే శ్రద్ధాభక్తులతో చేయిస్తున్నాడు అని నీవే చెప్పావు గదా! ఆ వ్రత మహిమ అలాటిది. దానిపేరు హరిదివసం. ఆ హరికి ఎంతో యిష్టమైన దినం అది. దానిని ఆచరించే

వారి పాపాలన్నీ భస్మీపటలం అవుతాయి. నీకు తెలియదా? నీ ప్రభుత్వం చెల్లాలని ఆ పుణ్యం పోగొట్టడం నా వశమా? అయితే ఏమి దారి అంటావా? అది చెల్లకుండా ఉండే మార్గం ఏదేనా చూడాలి? ఆ ఏకాదశీవ్రతం సాగకుండా చేస్తే నీకు రెండు చేతులా పని కలుగుతుంది. అంతేకాని ఆ వ్రతానికి సంబంధించే పుణ్యం ఆపడం అనేది చేస్తే శ్రీహరి నా పని పట్టేస్తాడు. నాగతి అప్పు డేమౌతుందో ఊహించలేవు. ఇది ప్రస్తావనయా అందరికీ తెలియాలని శ్రీహరి సేవ గురించి నాలుగుమాటలు చెప్తాను విను. ఆ తర్వాత ఆ రాజు పట్టినవ్రతం మరచిపోయేట్టు ఏదైనా ఉపాయం చూస్తాను.

శ్రీహరిని పోలిన దైవం, హరిభక్తులవంటి పుణ్యాత్ములు, హరి దివసవ్రతం వంటి ధర్మమూ లేవు. శ్రీహరిని సేవించి పుణ్యాత్ములు సకలసంపదలతో సర్వభోగాలనూ పొందుతారు. జన్మాంతమందు శ్రీహరి పదసన్నిధికే చేరుతారు. వారికి తిరిగీ ఏలాటి జననమరణాలు ఉండవు. ఇది ముమ్మాటికీ సత్యం.

హరి పదసేవ కలికల్మష సంహారం. మృత్యుబాధాహరం. అనుకున్న మంచిఫలితం చేచేతులా అందిస్తుంది. శ్రీహరి చరిత్రం పాపలతాలవిత్రం. పరమపవిత్రం. సకల జీవనుతిపాత్రం.

శ్రీహరికి సాటిదైవం ఎవరయ్యా! చూడు తలచినంతనే అక్షయముగా వలువ లిచ్చి నిండుకొలువులో ద్రౌపదీ మానరక్షణ కావించిన సర్వతంత్రదక్షుడు. శరణన్నంతనే చక్రంతో నక్రాన్ని చంపి గజేంద్రుని కాపాడిన కరుణానిధి. ఉన్నాడని అన్నంతనే స్తంభమునుండి ఆవిర్భవించి అయిదేళ్ల అర్భకుని మాట నిలబెట్టిన విశ్వాత్ముడు. దరిజేరినంతనే విభీషణుడికి రాజ్యాభిషేకం చేయలేదా? ఆయన సంతోషిస్తే అంతా స్వర్గమే. ఆయన కోపిస్తే అంతా నరకమే. సర్వశక్తి సంపన్నుడైన శ్రీహరికి కోపం తెప్పించి ముప్పునుండి తప్పించుకునే శక్తిమంతు డెవ్వడు?

చేతు లున్నందుకు జలజాక్షుని పాదపద్మాల్ని పూజించాలి. పాదాలు న్నందుకు శేషశాయికి ప్రదక్షిణం చేయాలి. కన్ను లున్నందుకు పుండరీకాక్షుణ్ణి దర్శించాలి. నాలుక ఉన్నందుకు నళిననాభుని నామ సంకీర్తనం చేయాలి. చెవు లున్నందుకు భవభయ వినాశములైన పద్మనాభుని కథలు వినాలి. శిరస్సు ఉన్నందుకు భక్తి తాత్పర్యాలతో యదుపతికి మ్రొక్కాలి.

శుష్కోపవాసాలు, బీరెండలో చెట్లక్రింద ముక్కు మూసుకు కూర్చుని వాయుభక్షణతో తపస్సులూ, అశ్వమేధాలూ, శరీరం కొంకర్లు పోయేట్టు తీర్థస్నానాలు, కాశీయాత్రలూ శ్రీహరి నామసంకీర్తనకు సాటిరావు.

ఉసిరిక, తులసి విష్ణురూపాలు. వాటిని సేవిస్తే విష్ణుదేవుణ్ణి సేవించిన ఫలం వస్తుంది.

**కార్తికం :**

పాలసముద్రములో యోగముద్రతో శేషశాయియై ఉన్న శ్రీహరి మేల్కొన్న దినం ఏకాదశి. దానికి 'ఉత్థానైకాదశి' అని పేరు. అది కార్తికమాసంలో శుద్ధ ఏకాదశి. ఆ నెలంతా పుణ్యానికి పుట్టిల్లు అని గట్టిగా చెప్పవచ్చు.

కార్తికమాస స్నానం సర్వపాపహరం. ఆ నెలలో తులసి మొక్క ముందు వెలిగించిన దీపం ఘోరపాతకాలను భస్మం చేస్తుంది. కార్తిక మాసంలో చేసే సూర్యనమస్కారం, కార్తీకములో చేసిన గోపూజ తాపత్రయం దోషాన్ని తుడిచిపెట్టుతుంది. ఆ నెలలో శుద్ధద్వాదశినాడు అర్హుడైన విప్రునకిచ్చే దానం విష్ణువున కిచ్చినట్లై ఆ జన్మాంతంలోనే వైకుంఠప్రాప్తి కలిగిస్తుంది.

కార్తికమాసములో తిలదానం, నదీస్నానం, బ్రాహ్మణ సంతర్పణ, హరికి సంబంధించిన వ్రతాలు చెయ్యడం, శ్రీహరి కథాశ్రవణం, హరి నామ సంకీర్తనం, మోదుగ ఆకుల విస్తరిలో భోజనం ముక్తిప్రదములుగా గ్రహించు.

సూర్యుడు మకరరాశిలో ఉన్నప్పుడు ప్రయాగలో అయిదు అశ్వమేధ యాగాలు చేసిన పుణ్యఫలం కార్తికమాసంలో గౌతమీ నదియందు ఒక్కమారు స్నానం చేస్తే వస్తుంది. కార్తికమాస మహిమ చెప్పనలవి కాదు.

(సూర్యుడు మకరరాశిలో ఉన్నపుడున్ను, మాఘ మాసములోను ప్రయాగ క్షేత్రములో స్నానం చేస్తే అయిదు అశ్వమేధయాగాలు చేసిన ఫలం వస్తుంది. కార్తికమాసములో గోదావరి యందు ఒక్కమారు స్నానం వేయి అశ్వమేధయాగాలు చేసిన ఫలం అబ్బుతుంది.

సూర్యుడు మకరరాశిలో ఉన్నపుడు ప్రయాగలో ఒక యజ్ఞం చేస్తే అయిదు అశ్వమేధయాగాలు చేసిన ఫలం వస్తుంది.

కార్తికమునందు ఒక్క గౌతమీ జల స్నానం వేయి అశ్వమేధ యాగాల ఫలం ఇస్తుంది.)

కార్తికమాసంలో ఉసిరికచెట్టు క్రింద దామోదరుణ్ణి అర్చిస్తే సంకల్పసిద్ధి అవుతుంది, ఇక్కడ ఉసిరిక క్రింద భోజనం చేస్తే (నెలంతా) వైకుంఠప్రాప్తి. ఉసిరిక చెట్టుక్రింద చేసిన మంత్రజపానికి ఫలం అనంతం. ఉసిరికచెట్టుతో భూదానం చేస్తే ముల్లోకాలలో కీర్తి ప్రతిష్ఠలు కలుగుతాయి. (ముల్లోకాలు కైవసమవుతాయి) ఉసిరిక క్రింద జాగరం చేస్తే ఆ రాత్రి పడిన పండ్లవలన ముక్తికాంత బంగారు బిందెతో స్నానం చేయించే ఫలం వస్తుంది. కార్తికమాసంలో ఉసిరిక కాయలు ఒక దోసెడు తీసి వాటితో యథాశక్తి బంగారం యోగ్యుడైన బ్రాహ్మణుడికి దానం ఇస్తే శాశ్వతంగా విష్ణులోకమునందే నివాసం.

కార్తికమాసంలో స్నానం, సంధ్య, జపం, హోమం, దేవతార్చన దానం, బ్రాహ్మణ సమారాధన, నక్తం, ఏకభుక్తం, వేదాధ్యయనం కోటి గుణితమైన పుణ్యఫలం ఇస్తాయి.

భానుతనయా! తులసివనమును భక్తితో చూసి నమస్కరిస్తే తులాపురుష దానం చేసిన పుణ్యఫలం వస్తుంది. తులసికి చేసే ప్రదక్షిణం అశ్వమేధం చేసిన ఫలం ఇస్తుంది. తులసితీర్థం సేవిస్తే గంగాతీర్థ సేవ వల్ల కలిగే పుణ్యానికి నూరురెట్లు. తులసీదళాలను ధరిస్తే భూమినంతను దానం చేసిన పుణ్యఫలం కలుగుతుంది. తులసిపూసల జపమాలతో జపం చేస్తే కోటిరెట్ల ఫలం వస్తుంది. తులసికి ముందు ముగ్గుపెట్టిన కాంత లక్ష్మీదేవికి ఇష్టురా లవుతుంది (లక్ష్మీపద సామీప్యానికి వెళ్లుతుంది.)

**అన్నదానం :**

ఇక అన్నదానం ఎలాటిదో చెప్తాను విను. మహాదానా లెన్నో ఉన్నాయి. వాటన్నిటికి మిన్న అన్నదానం. అది చేసినవాని జన్మమే జన్మం.

చాలదూరం నుంచి వచ్చినవానిని, కులం తెలియరాని వానిని, నడచిన బడలికతో చెమటపట్టి ఉస్సురస్సురంటూ వచ్చిన వానిని, రెండు జాములప్పుడు ఆకలి కోర్వలేక గడపద్రొక్కిన వానిని, అల్లంతనే చూచి ఏ కులము? ఏ ఊరు?అని ప్రశ్నలు వేయక అభ్యాగతుడు విష్ణువే అని మనసా భావించి భక్తితో తోడ్తెచ్చి ముందుగా ఇంత మంచి నీరిచ్చి తరువాత ఆసనం వేసి అన్నపానీయా లిచ్చి తరువాత విశ్రమించడానికి తగినచోటు ఇవ్వాలి. ఇది పగలూ ఇది రాత్రి అని చూడకూడదు.

గుమ్మంముందు నిల్చున్న ప్రాణి కుక్కకానీ, చండాలుడు కానీ ఆకలితో నకనకలాడుతూన్నపుడు తాను మానియైనసరే అన్నంపెట్టి ఆదుకోవాలిగాని లేదు పో! అని అనకూడదు. ఆకలితో నిల్చున్న ప్రాణి అలోమని తిరిగిపోతే అంతకన్న పాపం లేదు.

నీరో మజ్జిగో, కాయో పండో, కూరో కూడో ఇచ్చి పంపాలి. ఏదైనా భక్తితో పెట్టాలి. అంతేకాని అతిథిని కాదు పోదని పంపరాదు. అతిథిని ఆకలిదప్పులు తీర్చకుండా పంపితే ఆ అతిథియందున్న పాపం ఆ గృహస్థుకీ, ఆ గృహస్థుని యందున్న పుణ్యం ఆ అతిథికి సంక్రమిస్తాయి. అందునా రాత్రి వచ్చిన అతిథిని అలా పంపితే ఆ వచ్చే పాపం ఇంతా అంతా కాదు. యథాశక్తిగా భక్తిగా అనురక్తిగా ఆ అతిథికి ఉన్న దానితోనే ఆహారం సమకూర్చి పెట్టాలి. ఆకలి తీర్చాలి. ఆ రాత్రి నిద్రించ నిద్రించడానికి కూడ అనువైనచోట తగినశయ్య ఏర్పాటు చెయ్యాలి.

వాకిట అతిథి ఉండగా లక్ష్యపెట్టక తలుపులు వేసి భోజనం చేసే ఇంటి యజమాని అనేక కాలం అతిఘోరనరకం అనుభవిస్తాడు. అక్కడ వాడికి మలమే ఆహారం. అతిథి ఆధారంగా అన్నం పెట్టే వాని ఇల్లే ఇల్లు. అతని జన్మమే జన్మం. అతని బ్రతుకే బ్రతుకు.

ఆకలితో వచ్చిన వానికి అన్నం పెట్టనివాడు బ్రాహ్మణుడైనను కుజనుడౌతాడు. అన్నం పెట్టినవాడు క్రిందిజాతివాడైనా అగ్రవర్ణజుణ్ణి మించిన వాడవుతాడు.

అన్నదానం చేసిన వ్యక్తి ఏ కులం వాడు, వాని అచార వ్యవహార లెలాటివి? సత్యభాషణుడా? అబద్ధా లాడుతాడా? ప్రవర్తన ఎలాటిది? అని ఆలోచించ నక్కరలేదు, ఇనుము పరుసమును తాకినంతనే పసిడి అయినట్లు అన్నదాన సౌభాగ్యంవల్ల ఎలాటివాడున్నూ పాపవిముక్తుడై అందరికీ మాన్యుడౌతాడు. అన్నదానం చేసినవానిని ప్రాతఃకాలంలో తలచుకుంటే దోషాలు తొలగిపోతాయి. అతని మోము చూస్తే పాపాలు పారిపోతాయి. అతనితో మాటాడితే మనస్సు పుణ్యప్రభతో వికసిస్తుంది. అతని పాదధూళి తగిలితే దురితం దూరమవుతుంది. అన్నదానం చేసిన వాని పంక్తిభోజనం భూప్రదక్షిణం చేసిన ఫలం ఇస్తుంది.

కడజాతివాని ఆకలిని పోగొట్టిన అన్నదాత స్వర్గలోకవాసి అవుతాడు. శూద్రు నకు అన్నం పెట్టినవాడు సూర్యలోకవాసి, వైశ్యునకు అన్నం పెట్టినవాడు చంద్రలోకవాసి, క్షత్రియునకు భుక్తి నిచ్చినవాడు వైకుంఠవాసి. బ్రాహ్మణునకు భోజనం పెట్టినవాడు దివ్యలోకాలన్నిటా చిరకాలం ఉండి చివర విష్ణులోకనివాసి అవుతాడు.

అన్నదానం నిత్యమూ చేసేవాని ఇంట తిరిగే దాసీదాసజనానికీ కూడా హరిలోకనివాసం కలుగుతుంది.

నిత్యమూ దీనులకు అన్నదానం చేసేవానికి గ్రహవక్రదోషం, పీడలు, కర్మదోషాలూ, అపమృత్యుదోషం పోతాయి. రాజానుగ్రహం కలుగుతుంది. అపకీర్తి రాదు. కీర్తి పెంపొందుతుంది.

సముద్రంలో పుట్టే అలలను; ఇసుకరేణువులను, గంగాజల శీకరాలను, వర్షధారలను, చుక్కలను లెక్కించవచ్చు గాని, అన్నదానం చేసిన వాని సుకృతం యొక్క మహిమ లెక్కపెట్టడం సాధ్యం కాదు.

కపిలగోదానం, సువర్ణదానం, సువర్ణగోదానం, ఈశ్వరార్చన, వాపీకూప తటాక నిర్మాణం, గజతురగదానం - అన్నదానం వల్ల వచ్చే పుణ్యంలో శతాంశమునకు పోలవు.

అన్నదాతముందు వరుణాదుల విమానాలు వచ్చి నిలుస్తాయి మా లోకానికి రావయ్యా అంటే మా లోకానికి రా! అని.

మరి ఇలాటి పుణ్యాత్ములు నీ లోకానికి ఎందుకు వస్తారు.

**క్షేత్రాలు - తీర్థాలు :**

ఇంకా నీ చోటికి రాని పుణ్యాత్ములను చెప్తాను విను. పుణ్యక్షేత్రాలు పుణ్యతీర్థాలు చూసి ఉంటావు లేదా వారూ వీరూ చెప్పడం విని ఉంటావు. వాటిని సేవించిన వారు మీ ఊరు రారు.

కాంచీపురం, కుంభకోణం, హరిద్వారం, రామేశ్వరం, సింహాచలం, గయ, అంతర్వేది, మాయా, పంచారామాలు, అహోబిలం, బ్రహ్మకపాలం ఈ పుణ్య క్షేత్రాలకు వెళ్ళినవారు మీ నగరం దరికి రారు.

నైమిశం, కురుక్షేత్రం, కేదారం, గోకర్ణం, అవంతి, మధుర, కోణార్కం, ద్వారక, అరుణాచలం, శ్రీకాళహస్తి, శ్రీశైలం, అయోధ్య చూసినవారు నిన్ను చూడరు.

చంపకారణ్య బదరికాశ్రమాలలోను, హరిద్వారంలోను, శ్రీ జగన్నాథ క్షేత్రమందును ఒక్కరేయి నిద్రించి వచ్చిన పుణ్యాత్ములు నీలోకానికి రారు.

సరయువు, వేగవతి, గంగ, నర్మద, తుంగభద్ర, పుష్కరిణి, చంద్రపుష్కరిణి, గోదావరి, బాహుద, కృష్ణవేణి, గండకి, వరణ, గోమతి, యమున, మంజులా సాగరసంగమం - వాటిలో స్నానం చేసినవారు నిన్ను చూడరు.

**పుణ్య పురుషులు :**

నిరుపేదయైన విప్రబాలునకు ఉపనయనం చేసినవాడు, నిర్ధనుడైన ఉత్తమవంశ సంభవునకు పెండ్లి చేసినవాడు, జీవనోపాధి లేని విప్రునకు పంటభూమి దానం చేసినవాడు, తీర్థయాత్రలకు వెళ్లే దీనులకు యథాశక్తిగా ధనసహాయం చేసినవాడు, ఆపదలో ఉన్న జంతువును కాపాడినవాడు, విష్ణువ్రతాలు తప్పక చేసినవాడు పుణ్యపురుషులు. వీరు నీ పురమునకు రారు.

శరణన్న శత్రువున కభయమిచ్చినవాడు, వేసవిలో పసులకు తెరువునందు నీరు త్రాగటానికి ఏర్పాటు చేసినవాడు, జీర్ణదేవాలయాలు, విప్రగృహాలను బాగుచేయించినవాడు, ముదుసలులైన తల్లిదండ్రులను భక్తితో పోషించేవాడు, ప్రభువు వద్ద ఉండి ఆర్తుల బాధలను పోగొట్టే వాడున్నూ కలలోనైన దక్షిణదిక్కు చూడడు.

## ఏకాదశీ మాహాత్మ్యం

పద్మనాభుని పదపద్మాలను శ్రద్ధాభక్తులతో ఆరాధించే భక్తశిరోమణి నీ భవనానికి రాడు!

దేవాలయంలో ఉన్న ధూళి తుడిచినపుడు దాని నుంచి ఎగసిన రేణువులు ఎన్నో అన్ని సంవత్సరాలు అతడు వైకుంఠంలో హాయిగా ఉంటాడు.

దేవాలయం ముందు మంచినీళ్లు చల్లి అలికినవాడు ఆకల్పాంతం హరిపుర నివాసియై ఉంటాడు.

విష్ణ్వాలయములో పద్మాలముగ్గు పెట్టే వ్యక్తి వైకుంఠములో పద్మ సంఖ్యగల సంవత్సరాలు భద్రంగా ఉంటాడు.

ఆవుపాలతో కొబ్బరినీళ్ళతో శివునకు గానీ, కేశవునకు గానీ అభిషేకం చేసే పుణ్యపురుషుడు నీ పట్టణం ప్రక్కకు రాడు.

చంద్రశేఖరుని శిరసున భక్తితో ఒక పుష్పముంచినవాడున్ను, మండువేసవిలో ముక్కంటికి వసుధారబిందె సమర్పించినవాడున్ను, శివాలయములో శివలింగమునకు భక్తితో వీవనపట్టి విసిరేవాడున్ను, శివుని ముందు భక్తిభావభరితంగా నృత్యం చేసేవాడున్ను, శివునిముందు దీపారాధన చేసినవాడు, శివాలయానికి నిత్యమూ ప్రదక్షిణ నమస్కారం చేసేవాడున్ను దక్షిణదిక్కునకు రారు.

వేసవిలో గొడుగులు, పాదరక్షలు, జలపాత్రలూ బ్రాహ్మణులకు భక్తితో దానమిచ్చినవారు నీ నగరం పొలిమేరలకైనా రారు.

పతులతో సహగమనం చేసిన సతులు, సర్వసంగ పరిత్యాగం చేసిన సంయములు, సంయమనీ నగరం సరసకు రారు.

బాటసారులకు అక్కడక్కడ చలివేంద్రాలు పెట్టించినవాడు, ఆపదలో ఉన్న ఆవును కాపాడినవాడు, కరవుకాటకాలలో ఇంటికి వచ్చిన అతిథిని ఆదరించి అన్నపానా లిచ్చి ఆదుకున్నవాడు, ఇంటికి నిప్పంటుకున్నపుడు సాహసించి ఆ యింట చొరబడి వస్తువులనూ ఇంటివారినీ కాపాడినవాడున్ను నీ మొగం చూడరు.

మంచికావ్యాలు విద్వత్కవులవల్ల అంకితంపొంది అశాశ్వతమైన కీర్తి పొందిన సుజనులు, ప్రతిఫలం ఆశించక సత్పాత్రదానం చేసిన త్యాగులు శివకేశవ కథాత్మకములైన కావ్యాలు వ్రాసిన కవులు నీ నగరానికి రారు.

పరకాంతలను తోబుట్టువులుగా భావించి ప్రవర్తించే సుశీలురు, పరధనాని కాసపడని పవిత్రచరిత్రులు, పరాకుగానైనా అసత్యమాడని వివేకులు, అన్ని జీవులనూ తమవలె చూసే దయాళువులూ, ఆశ్రితులను బంధువులను అతిథులను సంరక్షించేవారు నీ పట్టణానికి రారు.

ఫలవృక్షాలతో పూదీగలతో తోటలను పెంచేవారు నీ నివాసం చూడరు.

పూజాపురస్కారాలు లేని దేవతావిగ్రహాలను భక్తితో పూజిస్తూ సమయానికి నైవేద్యం సమర్పించే సజ్జనులూ, రోగాలతో బాధపడుతున్న వారికి తగిన మందులిచ్చి ధనాని కాశపడక రోగనిర్మూలనం చేసే సద్వైద్యులూ, గ్రహణ సంక్రమణ సమయాలలో పితృదేవతలను యథావిధిగా అర్చించే బుద్ధిమంతులూ నీ నగరికి రారు.

మాఘమాసంలో చెలమనీటనైనా, నదీజలాల లోనైనా స్నానం చేసిన పుణ్యాత్ముడు, విశిష్టపదార్థాలను గురువునకు సమర్పించే శిష్యుడు, కాశి గయప్రయాగ మొదలైన పుణ్య స్థలాలలో సుంకం లేకుండా కట్టడిచేసిన ఉద్యోగి, రేయివచ్చిన అతిథికై హాయిగా భోజన భాజనాది సదుపాయములు చేసిన గృహస్థు నీ మొగం ఎన్నడూ చూడడు.

చెరువులు త్రవ్వించిన పుణ్యపురుషుడు, సులభమైన వెలకు ధాన్యం అమ్మిన ధన్యాత్ముడు,చెరలో ఉన్నవారిని విడిపించిన శిష్టజనుడు నీ పురానికి రాడు.

తాటాకు వీవనలు, గొడుగులు, ధ్వజచామరాల్ను, పల్లకీ, రథం,అద్దం, వాద్యాలు, పానుపు, మేలైన వస్త్రాలు, సొమ్ములు, సుగంధ సామగ్రి శ్రీహరికి సమర్పించిన పుణ్యాత్ములు నిన్ను కలలోనైనా చూడరు.

అగ్నిష్టోమం, వాజపేయం, అతిరాత్రం చేసినవారు; కపిలధేను, హిరణ్య, శయ్యా, ధేను, రజత, కృష్ణాజిన, సాలగ్రామ, శివలింగదానాలు చేసినవారు; గృహదానం, మహిష, గుడ, లవణ,ఘృతదానాలు,కన్యాదానం, విద్యాదానం వేసినవారున్నూ పుణ్యాత్ము లవుతారు.

శ్రీ లక్ష్మీనారాయణ, అనంత, ఉమామహేశ్వర, కృష్ణాష్టమీ, కృష్ణచతుర్దశీ, చాంద్రాయణ వ్రతాలూ, సోమ శనివార వ్రతాలూ తప్పక చేసే వారు; దేవ బ్రాహ్మణ ప్రతిష్ఠా సంరక్షాపరులున్నూ నీ నగరానికి రారు.

ధర్మరాజా! ఇప్పుడు నేను చెప్పిన శ్రీ విష్ణుమాహాత్మ్యం, ఆమలక (ఉసిరిక) తులసీ కార్తీక విశేషాలు, అన్నదాన ప్రభావం, సకల ధర్మాలు శ్రద్ధాభక్తులతో చదివే వారికీ, పుస్తకమున వ్రాసిన వారికి, వినేవారికీ ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధీ, పుత్రపౌత్రసమృద్ధీ, మోక్షలక్ష్మీ సౌఖ్యమూ కలుగుతాయి. విన్నావా! ఇంకొక్క విశేషం మళ్ళీ చెప్తున్నాను విను.

దానాలెన్నో ఉన్నాయి. అవి అన్నీ పుణ్యము నిచ్చేవి అవుగాక! అన్నిటికన్నా మిన్న శ్రీహరి వాసరవ్రతం (ఏకాదశీవ్రతం). అది భాగ్యహీనుడికి పట్టువడదు.

దానిని పట్టేవానికి ఐహికాముష్మిక సుఖసంపద అరచేతి ఉసిరికపండు. ఆ వ్రతానికీ ఇతర వ్రతాలకీ ఏనుగుకీ దోమకీ ఉన్నంత అంతరం ఉంది అని గ్రహించు! విచారించకు. నీ సమాచారం ఇక ఆలోచిస్తాను. నిబ్బరంగా వెళ్ళు అని ధర్మరాజును చతుర్ముఖుడు ధైర్యం కలిగించి పంపాడు.

**మోహిని:**

యముడు వెళ్లిన తర్వాత ఏమి కర్తవ్యం? అని ఒక్క నిమిషం ఆలోచించాడు. తల ఊపాడు. ఏదో ఆలోచన మెరుపు మెరిసినట్టయింది. ఎట్టయెదుట ఒక భువనమోహిని రూపొందింది. చూసినవారి కళ్లలో మత్తుమందు చల్లినట్లయింది. ఇక ఆశ్చర్యానికి అవధి లేదు. అందచందాలు క్రోడీకరించి ఒక అందగత్తెను చతుర్ముఖుడు సృష్టించేశాడు. ఇక ఇంతకన్నా ఏ లోకంలోనూ సౌందర్యవతి అనదగిన సుమగాత్రి ఉండదని ఏకోక్తిగా అన్నారు వేల్పులు.

చిగురాకులు, తాబేళ్లు, రత్నాలు, తారలు, మర్రిపళ్లు, దొనలు, అరటులు, ఇసుకతిన్నెలు, రావాకు, సుడి, బయలు అలలు, కరికుంభాలు, తూండ్లు, కనకగుహలు, పద్మాలు, పెసరకాయలు, కలువరేకులు, శంఖం, అద్దం, బింబం, మల్లెమొగ్గలు, శ్రీకారాలు, సంపెంగ, గండుచేపలు, విండ్లు, నెలవంక, తుమ్మెదలు, జాబిల్లి, చీకటి – వరుసగా ఒక సుందరీరూపం ధరించాయి అనడానికి సందేహం లేదు.

మదగజయాన, కలకంఠి, పసిడివన్నె నెమ్మేని ముద్దులగుమ్మ, పద్మగంధి.

అడుగుల కెంపు పద్మరాగప్రభను పరిహాసం చేస్తూంది. తెలికన్ను గవడాలు తొలకరి మెరుపుతీగల మాలికను సృష్టిస్తూంది. ముద్దారుచెక్కిళ్ల వెలుగు నిద్దంపుటద్దంపు చెలువుతో పొత్తు చేస్తుంది. గబ్బిగుబ్బల తళుకు మేలిమి బంగారు నిగ్గుకి సిగ్గు పుట్టిస్తూంది. ఉంగరాల ముంగురులు ఇంద్రనీలాల రంగును పుణికి పుచ్చుకున్నట్లున్నాయి. ఆ సౌందర్యం అఖిల మోహనం. కాకపోతే ఆ విరిబోడి మోహిని ఎలా అవుతుంది?

మోహినీ సుందరమూర్తిని చూసి సృష్టికర్త తానే ఆశ్చర్యపడ్డాడు. ఇంత అందగత్తెను రూపొందించానా అని. ఆనందంగా తల ఊపి ఆ సుందరితో ఆదరంగా అన్నాడు.

ఇలా దగ్గరగా రావమ్మా! మోహినీ! నీ సృష్టికి కారణం చెప్తాను విను.......

మోహిని అల్లనల్లన నలువను సమీపించింది................

ఏకాదశీ మాహాత్మ్యం

బ్రహ్మ చెప్తున్నాడు, భూలోకంలో రుక్మాంగదుడు అనే పేరుగల ఒక రాజు. హరిభక్తులలో అగ్రగణ్యుడు. అతడు ఏకాదశీవ్రతం అతి శ్రద్ధగా, బుద్ధిగా, ఆసక్తిగా,భక్తిగా పాలిస్తూ ఉంటున్నాడు. తాను చెయ్యడమే కాదు, తన పలుకుబడి సాగుతూన్నంత దేశంలో బంధుమిత్రులచే ప్రజలచే చేయిస్తున్నాడు. దాని మహిమవల్ల జనులు ఇలలో జీవించి వున్నంతకాలం శ్రీహరి కృపవల్ల సుఖసంతోషాలతో గడుపుతూ జన్మాంతమందు విష్ణుపదసన్నిధికి పోతున్నారు. దానివల్ల యమలోకం ఈనాడు పాపశూన్యమై వట్టిగొడ్డులాగా అయిపోయింది; నేనేమి చేయాలని ధర్మరాజు వచ్చి మొరపెట్టాడు. నేను ఏదో ఉపాయం చూస్తాను. విచారింపకు వెళ్ళు! అని ధైర్యం చెప్పి పంపించాను.నిన్ను సృష్టించాను. ఎందుకంటావా? నువ్వు భూలోకంలో రుక్మాంగదుని వద్దకువెళ్ళి అతనిచే ఆ ఏకాదశీవ్రతం మానిపించాలి. నీ శక్తినీ యుక్తినీ ప్రయోగించు. ఒక్కమాట మర్చిపోకు. ఆ రాజు సామాన్య మానవుడు కాడు. ధైర్యానికి మేరువు. గాంభీర్యానికి అంబోధి. పరమభాగవతుడు. అలాటి మహాత్ముని వద్దకు నిన్ను పంపుతున్నాను. ఇది అంత తేలికగా చెయ్యవలసే పనికాదు సుమా! ఘనకార్యం. నీ ఆటా పాటా మాటా చూపూ ఏపూ కోపూ ప్రదర్శించి ఆ భూపతికి క్లైపు పట్టించి ఏకాదశీవ్రత విముఖుణ్ణి చేయాలి. నేను మనసా నిన్ను సృష్టించినందుకు తగిన ఫలితం పొందాలి. విన్నావా? అని అనగా మోహిని తేలికగా ఒక నవ్వు నవ్వి గర్వోక్తిగా అన్నది.

సృష్టికారకా! భూలోకంలో ఒక నరపతి, మేరుధీరుడు,అంబోధి గంభీరుడున్నాడా! వ్రతం చేస్తున్నాడా? ఆ వ్రతం మానిపించాలా? దానికి ఒక మోహినీ సృష్టి కావలసి వచ్చిందా? మంచిదే. సృష్టించిన తర్వాత ఇంత సందేహం ఎందుకూ? నాకీ హెచ్చరిక తోడా? సెబాస్. మరి నన్నెందుకు సృష్టించినట్టు? పద్మాసనా? మన్నించు నా మాట. ఊరూపేరూ లేని ఏ అడదానికో చెప్పినట్టు నాకు చెప్పడం అనావశ్యకం.

నా ముద్దుమోము, మొలకనవ్వు, వాలుచూపు, మందగమనం, నయగారం, ఒయ్యారం, కండచక్కెర లొలికే పలుకు................ ఇనుప కచ్చడాలు కట్టుకున్న విరాగుల్నే సరాగుల్ని చేస్తాయి. ఇక సామాన్యరాజూ గీజూ ఒక లెక్కా? నా వీణాగాన సుధారసం చెవులలో పడినంతనే వలరాజే వలపుతో పరవశుడై నా దాసుడౌతాడు. ఆ రుక్మాంగదు డేపాటివాడు? బేడి సల త్రుళ్ళింతలాడు నా చురుకు చూపులతో ఆ రాజును నా దారికి తెస్తాను. నేరు పెందుకు? గోటితో మీటేదానికి గొడ్డలెందుకు? కంటపడిన ప్రియుణ్ణి కరగింపలేని జవరాలి రూపురేఖ లేలా? రూపూ చూపూ కన్నూ చెన్నూ రాతిబొమ్మకు లేవూ?

విభవంలేని విత్తం, వేదంలేని విప్రుడు, వాసనలేని పూవు, రాజు మెచ్చని విద్య, ప్రభువులేని రాష్ట్రం, ప్రేమలేని సాంగత్యం, ప్రియుని వశపరచుకోలేని అలివేణి ఎందుకయ్యా? ఏమంటావు?

అని కళ్లు త్రిప్పుతూ ముంగురులు సవిలాసంగా సవరించుకుంటూ మాటాడిన మోహినిని చూసి సృష్టికర్త సంతోషించి మంచిది. మించుబోడీ! నీకు తోడుగా ఈ పూబోడులను తీసుకొని వెళ్ళి కృతార్థురాలవై రా! అని కొందరు సుందరీమణులను అప్పగించాడు. నవరత్నాలు పొదిగిన వీణ ఒకటి ఇచ్చాడు. దివ్య విమానం ఎక్కించి శుభమస్తు అని చేయూపాడు విమానం ఎగిరింది.

సమవయస్కలైన ఇందుముఖులతో మోహిని వ్యోమయానంలో గగనవీధిలో పయనించి సంకల్పానుసారంగా మందరగిరివద్దకు చేరి చెలికత్తెలతో అక్కడ క్రిందికి దిగింది. నాలుగడుగులు వెళ్ళింది. ఒకచోట సువర్ణమయమైన శివలింగం కనిపించింది. ఆ లింగమూర్తికి ప్రదక్షిణం చేసి దండప్రణామాలు చెల్లించింది. అక్కడ లభించిన సురభికుసుమాలతో అర్చించింది.

**శివస్తుతి :**

భక్తితో చేతులు జోడించి 'బ్రహ్మాది సురవందిత పదాబ్జా! నమస్కారం. శతసహస్ర భాస్కరప్రభా భాసమానా! ప్రణామం. డమరు త్రిశూల ఖడ్గ కపాలపాణీ! అభివాదం. గగనగంగోత్తమాంగా! నమోవాకం. చంద్రశేఖరా! కైమోడ్పు. మంత్రరూపా! నమస్తే.'

గజచర్మమే కాని వేరొకవస్త్రం ధరించని మదనహరుడవు పునుక పేరులే గాని రత్నాలంకారాలు ధరింపని రాజశేఖరుడవు. భస్మాంగరాగమే కాని చందనచర్చ సేయని సద్గుణుడవు. కాలకూటమే కాని పక్వాహారం ఆరగించని దోషభంజనుడవు. ఏ లోకంలో ఎవరైన ఇలాంటి అసాధారణాచారం కలవారున్నారా? పరమేశ్వరా! నిజ మాలోచిస్తే నీవే దేవతాచక్రవర్తివి. కామేశలింగా! కరుణించు.

శంకరా! నీ పాదపూజనం ఎంత ఘనమనగలను? ధనధాన్యవర్ధనం, మృత్యునిధనం, భక్తావనం, భక్తినిధిని చూపే అంజనం.

శూలీ! కపాలీ! నయశాలీ! చంద్రమౌళీ! క్రతునిర్మూలీ! శుభశీలీ! సుగుణాళీ! కరకీలీ! చర్మచేలీ! వందన మందుకో ప్రభూ!''

అని ఈశ్వరుణ్ణి స్తుతించి ఆ దేవుని పాదోదకప్రసాదాలు స్వీకరించి అచటనే విహరిస్తూ ఇష్టకామేశ్వర లింగమూర్తిని సేవిస్తూ, ఆ దేవునిపై రత్నవిపంచి మ్రోయించి షడ్జపంచమ స్వరాలతో అనేక రాగతాళ సంకీర్తనలు పాడుతూ ఉంది.

ఆమె చెలికత్తెలు తమ కన్నులు మెచ్చినచోట స్వేచ్ఛగా విహరిస్తూ కాలక్షేపం చేస్తున్నారు.

అని సూతుడు నైమిశారణ్యవాసులైన మునులకు మోహినీ వృత్తాంతం చెప్పి వారి కోరికపై తరువాతి కథ చెప్పడానికుపక్రమించాడు.

# 3

**రాజనీతి :**

మోహినిని సృష్టించి పంపిన తర్వాత సృష్టికర్త భూలోకంలో రుక్మాంగదుని ఏలుబడికి చెందిన భూభాగంలో ఉన్న అడవులందు ముందు కనివిని ఎరుగని వివిధజాతుల ఘోరమృగాలను సృష్టించేశాడు. అవి ఇన్నీ అన్నీ అని ఎన్నడానికి గానీ, అవీ ఇవీ అని చెప్పడానికి గానీ ఎవ్వరికీ శక్యం గాదు. అవి వినేవారి గుండెలు పగిలేట్టు కర్ణకఠోరంగా అరుస్తూ మూక మూకలుగా బయలుదేరి పొలాలలో తోటలలో పల్లెలలో చెలగాటం ఆరంభించాయి. కోతకి వచ్చిన సస్యాలను కొన్ని పాడుచేస్తున్నాయి. పొలాలన్ని హలాలతో దున్ని దుంప త్రెంపినట్లున్నాయి. తోటల్లో ఫల వృక్షాలు కూకటివ్రేళ్లతో కూలిపోయాయి. పల్లెల్లో ప్రజల ఇళ్ళు కోతులచే కొండ ముచ్చులచే అల్లకల్లోలమై పోయాయి. పసులసాలల్లోని పసుల మందలు క్రూరమృగాల ఘోషతో చచ్చినవి చావగా మొండిగా ప్రాణాలున్నవి కట్టుత్రాళ్లు త్రెంపుకొని నలుదిక్కులా చెదరిపోయాయి. కలలోనైనా అంతవరకు ఈలాటి ఆపద ఎరుగని ప్రజ సుఖంగా నీడపట్టున బ్రతికే గతిలేక అందరూ ఒకచోట చేరి మహానుభావుడు మన రుక్మాంగద మహారాజుకి మన గోడు చెప్పుకుంటే ఏమైనా మేలు కలగదా అని ఆలోచించుకున్నారు. అక్కడా ఇక్కడా దొరికిన పళ్ళూ కాయలూ కానుకగా సమకూర్చుకొని కొందరు రాజసమ్ముఖానకు వచ్చారు. తెచ్చిన కానుకలు ముందుంచి చేతులు జోడించి మ్రొక్కి మృగములవల్ల వచ్చిన మహోపద్రవం విన్నవించి రక్షించు మా రాజా! అని గోలపెట్టారు. వారి దురంతమైన చింత అర్థం చేసుకున్నాడు రుక్మాంగదుడు. ధైర్యం చెప్పి 'ఇపుడే వచ్చి వేటాడి వాటిని తూటాడి మీపాటు చక్కచేస్తాను. వెళ్ళండి' అని పంపించి, సేనాపతిని రప్పించి వేటకి తగిన సన్నాహం చేయవలసిందని ఆదేశించాడు. సేనాపతి చురుకుగా జాగిలాలనూ, వలలూ మున్నగు సాధనాలనూ, శౌర్యధైర్యాలకు ఆటపట్టులయిన భటులనూ, వాహనాలనూ, ఆహారపదార్థాలనూ సమకూర్చి ''ప్రభూ! సర్వం సమాయత్తం!'' అని విన్నవించాడు. అప్పుడు రుక్మాంగదుడు కొడుకుని రావించి తాను వేటకు వెళ్తున్నట్లు చెప్పి 'నాయనా! పరిపాలకుడు ప్రవర్తించే పద్ధతి నీకు తెలుసు. అయినా చెప్తున్నాను. సావధానంగా విను. నేను తిరిగి నగరికి వచ్చేవరకూ నా చెప్పిన చొప్పున ఒప్పుగా రాజ్యం ఏలుతూ ఉండు'.

కుమారా! నీతి తప్పక నేలనేలే ప్రభువు ఇంద్రుడులాగా రాణిస్తాడు నీతిని తప్పి నడిచేవాడు సిరిసంపదలు చెడి దీనుడైపోతాడు. శత్రువులను శత్రువుల సంబంధులను, మునుపు తనచే శిక్షపొందిన వారినీ రాజు నమ్మకూడదు. తన రాజుకి అపకారం చేసి నీ దగ్గర సేవ చేయడానికి వచ్చిన వ్యక్తిని చేరదీయ కూడదు.

ఆహారపదార్థాలను ఏనాటి కానాడు వైద్యపరీక్ష చేయించక ఆరగించకూడదు. పరరాజు పంపిన నగలను, వస్త్రాలనూ, సుగంధ ద్రవ్యాలనూ విషయంత్రపరీక్ష చెయ్యక ఉపయోగింప రాదు.

ప్రభువు, మంత్రి, మిత్రుడు, ధనాగారం, కోట, భూమి, సేన అనే యీ యేడున్నూ సప్తాంగములు. వీటిని రేయింబగళ్ళు రక్షించుకునే దీక్షతో రాజు ఉండాలి.

జలకేళి, వనవిహారం, భోజనం, వాహ్యాళి, దేవతోత్సవం, అంతఃపురకాంతతో సాంగత్యం, వేట, గజ, అశ్వసందర్శనం – అనే వీటియందు ప్రభువు వివేకంతో ప్రవర్తించాలి.

చిత్తశుద్ధి, చురుకైన బుద్ధి, శాంతి, వృద్ధాచారం, నీతిశాస్త్ర పరిజ్ఞానం, కర్మశ్రద్ధ, ధైర్యంకల బుద్ధిమంతుణ్ణి మంత్రిపదవియందు నియమించాలి.

హరుడు వెండికొండను, హరి పాలకడలిని నివాసములుగా చేసుకొని కాపాడుకొంటూన్నట్లు రాజు కోటను, కొండలను, అడవులను కాపాడుకుంటూ ఉండాలి.

తృణకాష్ఠ జలములను, శాకతైలధాన్యములను, యంత్రబలాలను కందకాలను, ప్రాకారములను, సాధనసామగ్రిని ధర్మపద్ధతి ననుసరించి పోషిస్తూ వృద్ధిచేసుకోవాలి.

న్యాయంగా ప్రజలను పోషించే రాజును, ఆపత్సమయంలో ప్రజలు ధన ధాన్య సహాయకార్యములతో చేయూతనిచ్చి సుఖచిత్తుణ్ణి చేస్తారు.

ధర్మపరిపాలన చేసే రాజు ఏలుబడిలోకి పరరాజు ప్రజలుకూడా సుఖజీవనం కోసం వలస వస్తారు. అధర్మపద్ధతిని పరిపాలించే రాజును స్వరాష్ట్ర ప్రజలే విడిచిపోతారు.

తన ప్రయోజనం కోసం ప్రజలనుంచి మితిమీరి ధనం తీసుకుంటే చెరువును త్రవ్వి చేపలు పట్టినట్టు అవుతుంది. ప్రజల బాగోగులు అరసి క్రమపద్ధతిని రాజు చూస్తూ ఉంటూ రాజ్యభారం మంత్రిమీద ఉంచాలి. అలాకాకుండా అంతా మంత్రికే అప్పగించి తాను చేతులు ముడుచుకు కూర్చుంటే క్రమేణ విత్తం, విభవం చెడిపోతుంది. ఆ మంత్రే రాజై కూర్చుంటాడు.

భూమి అభివృద్ధి పొందితే భూపతి అభివృద్ధి పొందుతాడు. భూమి రక్షణ క్షీణిస్తే రాజు రక్షణ లేకుండా పోతాడు. మితిమీరి ప్రజలనుంచి పన్ను వసూలు చేయడం మొదవుల పొదుగులలో ఒక చుక్కైనా లేగలకి విడువక పాలు పిదికినట్టు అవుతుంది. అనుకూల పద్ధతిని అనువైనట్లు పన్ను వసూలుచేయడం పాడి మొదలవులను పెంచినట్టవుతుంది.

జార చోరబాధలూ, అగ్ని ప్రమాదాలూ చూస్తూ కడు జాగరూకతతో దొరతనం నెరపుతూ ఉండాలి.

గోరక్ష, వాణిజ్యం రాజుయొక్క ధనాగారం అభివృద్ధికి అధారం. వాటిని చక్కగా చేయిస్తూ ఉండాలి.

శిక్షించడానికి సాధ్యంకాని వ్యక్తులు, తనకు కావలసినవారు కొందరుంటారు. అలాటివారిని ధనధాన్యాధ్యక్షులుగా నియమించ రాదు.

వ్యవసాయానికిగాను పలువిధములైన విత్తనాలను సమకూర్చి ఉంచి పరిపాలకుడు సమయానుసారంగా వాటిని సేద్యగాండ్రకు ఇవ్వాలి.

ప్రజలనుండి పన్ను వసూలు చేయడం ఎలాగూ ఉండాలో తెలుసునా? తుమ్మెద మకరందం త్రాగినట్టు వసూలు చేయాలి. సేవకులచే పనులు చేయించుకోవడం అలాగే ఉండాలి.

అన్నిటా సమానుడైన వానితో సామం, తనకన్నా అధికునితో దానం, అత్యాశ కలవానితో భేదం, బలహీనునియందు దండం ప్రయోగించి వశపరచుకోవాలి.

ప్రభువు తన నగరిని ప్రాకారం, అగడ్త, వీరభటసేన, రథ గజ తురగ రక్ష, ఆయుధ సమృద్ధి సరిగా ఉందోలేదో అని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ కాపాడుకుంటూ ఉండాలి.

ఎంత అవసరమైనా కానీ, కొడుకే కానీ ఆహ్వానం లేకుండా చొరవ చేసి రాజభవనంలోకి వెళ్ల కూడదు.

ప్రభువు పైసా అయినా పనికిమాలిన ఖర్చు చేయకూడదు. సమయానికి పణం తృణంలాగా ఖర్చుపెట్టాలి.

బలవంతుడైన ప్రభువుతో ఏనాడూ పగ పెట్టుకోరాదు. యుద్ధంలో శత్రువును చలించక నిల్చి సాధించాలి. సాహసించాలి. అరిచే కుక్కని అదిలించి బెదరించి తప్పించుక పోవాలిగాని పరుగెత్తకూడదు. పరుగెత్తితే అది వెంట తరిమి కాలందుకుంటుంది.

నీటిలో నున్న చేపను అదనెరిగి కొంగ పట్టునట్లు సమయం అయే వరకూ ఊరకుండి తరికాగానే పగవాణ్ణి ఎదిరించి పడగొట్టాలి. అంతవరకు వాటి ఆటలు గాలికి వదిలేయాలి.

నిర్దోషుల్ని శిక్షించడం, దోషుల్ని విడిచిపెట్టడం అనేది ప్రభువు స్వనాశనం కోరి తెచ్చుకున్నట్లే అవుతుంది.

వర్ణాశ్రమాలూ, ధర్మాలూ తప్పనిసరిగా ప్రభువు ప్రజలను భద్రంగా నడపాలి.

ఆదాయవ్యయాలూ, రాష్ట్ర సమాచారాలూ, శత్రువిషయాలూ, ఆశ్రితుల సమాచారం, ఉద్యోగుల ప్రవర్తన, వచ్చిన యాచకుల స్థితి, బ్రాహ్మణుల బ్రతుకూ ప్రభువు క్షుణ్ణంగా తెలుసుకుంటూ తదనుగుణంగా పరిపాలన నెరపుతూ ఉండాలి.

ఏ పరిస్థితిలోనూ బ్రాహ్మణ ధనం తీసుకోకూడదు.

మంత్రగోపనం (తనవారితో తను ఆలోచించినది రెండో కంటివానికి తెలియకుండా కట్టుదిట్టం చేయడం), మర్యాద, రాజ్యతంత్రరక్ష,దానగుణం, ధర్మబుద్ధి, శౌర్యధైర్యాలు, బ్రాహ్మణ సంరక్షణ, సత్యభాషణం ప్రభువుకి అవశ్యకం.

మనవులు విని ఆపదలో అడ్డుపడి జీతంబత్తెం తప్పక ఇస్తూ, తల్లిదండ్రుల పోషణ ఏమరక, అన్నిటా సమర్థులైన వారికి బిరుదులూ నూతనాంబరాభరణాలు ఇచ్చి మన్నించి నలుగురిలో పొగడడం ఇలాంటివి చేస్తూ ప్రభువు తనవారిని పోషిస్తుండాలి. తన వద్ద పనిచేసే సేవకునితోనైనా ప్రభువు మనసు కలిసి ఉండాలి కానీ ఎరుసుగా బెరుసుగా ఎన్నడు ఉండకూడదు.

తమ కావ్యాలు అంకితమిచ్చిన కవులకు, ఆశ్రితులకు, వీరభటులకు (సైనికులకు), ఆప్త బంధువులకు తగిన సన్మానాలు చేసి సంతృప్తులను చేయాలి.

అని నీతిపాఠం చెప్పి వేటగాండ్రను రప్పించి తగిన సాధనాలతో సిద్ధంగా ఉండండని ముదల ఇచ్చాడు.

వేటకు తగిన కుక్కలు, కోలలు, వలలు, బరిసెలూ............. అన్నీ గడియలో సిద్ధ మయ్యాయి.

అంతఃపురంలో ఉన్న సంధ్యావళికి తెలిసింది రాజు వేటకి వెళతాడని, ఆమెకు నచ్చలేదు. అయన ఉన్న భవనానికి వెళ్ళింది. వేటగాని వేషముతో ఉన్న పతినిచూసి ఆ సతీమతల్లి సవినయంగా నమస్కరించి మెల్లగా దరిజేరి సన్నగా అన్నది.

## తగునా?

ప్రభూ! వేటకి వెళ్ళుతున్నట్టు తెలిసింది. వినడానికే ఆశ్చర్యంగా ఉంది. ఇది నీ పట్ల ఎన్నడూ కనీవినీ ఎరుగని వార్త. తెలిసి ఈ హింసా కృత్యానికి మీ వంటి భక్త శిరోమణి పూసుకోవడం తగునా? అంతే కాదు. వేట నిషిద్ధ కార్యాలలో మొదటిది కాదూ? సత్ప్రవర్తనా, సద్గుణములూ, సద్ధర్మమూ కల సజ్జనులు వేటాడవచ్చునా?

వేట పాపానికి ఊట, అపవాదుకి అట, అక్రమమైన బాట. ఈ మాట నేను చెప్పాలా?

వేట, జూదం, పానం, మాట బిరుసుదనం, కఠినశిక్ష, వెలదిపొత్తు, మితిమీరిన దానం అనే ఈ ఏడున్నూ ఎవ్వరికీ పనికిరావనీ అన్నీ తెలిసిన పెద్దలమాట. తెలిసిన నీ వంటి సద్గుణశిరోమణి అచరించవచ్చునా? అందునా ధర్మశాస్త్ర అయి ధర్మాసనం మీద కూర్చున్న రాజుకి బొత్తిగ ఆ వ్యసనాల మాటే చెవిని పడకూడదంటారు కదా!

పాండురాజువంటి ధర్మపరుడు వేటవల్లనే కదా దారుణమైన శాపానికి గురి అయి చెడిపోయాడు. నలుడు వంటి నయశాలి జూదంవల్లనే కదా మానవుడు పడరాని యిడుమల పాలయాడు. పానంవల్లనే కదా యాదవులు సమూలంగా సమసిపోయారు. కఠినశిక్షవల్లనే కదా జరాసంధుడు దారుణమరణం పొందాడు. స్త్రీ వ్యామోహంవల్లనే కదా కీచకుడంతటి సింహబలుడు పిచ్చిచావు చచ్చాడు. హద్దుమీరిన దానం వల్లనే కదా హరిశ్చంద్రుడంతటి రాజమాణిక్యం తలపరాని దుర్దశ పొందవలసివచ్చినది.............. నా మాట మన్నించి ఈ ప్రయత్నం మాని యథాపూర్వకంగా కేశవారాధనతో కాలక్షేపం చెయ్యడం మేలు.......... అని పలికిన భార్యను చూసి 'ప్రియురాలా! నీవు చెప్పిన వ్యసనాల ఫలితం నే నెరుగనా? పాపపుణ్యక్రియలు తెలియనివాడనా? అందునా వేట పాపదీపమని తెలియదా? తెలిసి వెళ్తున్నా నెందుకంటావా? క్రూరమృగాలు చెలరేగి మూకమూకలుగా ఊళ్ళమీదపడి మనుష్యులను, పశువులను, పంటచేలను, ఫలవృక్షాలను మారిమసగినట్టు మారణహోమం చేసినట్టు ధ్వంసం చేస్తున్నాయట! ప్రజలకు కలిగిన బాధలను పోగొట్టి వారికి క్షేమం కలిగించడం ప్రభువుగా ఉన్న వానికి అవశ్యకర్తవ్యం కదా! అలా చెయ్యకపోవడం ధర్మహాని కదా! కాబట్టి నువ్వు విచారించవద్దు. నా మాట విను. నేను వేటాడి తిరిగి వచ్చే వరకూ పరాకులేక ఏకాదశీవ్రతం తప్పక చేస్తూ ఉండు అని ఒప్పించి రుక్మాంగదుడు కొడుకును రాజ్యపాలనకు నియోగించి తగిన పరివారముతో మహాసంరంభంగా వేటకు బయల్దేరాడు.

కతిపయ ప్రయాణాలకు కానకు చేరాడు. వేట ఆరంభించాడు. వింధ్య గిరి, సహ్యపర్వతం, మలయపర్వతం క్రౌంచశైలం, పారియాత్రం, గంధమాదనం, త్ర్యంబకాచలం, మాల్యవంతం మొదలైన కొండలనానుకొని ఉన్న అరణ్యాలలో ఎదురులేని శౌర్యధైర్యాలతో సంచరించి క్రూరమృగాలను వేటాడి ఆ యా ప్రాంతాలనున్న వారికి ఆనందకరుడైనాడు.

**కృతార్థుడవు :**

అలాగు వెళ్ళి వెళ్లి వామదేవుడనే ముని ఆశ్రమానికి చేరాడు. ఆ ఆశ్రమ వాతావరణం చూడముచ్చటగా ఉంది. ఆ ఆశ్రమమునందు-

క్రూరమృగాలలో పేరెన్నికగన్న బెబ్బులి పిల్లలతో లేడిపిల్లలు కలసి స్వేచ్ఛగా ఆడుతున్నాయి. గున్నటేనుగు తన చల్లనితొండముతో సింహం శరీరాన్ని నిమురుతూంది. కొండముచ్చులు కొండగొర్రెలను కొనగోళ్ళతో మెత్తమెత్తగా గోకుతున్నాయి. ముంగిస పాముపడగను ముద్దులాడుతూంది. అడవిపిల్లులూ ఎలుకలూ కలసి మెలసి గంతులు వేస్తున్నాయి. కలలోనైనా జాతివైరంలేక కలసి మెలసి తిరుగుతూన్న ఆ జంతువులు ముని తపశ్శక్తికి ప్రతిబింబాల్లాగున్నాయి. శ్రీ జంతువుల అన్యోన్యత చూసి రుక్మాంగదుడు "అహా! ఏమి అన్యోన్యత! ఈ ముని ఎవరోగాని ఎంత ఆశ్చర్యకరమైన వాతావరణం! ఆ మహానుభావుణ్ణి ఒకసారి దర్శించిపోతే జన్మ ధన్యం అవుతుంది" అని అనుకొని లోన ప్రవేశించాడు. వాసుదేవుణ్ణి దర్శించి సవినయంగా నమస్కరించి.

మహాత్మా! పరుసమును తాకినంతనే లోహం బంగారమైనట్లు పరమపావనుడవైన నీ పాదపద్మాలకు నమస్కరించగానే నా శరీరం పావనమైన అనుభూతి పొందుతున్నాను. నేను రుక్మాంగదుడు అనే పేరు గల రాజును అని అనగానే వామదేవుడు ఔనన్నట్లు తల ఊపి "రాజా!" సేమమా? నీ చరిత్ర తెలిసింది. నీ కొడుకు కులాసా? విద్యావంతుడై నిన్ను పోలి హరితత్త్వజ్ఞుడై ఉంటున్నాడా? సజ్జనసేవ, బ్రాహ్మణుల యందు భక్తి, హరిపూజా శ్రద్ధ కలవాడై ప్రవర్తిస్తున్నాడా?

ధర్మపాలనలో భగీరథుడు మొదలైన పూర్వరాజులను మరపించావు. నీ పేరు శత్రువులకు కూడా మాననీయమైంది. భోగభాగ్యాలకు మానవలోక మహేంద్రుడవని పేరు పొందావు.

సుధీజనపోషణా! సత్యభాషణా! విష్ణుపరాయణుడవు. పవిత్ర చరిత్రుడవు. వైష్ణవధర్మం రూపొందినట్టున్నావు. నిన్ను వర్ణించడం నా నాలుకకు ఇష్టం.

ఉన్నమాటే చెప్తున్నాను. ఊరక పొగడుతున్నానని అనుకోకు. నిన్ను పొగడి నేనేమి సంపాదించాలి? నా కేమి కావాలి?

మహావిష్ణువును త్రికరణశుద్ధిగా నమ్మి హరివాసరవ్రతం తప్పక, జీవితం హరిసేవకు మీదుకట్టిన నీకు శ్రీహరి తప్పక సాయుజ్యం ప్రసాదిస్తాడు.

తొల్లి నీవు పుత్రికారత్నాన్ని మేలైన నగలు తొడిగి పుష్పశయ్యపై ఉంచి శ్రావణమాసంలో శుక్లపక్ష ద్వాదశినాడు వేదశాస్త్రవేత్త అయిన ఒక విప్రునకు సంతృప్తిగా దక్షిణతో దాన మిచ్చినావు. అది 'శయన వ్రతం' అని పెద్దలన్నారు. ఆ వ్రతం చేసిన కృతార్థుడవు నీవు. తత్ఫలమే ఈ జన్మలో పుణ్యకాంతాలలామ సంధ్యావళి నీ భార్య అయింది. సకల రాజ్యాధికారి వయావు నీవు. అలాగే శ్రీహరి భక్తులతో తలమానిక మయావు. ఈ జన్మలో నీకు తప్పక హరిసాయుజ్యం కలుగుతుది. నీలాటి కృతార్థుడు ఈ లోకంలో లేడు.

అని రుక్మాంగదుణ్ణి ప్రశంసించి ఆ వామదేవుడు నీకు ఒక మాట చెప్పవలసేది ఉంది. చెప్తాను విను.

మందరగిరియందు ఉమాపతి ఇష్టకామేశ్వరుడు అనే పేరుతో వెలసి ఉన్నాడు. ఆ దేవు డెలాటి వాడో తెలుసా? తాను చర్మధరుడై సేవకులకు చీనాంబరా లిస్తాడు. తాను బూడిద రాసుకుంటూ భృత్యులకు కర్పూర చందనద్రవ్యం ఇస్తాడు. పాములే నగలుగా తొడుగుకొని భక్తులకు తారహారాలు దానం చేస్తాడు.కాలకూటం తానుమ్రింగి పదసేవకులకు అమృత దివ్యాన్నం సంఘటిస్తాడు. తన సంరక్షణ లక్ష్యపెట్టక భక్త సంరక్షణ పాటిస్తాడు. ఏ దేవుడేనా ఈలాగున ఉంటాడా? అలాటి విశిష్టగుణ రత్నాకరుడు ఇష్టకామేశ్వరుడు.

తనను నమ్మి సేవించే జనులకు ఇష్టసంపదలు ఇబ్బడిగా ఇచ్చే ఉబ్బులింగడా దేవుడు. నీవా చంద్రమౌళీశ్వరుణ్ణి సేవించవలసిందని నా మాట. ఆ కొండ ఇలాగు వెళ్లావంటే కనిపిస్తుంది; ఎంతో దవ్వుగా లేదు.

అని ప్రోత్సహించగా రుక్మాంగదుడు మహాత్మా నా మేలు కోరి మీరు చెప్పేది కాదంటానా? ఇప్పుడే వెళ్తున్నాను. ఆ స్వామిని తప్పక సేవించివస్తాను అని సెలవు తీసుకొని తన వారిని ఆ ప్రాంతమందే ఉండ నియమించి తా నొక్కడే మందరిగిరి వెళ్లాడు.

రుక్మాంగదుడు మందరిగిరిని సమీపించడం, మన్మథ మాధవులచటికి రావడం, మోహినీసఖు లా దరినున్న వనములో ప్రవేశించడం ఒకే సమయములో జరిగింది. అది కాకతాళీయమో దైవసంకల్పమో నిర్ణయించ లేము.

**దోహదం :**

మోహిని చెలికత్తెలు ఆ వనంలో ప్రవేశించి పువ్వులు వికసించేట్టు చేయడం అది తెలియని వారికి వింతగా ఉంటుంది.

ఒక కలువకంటి మందారపుష్పం పుక్కిటబట్టి సొగడమీద ఉమ్మగానే రెమ్మకో పువ్వు పూసిందది. ఒక భామ గోముగా కౌగిలించుకోగా కురవకం కొల్లలుగా విరులు విరిసింది. ఒక కోమలి దరిజేరి చిరునవ్వులు రువ్వగా పొన్న క్రొవ్వన్నెతో అలరులవాన కురిసింది. ఒక సుందరి కొనగోళ్ళతో కొసరి కొసరి గిల్లగా మామిడిమోక వింతవాసనతో కోయిలల గొంతుతడిగా కొత్తపూతతో నిగారించింది. ఒక కుసుమాంగి క్రొవ్వాడి చూపులతో చూడగానే తిలకతరువు లలిత కుసుమ సౌభాగ్యంతో కలకల లాడింది. ఒక పద్మాక్షి అందమైన అందెల మ్రోతతో అల్లనల్లన తన్నగా అశోకం అప్పటికప్పుడు పులకరించినట్టు ముద్దుగా మొగ్గ తొడిగింది. ఒక పల్లవాధర చందన సుగంధం చిమ్మే నిట్టూర్పుగాలి విడువగా పాటలం ప్రసవకూటం అయింది. ఒక సుగాత్రి పంచమస్థాయిలో సుతారంగా వీణాగానం చెయ్యగా ప్రేంకణం గుత్తులు గుత్తులుగా పూచింది. ఒక మందయాన అందెల మ్రోతతో సురపొన్న కనులపండువుగా పుష్పించింది.

మాధవప్రవేశ మహిమ ఆ వనములో చిగుళ్లలో, మొగ్గలలో అర విరిసిన విరులతో పువ్వులలో పుప్పొడిలో సమృద్ధిగా కనిపించసాగింది.

మల్లెతీగలూ మాధవీలతలూ పోటీపడి మధుర పరిమళాన్ని మంద వాయువుకి అందిస్తున్నాయి. ఫలరసాలు కుత్తుకబంటిగా త్రాగి రాచిలుకలు వలరాజుకీ రాజుకీ స్వాగతం చెప్తున్నాయి. మాకందపల్లవరసంతో జీరపోయి సుస్వరంగా కోయిలలు మంగళగీతాలు పాడుతూన్నాయి. పలుజాతుల పువ్వులగుత్తులపై ముసిరిన గండుతుమ్మెదలు మధురంగా రొదలు చేస్తున్నాయి. చికిలి చేసిన చిగురుటమ్ములూ, పుష్పధనువూ సవిలాసముగా ధరించి ఆ సమయములో ముందు కందర్పుడు అడుగుపెట్టాడు. అదే సమయములో రుక్మాంగదుడు వనప్రవేశం చేశాడు.

**మోహనగానం:**

రుక్మాంగదుడు వనములో ప్రవేశించాడని తెలియగానే మోహిని మోము ఆనందంతో ఆకాశమంత అయింది. అల్లనల్లన ఇష్టకామేశ్వరాలయం ముందున్న రసాలవృక్షం క్రిందనున్న చలువతిన్నెపై ఆసీనురాలై వీణ సారించింది. తంత్రులు బిగించి జీవాళి పొందించి సారెలు సర్దింది. లక్షణానికి అనుగుణమైన లక్ష్యంగా

సప్తస్వరసంగతితో మంద్రమధ్యమ తారశ్రుతుల నందుకుంటూ స్త్రీ పురుష రాగవిజ్ఞానం ప్రకటిస్తూ భావసాంకర్యం కాని రీతిగా జంత్రగాత్రాలు ఏకంకాగా వీణ మ్రోయించింది. ఆ వీణానాదంలో మోహినీగానం లీనమై అమృతవాహినియై ఆనందమూర్తియై ఇష్టకామేశ్వరలింగమూర్తికి కూడా పులకరింత కలిగించింది. ఆ గానం రాగం భావం తాళం సమైక్యమై ఆ పరిసరానికి నవ చైతన్యం సంతరిస్తూంది.

రుక్మాంగదు డా పాట విని అమందానందంతో ఇటూ అటూ చూచి ఇంత మోహనంగా పాడిన దెవరా? అని ఆ పాట వినవచ్చిన దిశగా నాలుగడుగులు వేసి ఇష్టకామేశ్వరాలయానికి చేరి మోహినిని చూశాడు. ఆ విశ్వమోహనమూర్తిని రాజు చూడటమే తడవు పంచబాణుడు పూవుల వింటిని సారించి చురుకు చురుక్కున తగిలేట్టు వాడికోలలు ప్రయోగించాడు. ఆ బాణఘాతానికి మైమరచి రాజు మూర్ఛిల్లాడు. మోహిని పరకాయించి చూచి ఇతడే ఆ రాజు అనుకొని వీణ క్రిందనుంచి చప్పున లేచి వచ్చి రాజు తల తన తొడపై నిడుకొని పయ్యెదతో అల్లనల్లన వీవసాగింది.

కొంత తడవునకు రాజు అల్లనల్లన కళ్లు తెరచి మోహిని మోము చూసి చిరునవ్వు నవ్వి మెల్లగా లేచి-

''చంచలాక్షీ! ఎవరు నువ్వు! నీ తలిదండ్రులెవరు? కని విని ఎరుగని కమనీయం రూపరేఖావిలాసాలతో భాసించే సుకుమారివి. ఈ పర్వత మందెందుకున్నావు?''

నిన్ను చూడగానే పూవింటివాడు దయమాలి నన్ను కుసుమశర ప్రయోగంతో ప్రాణం పోయినంత పనిచేశాడు. చేరదీసుకుని ప్రాణభిక్ష పెట్టావు. ఇక నేను నీ వాడను. కటాక్షించు.

నా పేరు రుక్మాంగదుడు. ఈ భూలోకంలో రాజేంద్రుడుగా కీర్తిపొందాను. సముద్రపర్యంతం నా ఏలుబడి చెల్లుతూంది. నాకు నూర్వురు భార్యలు. సంధ్యావళి పట్టపుదేవి. ధర్మాంగదుడనే పేర్గలవాడు ఒక కొడుకు నాకు. రాజధాని విదిశానగరం. నా ప్రాణరక్షణ చేసినందుకు నీకు నా పలుకుబడిలోనున్న భూచక్రం, నా వశములో నున్న సైన్యం, కోటా పేటా కోశాగారం కానుకగా సమర్పిస్తున్నాను. గ్రహించి ప్రేమతో నన్నను గ్రహించు'' అని సాకాంక్షగా అనగా మోహిని తన సంతోషాన్ని వెలిబుచ్చుతూ ఇలా అన్నది.

'ప్రభూ! దాపరికం లేక నా కథ చెప్తాను. విను. నేను చతుర్ముఖ బ్రహ్మ మానసపుత్రికను. నా పేరు మోహిని. మా నాయన సమ్మతితో నేను ఈ పర్వతంపై

విహరించడానికి వచ్చాను.' అరుగో వారు నా చెలికత్తెలు. రేయింబవళ్ళు భయభక్తులతో ఈ ఇష్టకామేశ్వరస్వామిని పూజిస్తూ ఉంటున్నాను. ఇంతవరకు మగవాని మొగంచూసి ఎరుగను. ప్రథమ దర్శనం నీదే. కాని ఏమి సంబరం? నూర్గురు పెళ్లాల మగడవు నువ్వు అని, ఇక నిన్ను కటాక్షించడం ఎలాగా? నీకు నూర్గురు భార్యలు; పట్టపుదేవి సంధ్యావళి. ఇది చాలదా? పైగా నీ అంతవాడు ఒక కొడుకు. ఇత సంసార చక్రం ఉన్న నిన్ను కటాక్షించి నేనేమి సుఖపడతాను? నీ సంధ్యావళి నన్ను చేరనిస్తుందా? నీ కొడుకు సేవకుడిచే నన్ను గెంటించడూ? నిన్ను చేపట్టితే సుఖాన ఉన్న ప్రాణం దుఃఖాన పెట్టుకోవడమే అవుతుంది. ఎందుకొచ్చిన జంఝాటం? ఇలాగే వెళ్ళనీ నా బ్రతుకు. ఏమైతే అది అవుతుంది. వెళ్లు రాజా! నీ దేవుల వద్దకు. మనసు గట్టి చేసుకో. మగవాడవు కావూ?

మోహిని మాటలు రుక్మాంగదుని చెవులకు ఈటెపోట్లలాగా తగిలి మనస్సును పొడిచాయి. సహించలేకపోయాడు. ప్రతిజ్ఞగా అన్నాడా!

''కామినీ! నా మాట విను. నిన్ను విడిచి వెళ్లడమా? అలా వెళ్లి నిముసం ఉండగలనా? కలలోకూడా జరగని మాట. అలా వెళ్లాననుకో నా దేవులు నాకు దయ్యాలు కాని దేవతలు కారు. ఆ మాట మరచిపో!

ఈ యిష్టకామేశ్వరస్వామిసాక్షిగా చెప్తున్నాను విను. ఆ దేవులూ, పట్టపుదేవీ నా కక్కరలేదు. ఈ నిమిషం నుంచి నాకు సర్వమూ నువ్వే. నీ అడుగుదాటక, నీ మాట మీరక నడుచుకుంటూ ఉంటాను అని స్వామి మీదికి చేయి చాచి మోహినీ! ఇదిగో మళ్లీ ఈ స్వామి మీద చెయ్యి వేసి ప్రమాణంగా చెప్తున్నాను విను.

నేనూ, నా నూర్వురు భార్యలూ, నా పట్టపురాణి, నా కొడుకు, నా ప్రజలు నీ మాటకి తలవంచి నడుచుకుంటారు. నా సంపదకీ దొరతనానికీ ఇక నువ్వే సర్వాధికారిణివి. అంతా ఇప్పుడే అప్పగించి వేస్తున్నాను'' అని రుక్మాంగదుడనగా మోహిని చిరునవ్వుతో చేయిచాచింది. రుక్మాంగదుడు చేతిని గ్రహించి ఈశ్వరుని ముందు గాంధర్వపద్ధతిని పరిగ్రహించాడు.

అది సూర్యుడు అస్తమించే సమయం. ఎక్కడెక్కడో మేతకెళ్లిన పక్షులు గూళ్లకు చేరుతున్నాయి. తామరపువ్వులు తుమ్మెదలతో సహా ముడుచుకు పోయాయి. చల్లచల్లగా భాస్కరుడు పడమటి కొండచాటునకు పోయాడు. ఇట్టే క్రమ్మిన చీకటిని దట్టంగా ఆకాశాన పుట్టిన చుక్కలు అట్టే పొగొట్టాయి.

అల్లనల్లన తూరుపుకొండపై చందమామ తొంగిచూచాడు. పాలవెల్లిలాగా వెన్నెల దశదిశలా వ్యాపించింది. సూర్యుడు అస్తమించగానే సంప్రదాయజ్ఞుడైన రుక్మాంగదుడు సంధ్యోపాసన సక్రమంగా ముగించి ఇష్టకామేశ్వరస్వామిని దర్శించడానికి ఆలయానికి వెళ్ళాడు.

రుక్మాంగదుడు ఆలయానికి వెళ్ళేసరికి కామధేనువు సమర్పించిన నేతితో నానిన వత్తులు బంగారుపళ్లెరాలలో వెలుగుతున్నాయి. అగరు, సాంబ్రాణీ ధూపం ఆ పరిసరాల నీలిమబ్బుచాందినీ సంతరించినట్టుంది. కల్పన సుమమాలికల మధురపరిమళం గుబాళిస్తోంది. ప్రాకారగోపుర ద్వారాలకు గుమ్మానికి తాపిన వివిధమణికాంతులు వింతవెలుగును వెదజల్లుతున్నాయి. ఏదో మనసుకూ మాటకూ అందని దివ్యవైభవం మూర్తీ భవించినట్టుంది ఆలయం శోభ.

రుక్మాంగదుడు గౌరీపతికి ఒకించుక ప్రక్కగా నిలిచి చేతులు మొగిచి శిరసువంచి నమస్కరించాడు. పిదప నామసంకీర్తనం చేశాడు.

''దేవా! త్రిలోకనాథా! నీ శ్రీపాదపద్మాలపై ఒక తామరరేకు భక్తితో ఉంచినవాడు అమరావతి యందున్న నందనవనంలో అప్సర స్సుందరీ మణులతో ఆనందంగా విహరిస్తాడట! ఎంత విచిత్రం.

విశ్వేశ్వరా! నీ పాదపద్మాలను దర్శించి నిండు భక్తితో పూజించే వాడు సర్వరోగబాధలను, ఋణబాధలనూ, అపమృత్యుదోషమును, శత్రుపీడను తప్పించుకుని జీవించినంతకాలమూ లోకంలో ఇంద్రభోగం అనుభవిస్తాడట! నీ పదసేవా మహిమను ఏమని కీర్తించగలను!

సంసారక్లేశాలను సతమతంచేసే సర్వాధికారీ! పురారీ! ఇష్టకామేశ్వరస్వామీ! నీ యశస్సు శచీదేవి తాంబూలపేటియందు చంద్రరేఖ! అగ్నిదేవి భార్య అయిన స్వాహాదేవి వక్షముపై అణిముత్తెపు పేరు. యముని ఇల్లాలి నొసట చందనపు చుక్క! నిర్ఋతిసతి నెమ్మోమున నిగ్గులొలికే సొబగునవ్వు. వరుణకాంత తాటంకాలకు వజ్రం. వాయు పత్ని కొప్పున కొంగ్రొత్త మల్లెపూవు. కుబేరుని కుసుమాంగికి అరచేతి అద్దం. ఈశానుని ఇల్లాలికి తెలిపట్టు చీర. నీ ఆత్మవిభూతిని నే నేమని వర్ణింపగలను ప్రభూ!

అని స్తుతించి ఈశ్వరప్రసాదం స్వీకరించి అల్లనల్లన ఆలయం నుంచి వెలుపలికి వచ్చాడు.

అప్పటికి మోహిని అచ్చంగా విశ్వమోహినిగా ముస్తాబై దరినున్న పూదోటలో తియ్యమామిడి చెట్టు క్రిందనున్న చలువరాతి తిన్నెమీద సవిలాసంగా కూర్చుని

రుక్మాంగదుని రాకను నిరీక్షిస్తూంది. వెలుపలికి వచ్చిన రాజును చూచినంతనే లేడిలాగా తుప్పున ఎగిరి దరిజేరి ముంజేత రాజు చేతిని అందుకుంది. పొదరింటికి తోడ్చుకు వెళ్లింది.

రుక్మాంగదుడు మోహిని విలాసాలకు లొంగిపోయి పొదరిళ్లలో, కొండకోనలలో, సానువులలో, తోటలలో స్వేచ్ఛగా తిరుగుతూ కాలక్షేపం చేస్తూ కొన్నాళ్లు గడిపినాడు.

అలాగే మోహినితో ఆమె చెలికత్తెలతో కలిసి పర్వతం దరినున్న ముక్త కుండమందు తనివితీరా జలకేళిం దేలియాడాడు. జలకేళి అయాక గట్టుకి వచ్చి ధవళవస్త్రాలు, రత్నభూషణాలు, గంధపుష్పాలు ధరించి పూర్వయామకృత్యాలు సక్రమంగా నిర్వర్తించాడు. తర్వాత ఇష్టకామేశ్వరస్వామిని దర్శించి వివిధ గంధకుసుమాలతో పూజించాడు. సాష్టాంగ ప్రణామాలు చేసి ఉప్పొంగుతూన్న భక్తితో నోరారా స్వామిని స్తుతించి ప్రసాదం స్వీకరించి ఈశ్వరాలయం నుంచి వెలుపలకు వచ్చాడు. అల్లనల్లన గోపురద్వారం వద్దకు వచ్చి అక్కడ నిల్చున్న మోహినితో ఇలా అన్నాడు.

**బల్లి కథ:**

'మోహినీ! వనమహోత్సవం అయింది. ఇక మనం మన రాజధానికి పోయి చీకూచింత లేకుండా సంపత్సౌఖ్యం అనుభవించుదాము. ఏమి ప్రారబ్ధం ఈ అరణ్యావాసం!'.... అని పర్వత ప్రాంతం . పలి అదిగో చూడు మన సైన్యం అని అనగా అతని కంఠస్వరం విని అక్కడ ఒక చెట్టుకి కట్టి ఉన్న గుర్రం ఆమోదంగా సకిలించింది. డెక్కలతో నేల త్రవ్వింది. ఆ త్రవ్వడంవల్ల అక్కడ ఉన్న ఒక బల్లి వీపు తోలు నలిగి ఆ బాధతో నేల మీద అటూ ఇటూ పొరలాడసాగింది. దగ్గరకు వెళ్లిన రాజు దానిని చూచి కనికరముతో ప్రక్కనున్న నీటిపడియ నుంచి నీరు తెచ్చి దానిపై చిలకరించి నీడపట్టున ఉంచి చిగురాకులతో వీవ నారంభించాడు. ఆ సేవ చూసి మోహిని చికాకుగా అన్నది.

"రాజా! ఏమిటీ వికారపు పని? ఇది పాపజాతి పురుగు. దీనిని తాకితే స్నానం చేయాలి. ఆ మాత్రం తెలియదా? అయినా దీనికి సేవ చేస్తే నీకు వచ్చేదేముంది? ఇలా ఎన్ని పురుగులు చస్తూ ఉంటాయో! పుడుతూ ఉంటాయో! వాటి కష్టసుఖాలకు నువ్వుకర్తవా? లేలే! దానిని ఆవల పారవేసి గుర్రం ఎక్కు. ఇంటికిపోతూ ఈ అపశకునపు పనేమిటి?"

ఇలా దయలేక రాజుని అవహేళనగా మోహిని మాటాడుతుండగా మానవభాష వినిపించింది. ఎవరా? అని ఇద్దరూ వింతగా అటూ ఇటూ చూస్తూ ఉండగా ఎవరో వింత మనుషులు మాటాడుతున్నారని అనుకుంటున్నారా? ఎవరో కాదు. నేనే, బల్లిని. రాజా! హరిభక్తులలో అగ్రగణ్యుడవైన పున్నెపురాశివి నువ్వు. నీ చేయి తగిలినంతనే నా బాధ పోవడమే కాక పూర్వజన్మ స్మృతి కూడా నాకు వచ్చింది. నీకు నా ధన్యవాదాలు. ఇక రెండు మాటలు ముందు ఈమెకు చెప్పి తరువాత నా పూర్వజన్మకథ చెప్తాను, విందురుగాని.

భామినీ! నీ రూపరేఖలూ, ముఖవికాసం చూస్తే దివ్యకాంతవని తోచుతూంది. నీ మాట మాత్రం నికృష్టజాతి లక్షణానికి సాక్షిగా ఉంది. మైతోలు నలిగి ప్రాణాపాయస్థితిలో దుర్భరమైన బాధపడుతూన్న నన్ను కనికరించి సేదదీర్చిన ఈ కరుణామూర్తికి విరుద్ధమైన ధర్మబోధతో మనస్సు నొప్పిస్తున్నావు. మనసున్న వ్యక్తి అనవలసిన మాట కాదది. జీవరక్షణకన్న మిన్నగా ఎన్నదగిన ధర్మమేముంది? ఎన్ని యజ్ఞాలు చేసినా ఒక్క జీవరక్షకు సాటికావని తెలిసిన పెద్దలంటారు. కష్టదశలో ఉన్న ఒక్క ప్రాణిని కనికరించి కాపాడినందువల్ల వచ్చే పుణ్యఫలం సర్వధర్మ కార్యాలూ చేసినందువల్ల వచ్చే ఫలాన్ని మించుతుందని ధర్మజ్ఞుల మాట. కరుణను మించిన పుణ్యం, అధికారమును మించిన పాపం, హరిస్మరణను మించిన తీర్థం, సుష్టుగా ప్రజలను పాలించడంకన్నా యజ్ఞం, విరహంవంటి రోగం, వివేకం వంటి నగ, మచ్చరంవంటి దుర్గణాలూ లేవు! విన్నావా సుందరీ! ఈ పుణ్యాత్మునితో ఉంటూ లవలేశమైనా కరుణా భావం లేని కఠిన చిత్తవు ఎలాగయినావో అని ఆశ్చర్యంగా ఉంది. ఊ............ ఇక నా కథ విను'' అని బల్లి తన పూర్వజన్మకథ ఇలా చెప్పింది.

''రాజా! కాపిల్యం అనే నగరంలో ఒక శుద్ధబుద్ధి అయిన బ్రాహ్మణునికి పుత్రికను. యుక్తవయసు రాగానే మా తండ్రి నన్నొక తగిన వరునకు ఇచ్చి సంప్రదాయానుసారంగా పెండ్లి చేశాడు. నేను సలక్షణంగా కాపురానికి అత్తింటికి వెళ్ళాను.

నా పతి కురూపి అని కొన్నాళ్ళకు గ్రహించాను. ఇంకొక చపలాక్షి వలలోపడి నన్ను కన్నెత్తి చూడనైనా చూడని శఠుడైనాడు. ఇక నాగతి ఏమిటి?.....

ప్రాణేశ్వరుడు నన్ను చేపట్టునా? అని జోస్యం చెప్పే వారిని అడిగే దానను. పతి నన్ను ప్రేమతో చేరదీసుకుంటాడా? అని ఇరుగు పొరుగు వారి ఇళ్ల మీద వాళ్లకి తెలియనట్లు బియ్యం చల్లేదానను. (అవి తినడానికి వచ్చిన

పక్షులకూతలనుబట్టి శుభాశుభాలూ, కార్యాలూ నిర్ణయించే వేత్తలవల్ల తన కార్యం తెలుస్తుంది. అలా చల్లేది 'పోచిల్లు' అని వ్యవహారం) నా భర్త నన్ను చనవిచ్చి ఏలుకుంటాడా? అని సోదె చెప్పించుకునే దాన్ని, నాథుడు నన్ను మన్ననగా పాలిస్తాడా? అని శకునాలు చూసే దాన్ని. ముంగిటికివచ్చిన జోగులనూ, జంగమయ్యలనూ పూజించి నా బ్రతుకేమవుతుంది? అని ప్రశ్నించేదాన్ని. దేనికీ మంచిఫలం కనిపించ లేదు. అలా కాలం ఏలాగో గడుపుతూ ఉండగా శివాలయానికి ఒక యోగిని వచ్చిందని వారూ వీరూ అనుకున్నది విని ఆమెవల్ల ఏమైనా మంచిమాట వింటానేమో అని గంపెడాసతో ఒకనాడు శివాలయానికి పూజా ద్రవ్యాలు పట్టుకు వెళ్లాను.

చూడడానికి ఆమె నిజంగా దివ్యయోగినిగానే ఉంది. ఆపాదమస్తకం దళంగా విభూతిపూత పండువెన్నెల పూతలాగా ఉంది. పచ్చని దుప్పటీ ఉత్తరీయంగా కప్పుకున్నది. వజ్రాల మొలకల్లాగున్నాయి. చెవిపుటాలపై మొల్చిన తెల్లని రోమాలు. చేతనున్న యోగదండం పద్మరాగానికి ప్రభను సంతరిస్తూన్నట్టున్నది. కంఠాల వ్రేలాడుతూన్న శంఖాలతావళం అణిముత్తెపు దండకి దీటుగా ఉంది. ప్రశాంతవదనంతో కనికరపు చూపులతో ఆ సిద్ధురాలు అచ్చంగా చండికామూర్తియే. నన్ను అనుగ్రహించడానికే వచ్చిందని సంబరపడ్డాను.

ఆ సమయంలో ఆ ఆవరణమంతా స్త్రీలతో తొడతొక్కిడిగా ఉంది. భైరవపూజకి పలువిధాలైన ఆహారపదార్థాలు సిద్ధం చేస్తున్నారు. నేను తీసుకువెళ్ళిన ఫల పుష్ప చందన తాంబూలాలను పానకమున్నూ ఆ యోగిని ముందుంచి సాష్టాంగ నమస్కారం చేసి లేచి దోసిలిపట్టి కాస్త పక్కగా నిల్చున్నాను. ఆ సాధుమూర్తి నన్ను ఎగాదిగా చూచి దీవిస్తూన్నట్టు చేయిచాచి కూర్చోమని కనుచూపుతో సంజ్ఞచేసింది. సవినయంగా కూర్చున్నాను. ఆమె నన్ను ఒకక్షణం చూచి-

'అమ్మాయి! ఏమిటి నీ బాధ?' అని జాలిగా అడిగింది. ఆ ప్రశ్న వినగానే కన్న తల్లి కూతుర్ని కష్టసుఖాలు అడిగినట్లు అనిపించి నా కళ్లు చెమర్చాయి. పైటతో కళ్లు ఒత్తుకొని-

అమ్మా! ఏమి చెప్పేది? ఇటూ అటూ సిరీసంపద, బండెడుబలగమూ ఉన్నదానను. కాని ఏమి లాభం? రూపం వయసూ ఉన్న చదువరి నా కట్టుకున్నవాడు, ఒకవగలాడి వలపులో పడి నన్ను వెలిపెట్టాడు.వారానికి ఒకనాడైనా ఇంటికివచ్చి నన్ను కన్నారా చూడడం, చేరబిల్వడం, నోరారా మాటాడడం, చేరదీసు కోవడం లేదు. నేను కాపురానికి వచ్చి నెల కాకుండానే ఇలా అయిపోయాడు.

నా బ్రతుకింతేనా? చూస్తూ చూస్తూ ఏ నూతిలోనో గోతిలోనో పడి చావలేను కదా! ఏదో ఆశ! ఏ నాటికేనా నన్ను చేరదీసుకోడా? అని. ఇది నా బాధ. ఇంతకన్నా మగనాలికి ఏమి బాధ ఉంటుంది?''

బిడ్డా! విచారించకు. ఇదిగో దీనిలో ఉన్న భస్మం వశీకరణ భస్మం. దీనిని రెండు భాగాలుగా చేసి సమయం చూచి నీ మగనితో లాలనగా కలగజేసుకొని మాటాడి పాలలో కలిపి రెండురోజులు ఇచ్చావంటే నీ భర్త దాసోహమ్మని నీ చెప్పుచేతల్లో నడస్తాడు అని చిరునవ్వు నవ్వి నా చేత ఉంచింది. అప్పుడే నా భర్త నా వశుడై పోయినంత సంతోషముతో ఆ యోగిని వద్ద సెలవు తీసుకొని ఇంటికి వచ్చాను. దైవనిర్ణయం తప్పించడం ఎవరితరము? అనుకోకుండా ఆ రాత్రి నా భర్త ఇంటికడనే ఉండడం తటస్థించింది. కలుపుగోలుతనంగా మాటాడుతూ గదిలో కొంతసేపు గడపి ఇదే సమయమని ఆ పొట్లంలో ఉన్న భస్మాన్ని పాలలో కలిపి ఇచ్చాను. పాపం ఆయన ఆప్యాయంగా ఆ పాలు త్రాగాడు. త్రాగిన పది పదైదు నిముషాలకు ఓ అని పెద్ద అరుపు అరిచి క్రిందపడ్డాడు. నేను ఉలికిపడి లేచి శరీరం తాకాను. ఆయన మేనంతా గచ్చకాయ లంతేసి పొక్కులతో నిప్పులు చెరగుతూంది. వలపుమందు ఎంతపని చేసింది దేవుడా! చెమరకాయలు పోవాలని తొలకరివానలో  నిలబడితే పిడుగుపడి తల షగిలినట్లయిందే! అని అనుకొని ఆయనను ఇటూ అటూ కదిపాను. ఇక చెప్పేదేముంది? నా బ్రతుకు సర్వశూన్యం అయిపోయింది. నోట మాటరాక బిక్కచచ్చి కూర్చున్న నాకు దారుణంగా ఒక మాట వినిపించింది.

'నీచురాలా! వలపువుందుతో కట్టుకున్న భర్తను గాసిపెట్టిన దౌర్భాగ్యురాలవు. అడివిలో బల్లివై పుట్టు. కొంతకాలానకు విష్ణుభక్తులలో అగ్రగణ్యుడుగా పేరొందిన ఒక రాజు కరస్పర్శచే ఈ పాపం పోయి దివ్యకాంతవై స్వర్గానికి వెళ్ళు' అని.

ఇది బ్రహ్మశాపం అని భావించి చడీచప్పుడు కాకుండా ఇంటినుంచి వెలుపలకు వచ్చాను. రివ్వున పెనుగాలి వీచింది. ఆ గాలికి కొట్టుకువచ్చి ఇక్కడ బల్లినై పడి నానాయాతనలు అనుభవిస్తూ ఇన్నాళ్ళకు నీ కరస్పర్శచే పాపవిముక్తురాల నయ్యాను. సెలవు.

అని ఆ బల్లి సౌందర్యవల్లి అయిన దివ్యకాంతగా మారిపోయింది. అంతలో దేవవిమానం వచ్చింది. ఆ కాంత సురవిమానము నధిష్ఠించి సురపతిపురియైన అమరావతికి వెళ్లిపోయింది.

అని చెప్పి సూతుడు అటమీది వృత్తాంతము ఈ విధంగా చెప్పనారంభించాడు.

# 4

బల్లి కథ విని మోహిని కొంచెం బెదరినట్టు ఒకించుక తలవంచుకొని నిల్చుంది. రుక్మాంగదుడు ఆమె చేతిని పట్టుకుని అల్లనల్లన రథంమీదికి వచ్చి ఊ.... అన్నాడు మెల్లగా. మోహిని రథం ఎక్కింది. తానూ రథం అధిరోహించాడు. శకటం కదిలిది.

రుక్మాంగదుని శకటానికి ముందు పాండ్యులు, విదర్భులు, కేరళీయులు, పాంచాలురు జట్టుజట్టుగా కలిసికట్టుగా నడుస్తున్నారు. వెనుక దిక్కున ఆటవికులు, కళింగులు, పుళిందులు, యవనులు ఆప్తభావంతో సంతుష్టస్వాంతులై వస్తున్నారు. ఇరుప్రక్కల గౌడులు, ఉత్కళులు, మాగధులు, ఆంధ్రులు, ఘూర్జరులు, మహోద్ధతిగా నడుస్తున్నారు. నడుమ నానా సేనాపతులు, భద్రగజసమూహాలతో భద్రంకరులై అనురాగస్ఫూర్తితో వెళ్తున్నారు. తమ్మటము, భేరి మొదలైన వాద్యాల మ్రోతలకు నలుదిక్కులూ పిక్కటిల్లుతున్నాయి. అతటి మహావైభవంతో రుక్మాంగదుడై రథారూఢుడై మోహినీయుతుడై పయనిస్తున్నాడు.

## పురప్రవేశం:

రుక్మాంగదుని సైన్యం పుడమికి అడుగులచే అడుగు నుంచి దడ పుట్టిస్తూంది. ఆ దడ అటూ ఇటూ ఉన్నవారి గుండెలకు ఇది ఆకస్మిక దుర్నిమిత్తం అని బెదురు కలిగిస్తూంది. నడక తొందరచే అడుగుల ఒత్తిడికి పుడమినుంచి లేచిన పెంధూళి గుప్పున ఉప్పరాన్ని కప్పి భాస్కర మండలానికి ప్రభ కట్టింది. గజసైన్యం నడుములకు కట్టిన కంచుగంటల మ్రోతకి దిక్కుల గోడలు బీట వారుతున్నాయి. అసాధారణములైన ఆయుధాల వెలుగులకు చూసేవారి కళ్లలో మిణుగురులు పుట్టుతున్నాయి. అలాంటి సంరంభంతో రుక్మాంగదుడు వెళ్ళుతూ ఉండగా మధ్య మధ్య అక్కడక్కడా ఉన్న నరపతులు కానుకలూ, ఆహారపదార్థాలూ తెచ్చి యిచ్చి సంతుష్టి పుష్టి కలిగిస్తున్నారు. ఆ విధంగా ప్రయాణాలూ మజిలీలూ చేస్తూ మగధ, శక, మహారాష్ట్ర, పాండ్యదేశాలు నడచి తనరాజ్యం పొలిమేరకు చేరాడు.

దూతలు పరుగు పరుగున వెళ్ళి మహారాజు వస్తూన్నట్టు రాజప్రతినిధిగా ఉన్న యువరాజుకి ధర్మాంగదునికి విన్నవించారు.

ఆ వార్త చెవిని పడగానే ధర్మాంగదుడు మహానందంతో మంత్రులనూ, తనకు కావలసిన వారిని రప్పించి రాజాగమనం చెప్పి కనుల వేడుకగా పురం సింగారించే ఏర్పాట్లు చేయించండని చెప్పాడు. తాను రాజునకు ఎదురుకోలునకై బయలుదేరాడు.

నవరత్నాలు పొదిగిన పెద్దరథాలతో భద్రగజాలతో మనోవేగంగల గుర్రాలతో చటుల విక్రమసంపన్నులైన భటులతో ముత్తెపూజాజుల వెల్లపట్టు గొడుగులతో వెన్నెల పోతపోసినట్లున్న వింజామరలతో, మంగళాహ్వాన సూచకములైన జెండాలతో, మంత్రులతో, దండనాయకులతో, సామంతరాజులతో, కవిగాయకులతో, వందిమాగధులతో, మహావైభవంగా వెళ్ళాడు. సరాసరి తండ్రి ముందుకు వెళ్ళి అలాగే సాష్టాంగ దండప్రణామం చేశాడు. సవినయంగా పాదాభివందనం చేసిన కొడుకుని చూసి చిరునవ్వుతో పలకరించి చేరదీసుకుని రుక్మాంగదుడు దీవించి గాఢంగా కౌగిలించుకున్నాడు. అల్లనల్లన యోగక్షేమా లడిగాడు.

''కులదీపకా! క్షేమంగా ఉన్నావా? విద్వాంసులు, బంధువులు, బ్రాహ్మణులు, ఆశ్రితులు, మంత్రులు, దాసదాసీజనం సుఖంగా ఉన్నారా? మీ తల్లులందరూ కులాసా? రాష్ట్ర ప్రజలు సురక్షితంగా ఉన్నారా? ప్రజలు నీ మాట పాటిస్తూ ప్రవర్తిస్తున్నారా?''

ధర్మాంగదుడు ఒకేమాటతో సమాధానం చెప్పాడు. అంతా క్షేమమే సర్వం సానుకూలంగా నడుస్తూంది. నాయనా! నీ రాకకోసం రాజధాని వేయికళ్లతో ఎదురుచూస్తూంది. విశేషాలు ఏమైనా?.... అని ఆగాడు.

కుమారా! విశేషాల కేముంది? అంతా నా వెళ్లినపని మంగళంగా జరిగింది అని మంత్రిసామంతాదుల క్షేమాలు అడిగి తెలుసుకుని కొడుకుని చూచి నాయనా! ఇటు చూడు. ఈమె బ్రహ్మ మానసపుత్రి. ఈమెను నేను ఈశ్వరసాక్షిగా గాంధర్వ వివాహపద్ధతిని పరిగ్రహించాను. కాబట్టి ఈమె నీకు తల్లివంటిది. నీ కన్నతల్లికి చేసేట్టుగా ఈమెకి అభివందనం చేసి సగౌరవంగా తోడ్కుకు వెళ్ళి నాగరజనమునకు తగిన భవనమునందు నివాసం ఏర్పరచు అని అనగా వెంటనే ధర్మాంగదుడు మోహిని పాదాలకు అభివాదం చేసి రథముపై ఆసీనను చేసి తీసుకువెళ్ళాడు.

తరువాత రుక్మాంగదుడు భద్రగజం ఎక్కాడు. వందిమాగధలు ప్రతాపస్ఫోరకములైన బిరుదావళులు చదువుతూండగా, పుణ్యాంగనలు సలలిత కంఠస్వరాలతో కళ్యాణగీతాలు పాడుతూ సేసలు చల్లుతుండగా, వేదవేత్తలైన విప్రులు ముత్యాల అక్షతలు చల్లుతూ వేదమంత్రాలతో ఆశీర్వదిస్తుండగా, ఉభయ పార్శ్వములందు వేత్రహస్తులై భటులు సందడి చేస్తుండగా, ముత్యాలగొడుగు నీడను పురప్రవేశం చేశాడు. క్రమంగా కనకరత్న శోభితమైన రాజప్రాసాదం వద్దకు వెళ్ళాడు. అక్కడ భద్రగజం నుంచి పాంచాలరాజు చేయూతతో దిగి మదగజయానంతో సభాభవనం ప్రవేశించి నవరత్న ఖచిత సింహాసనం మీద ఆసీనుడై మహారాజవైభవంతో కొలువు తీరాడు. అప్పుడు పద్మరాగమయములైన

పాత్రలకు గోళ్ల వెలుగులు మెరుగుపెట్టగా తిన్నగా వెలుగుతూన్న దీపాలవెలుగులగు కనుల మెరుగులు వెలుగులు దిద్దగా, కర్పూరమిళితమైన మంచి గంధానికి నెమ్మేని తావి ఆమోదం కలిగింపగా మంగళగీత మధురస్వరాలకు కరకంకణధ్వనులు గౌరవం సంఘటింపగా మెరుగు చెక్కిళ్ల కాంతులు వజ్రాలతాటంకాలకు వన్నె పెట్టగా పద్మముఖులు రుక్మాంగదునకు నివాళులిచ్చారు. అలాగూ నివాళు లందుకుని మహారాజు సభాభవనం నుంచి సవిలాసంగా అడుగులేస్తూ అంతఃపురానికి వెళ్ళాడు. అక్కడ పట్టమహిషి సంధ్యావళిని అదే వరుసగా భార్యలను ఆనందంగా చూసి యోగక్షేమా లడిగి తెలుసుకుని ఇట్లన్నాడు.

సతులారా! మీకొక మాట చెప్తున్నాను ఎనండి, నేను వేటకువెళ్లి అలా మందరపర్వతం చేరాను. అక్కడ ఒక శివాలయం ఉంది. ఆ ఆలయంలో ఉన్న ఈశ్వరుని ముందు ఒక కాంతను గాంధర్వవిధి ననుసరించి పరిగ్రహించవలసి వచ్చింది. ఆమె బ్రహ్మ మానసపుత్రి, పేరు మోహిని. మా ఇరువురి పరిణయ సమయమందు ఆమె ఒక ప్రమాణవాక్యం నానోట పలికించింది. అది ఏమిటంటారా?

'రాజధానికి వెళ్ళిన తరువాత మీతో కలిసి ప్రవర్తించరాదు' అని చెప్పి నాచే ఒప్పించింది. నేనా ప్రమాణవాక్కును పరమశివుని సాక్షిగా పలికి ఉన్నాను. కాబట్టి నేనిక ఆ విధంగా నడవవలసి ఉంటుంది. మీరీ విధంగా నడుచుకోవాలి – అని రాజనిన మాటలు, ఆ కాంతలకు వాడి కోలలు చెవుల ద్వారా హృదయాలలో గ్రుచ్చుకున్నట్టయింది. విలవిల లాడారు. కళతప్పిన మొగాలతో చూస్తూ నిల్చున్నారు గాని ఆపాద మస్తకం కంపం పుట్టి భయంతో కంఠాలు బొంగురుపోయి ఏమీ అనలేక అనకుండా ఉండలేకపోయారు..... కొంతతడవు అలా ఉండి ఎట్టకేలకు కొంతకు కొంతగా ధైర్యం తెచ్చుకొని సన్నని కంఠాలతో అలాగన్నారు.

**ధర్మమా:**

దేవా! చిరునవ్వుతో ఒకతెను, తీయని మాటలతో ఒకతెను, సయ్యాటలలో ఒకతెను, అనురాగంతో ఒకతెను, కస్తూరిమిళిత చందనచర్చతో ఒకతెను, కప్పురపు విడెముతో ఒకతెను – ఇలా మాలో ఒకతెను ఒక్కొక్క విధమైన హృదయ విన్యాసంతో ఇంతకాలమూ ఆదరిస్తూ, ఆనందిస్తూ, ఆనందపరుస్తూ ఏలుకున్నావు. మేము కూడా అలాగే అనుకరించి ఆనందంగా ప్రొద్దు పుచ్చుతున్నాము. మరి మాపై గల కూరిమి తెగతెంపులు చేసి అందరుకాదని ఒకతెపై కూర్మి నెరపడం ధర్మమా?

## ఏకాదశీ మాహాత్మ్యం

అనురాగబలంతో పతి ఇష్టానుసారంగా ఎందరు భామలను చేపట్టినా పట్టవచ్చు. కానీ మునుపటి భార్యలను దయమాలి దూరం చెయ్యవచ్చునా? ఈమె మూలంగా ఇక మాగతి ఏమవుతుందో - అని మాకు చింత కలుగుతూంది. ఇలా చెయ్యడం ధర్మమా? ప్రభూ!

మాకు తోచిన మాట ఒక్కటి మనవి చేస్తున్నాము. ఆలించుస్వామీ! మోహిని మాకన్న అందగత్తెగా నీ కంటికి తోచవచ్చు గానీ మాకేమో సామాన్యంగానే కన్పిస్తూంది. 'చూపుకి వింత – రుచికి చింత' అనే మాట ఈనాడు నిజమయింది.

ఇంతకాలం మేము నీ ప్రియురాండ్ర మయాము గాని ఇప్పుడీ క్రొత్త మనిషి రాగానే నీకు నచ్చనివారమయి పోయామా? ఔను మరి. పెరటిచెట్టు మందుకి పనికిరా దంటారు. నిజమే.

మహారాజా! నీ దయకి పాత్రులమైన మమ్మల్ని ఇలా దిగనాడితే ఆడావుగాని నిన్ను మేమెలా విడవగలం? జాజుల్ని మంగలంలో వేచడం ధర్మమా? ఒక్కటే మా నిశ్చయం. ఈ మోహినిలాగా మమ్మల్ని కూడా మునుపటిలాగే ఏలుకోవలసిదని మా మనవి. అలా కాకుండా మమ్మల్ని ఎండబెట్టావా? మా ప్రాణాలను గడ్డిపోచల్లా నీ పేరుమీద విడిచి పెట్టుతాము. ఈతకి మిక్కిలి లోతుంటుందా? అని దుర్భరమైన దుఃఖంతో గట్టిగా అనగా ఆ మాటలు విని కాస్త దూరంగా నిల్చున్న పట్టపురాణి సంధ్యావళి కాంతలవద్దకు బిరబిర వచ్చి ముదల యిస్తున్నట్టుగా అన్నది.

సతులారా! వినయమూ, భయమూ, నయమూ, భక్తీ విడిచి పతిని ఇలా అనవచ్చునా? మహారాజు మందరగిరి ప్రాంతాన్ని ఆమెను చేపట్టకముందు మీకు ఏమన్నా చెల్లుతుందిగానీ, చేపట్టి ఇక్కడకు తీసుకుని వచ్చి మనలో ఒకతెగా చేసిన తర్వాతఇలా అనడం సముచితంగా లేదు సరికదా! అది పాపప్రలాపం అవుతుంది కూడా. ఇంతకీ మీరిప్పుడేమన్నా గతజలసేతుబంధనమే.

భార్యను భరించడానికీ, ఆదరించడానికీ, బాధించడానికీ భర్త కర్త కావచ్చు. అందుకు భిన్నంగా భార్య భర్తను అధిక్షేపించడం, అవమానించడం, చచ్చిపోవడానికి సిద్ధపడడం అనేది చెల్లనిమాట. భర్త ఆజ్ఞకు వ్యతిరేకంగా భార్య ఏ విషయంలోనూ స్వతంత్రించి నడువ కూడదు.

పతి వేరొక భామినిని వరించి సుఖించడం ఓర్వలేక ఆటంకం కలిగిస్తే కలిగించడానికి సంకల్పిస్తే ఆ యిల్లాలు ఘోర నరకశిక్ష అనుభవిస్తుందని ధర్మవేత్తలైన మునులు అభిభాషించారు.

పతిమాటకు మారుమాట పలకడం, పతి మనస్సుకి నొప్పి కలిగించడం, కోపించి పతిని దుర్భాషలాడడం సతికి ధర్మం కాదు. పైగా అది నరకప్రాప్తికి హేతువవుతుంది.

పతి ఇంకొకభామను కోరి సుఖిస్తూంటే కోపించక అతని ఇష్టానుసారంగా నడిచే సతి బంగారానికి పరిమళం అబ్బినట్లు వన్నె కెక్కుతుంది.

ఇంకొకమాట. ఈమెపై మన నాథునకు ప్రేమ ఎన్నాళ్లో? ఎంత స్థిరమో ఎవరు చెప్పగలరు? ఓపిక పట్టండి. ఆయన మాటకి ఊకొట్టండి. మీద దైవ మెరుగు. తమకించకండి. ధర్మ మనుసరించండి.

అని సంధ్యావళి పతివ్రతా ధర్మసూక్ష్మం తోడిసవతులకు వివరించి వారి మనోవిచారాన్ని పోగొట్టి ధైర్యం కలిగించి సముదాయించింది. ఆ సాధ్వీశిరోమణి మాటలు మంచిమాటలుగా అర్థం చేసుకుని ఆ ఇల్లాండ్రందరూ ఆనందముఖులై తమతమ భవనాలకు వెళ్ళిపోయారు. అదంతా విని చూసిన రుక్మాంగదుడు సంధ్యావళిని చేరదీసుకుని ఆమె సౌశీల్యాన్ని ప్రశంసించి పరమానందంగా ఆమెకి అమూల్యములైన అంబరాభరణాలూ, అంగరాగాలూ పారితోషికంగా ఇచ్చి ప్రియంగా మాట్లాడాడు. ఆ అమాయకురాలు అవన్నీ ఆనందంగా తీసుకుని భర్త అనుజ్ఞతో తన భవనానికి వెళ్లిపోయింది.

తరువాత రుక్మాంగదుడు మోహినితో వివిధ భోగాలు స్వేచ్ఛగ అనుభవించ నారంభించాడు. బంగరు మేడలలో తోటలలో పూదోటలలో ఎక్కడ చూచినా మోహిని రుక్మాంగదుడూ మనోమదనములైన వస్తువులతో చీకూచింత లేకుండా సుఖిస్తున్నారు.

## శరదృతువు:

అలా కాలం హేలగ, లీలగా వెళ్ళుతూండగా శరదృతువు సంప్రాప్తించింది. చందమామ చల్లని తెల్లని వెన్నెల మింటినీ మంటినీ కప్పురపుధూళితో ముత్యాలపొడితో నింపుతూంది. కటికచీకట్లు మెరుగుచుక్కల చక్కదనాన్ని చూసి ఓర్వలేక మూలలంట చేరిపోతున్నాయి. పిల్లపెసర ఏపుగా పెరుగసాగింది. అలపోతు మదించి రంకె వేస్తూంది. ఘనప్రతాపాలతో సహ ఖరకరప్రతాపం కూడా మటుమాయమయింది. మంచు ఆకులమీద మంచిముత్యాలను సృష్టిస్తూంది. దొండముక్కు పండసాగింది. సస్యం వెన్ను వంచింది. నదులు కలక తేరాయి. పంకం ఇంకి బాటలు నడకకు నిరాటంకము లయాయి. రెల్లు గరగరగా పూచింది. పోకచెట్లు కాయలతో కనువిందు లౌతున్నాయి. తామ్రపర్ణీ నదియందలి శుక్తులు గర్భవతులయాయి, కలువలు కళలెక్కి మిలమిల లాడుతున్నాయి.

సకలధాన్యసమృద్ధి, ప్రసన్నమైన వెన్నెల, నిర్మలమైన తీయనైన నీరు, ముచ్చటైన మంచువాన, సెగచల్లని లేత ఎండ - శరత్కాలానికి సహజాలంకారాలు. శరదాగమనానికి సాటివచ్చే కాలమే లేదని చెప్పవచ్చు.

పాలకడలిలో శేషశయ్యపై యోగనిద్రాముద్రితుడై ఉన్న శౌరిని భజించడానికి శరల్లక్ష్మి వచ్చిందా అన్నట్లు మధుపగీతాలూ, బెగ్గురు పక్షుల కంఠకాహళస్వనాలూ, కుముదాతపత్రాలూ, శుకస్తుతులూ, మరాళపక్ష చామరాలూ సవిలాసంగా మేల్కొలుపు శోభను సంతరిస్తున్నాయి.

అలాటి శరదాగమనంలో రెండవనెల కార్తికం. ఆ కార్తికమాస శోభ రుక్మాంగదుని కీర్తికి మూర్తి అన్నట్టుంది. మొగలిపువ్వులా శోభకి మరింతశోభ సంతరిస్తున్నాయి.

ఆనాడు కార్తిక శుద్ధదశమి. అలవాటు ప్రకారం తలారులు ఆనాటి ప్రభాత సమయాన పెందలకడ నిదుర మేల్కొని స్నానం చేసి చలువ చేసిన వస్త్రాలు కట్టి దప్పులు వాయించుతూ రాచబాటలో చాట నారంభించారు. వారివెంట రాజభటులు కూడా ఏనుగు నెక్కి భేరీధ్వనులతో పురవీధుల్లో తిరుగుతూ......

రేపు ఏకాదశి. ఇదే ఉత్థానైకాదశి. పాలసముద్రంలో శేషశాయియై ఉన్న శ్రీ మహావిష్ణువు మేల్కొనే పుణ్యదివసం. సనాతనాచారం ప్రకారం ఏకాదశీవ్రతం జరపండి.

అని ఇళ్ళు మారుమ్రోగేట్లు చాటుతూ వెళ్ళారు.

అంతఃపురంలో హంసతూలికాతల్పం మోహిని కౌగిటనున్న రుక్మాంగదుడు భటుల చాటింపు విని బెదురుతూ కౌగిలి విడిపించుకుని చప్పున లేచి క్రిందికి దిగి తలుపు ఓరగకూర్చుని విష్ణునామస్మరణ చెయ్యనారంభించాడు. ఆ అవస్థ చూసి మోహిని కూడా పాన్పు దిగి ఒక అడుగు దూరంగా నిల్చుంది. సిగ్గూ అలుకా కలగలుపుగా స్త్రీ రూపం ధరించినట్టుందా మూర్తి. తేరిపార చూసింది రాజుని. గొంతు సవరించుకొని అడిగింది.

రాజా! ఏమిటీ పని? ఈ నిముసం వరకు నాపైనున్న వలపు ఏమయింది? ఏమి పుట్టి మునిగిందని బెదురుతో పానుపు దిగి వచ్చి ఇక్కడ కూర్చుని హరి హరీ! అంటున్నావు. నీ చర్య ఆశ్చర్యకరంగా ఉంది. నన్ను చూసినది మొదలు ఇంతవరకూ లేని వైరాగ్యం ఇంతలో ఎలా వచ్చిందో? కంటితుడుపు మాటకాక ఉన్నది ఉన్నట్లు చెప్పు. ఏమిటి నీ కథ? ఆనందకరమైన కామశాస్త్రం, శ్రీహరి చింతనం ఈ రెండూ సఫలం కావాలని కోరుతున్నావా? రెండూ ఒకదాని కొకటి పరమశత్రువులు.

అది అలా ఉండనీ! ఇంతవరకూ నాపై చూపిన మచ్చిక, మోహం ప్రియమార నాతో మాటాడే మనసు ఏమైపోయాయి! నాపై ఉన్న మమత చంపుకోవాలని చూస్తున్నావా?

అని అదోలాగా మోహిని అనిన మాటలు విని రుక్మాంగదుడు అల్లనల్లన కళ్లు తెరిచి మెల్లగా అన్నాడు.

## రెంటికి చెడ్డ రేవణ:

పద్మముఖీ! నీపై కొనలు సాగిన మోహం ఇంతలో జారిపోడానికి అది జాజుల పరిమళమా? మెరుపా? మేఘమా? అనుమానించకు. అది అలా ఉండనీ? దాపరికంలేక చెప్తున్నాను విను.

ఏకాదశీవ్రతం నా జీవితానికి ముఖ్యం. దానికి తొలినాడు స్త్రీ సంబంధం కూడదు. ఈ నాడంతా శ్రీహరిస్మరణ కర్తవ్యం. నన్ను చేపట్టిన దానవు కనుక నువ్వుకూడా నాలాగే ఈనాడు శుచివై నిశ్చలబుద్ధితో ఆ దేవుని నామకీర్తనం చెయ్యడం మంచిది. ఆయన కరుణానిధి. భక్తులకు చిరకాలం సుఖజీవనం అనుగ్రహిస్తాడు.

ఆ పద్మాక్షుణ్ణి ఆత్మలో తలచుకుంటే చాలు, ఆ దేవుని పాదపద్మాలు భక్తితో కొలుచుకుంటే చాలు, ఆ యీశ్వరుని నామాలు నోరారా పలికితే చాలు - జీవితం సుస్థిరమైన సుఖం అనుభవిస్తుంది.

హరియే దైవం. అతనిని చెప్పేదే శాస్త్రం. శ్రీపతిని జపించేదే మంత్రం. అచ్యుతుని ఆరాధనయే పుణ్యవ్రతం. కరివరదుణ్ణి గూర్చి చదివేదే చదువు.

హరిభక్తికి సాటియైన భక్తి, హరిభక్తుని పోలిన భక్తుడు, హరిని పోలిన దైవం, హరినామం వంటి మంత్రమూ లేవు. విన్నావా?

రాజు మాటలు విని ఆ రాజవదన ఇలా గన్నది. విన్నాను రాజా! విన్నాను. నీ ధర్మమా అని ఇంకా చెవుడు రాలేదు. నా మాట విను. కాంతాసుఖసంపద కలిగించే రాజు మదనుడు. సంసారసుఖం కోరే సంసారులు కొలువవలసే దైవం మదనుడు. నువ్వు చెప్పేది ఇంటిని ఇల్లాలిని వదలుకొని లోకబంధం తెంపుకొని ఏ కారడివికోపోయి ఏ చెట్టుక్రిందనో కళ్లు మూసుకుని కూర్చునే సన్న్యాసికిగాని సిరీ సంపదా సమృద్ధిగా ఉండి అంతఃపురంలో అనువైన కాంత ప్రక్కనున్న సంసారికి కాదు. ఆలోచించు.

నేను నిన్ను విడిచి గడియ అయినా ఉండలే ననేది నీకు తెలియనిది కాదు. నువ్వు నాతో ఉన్న రహస్యం ఇప్పుడు తెలిసింది. నీ భార్యలకు భయపడి నాపై మోహమున్నట్లు ఇక్కడ పడి ఉన్నావు. అంతే నంటావా?

ఎందుకు వచ్చిన అవస్థ ఇది? ఇంట్లో ఇల్లాలు పిల్లలూ ఏడుస్తూ ఉండగా చిల్లిసంచి, దర్భాసనం, దండం, చేతిలో దర్భలు ధరించి ఏ అడవిలోనో మృగాలలో మృగమై, ఆకులు, గాలి, కాయ, కసురూ తింటూ దిక్కుమాలిన దీనావస్థతో కాలక్షేపం చేసే తలిసిలాగా మహారాజువైన నీవు ఈ ఉపవాసాలతో జపాలతో మగ్గిపోతానంటా వెందుకు?

పన్నీటిస్నానం, గంధపుపూత, అమృతోపమానమైన అన్నం, పట్టుపరుపు, పడతి చెలిమి ఉండగా అనవ్నీ వదలుకుని మడుగునీట స్నానం, తిరుమంటిపూత, దుంపకూర, జాగరం ఎందుకు వచ్చిన బాధ ఇది రాజా!

ఇంకొకటి నీకు ముఖ్యంగా జ్ఞాపకం చేస్తున్నాను. నన్ను విడిచి ఒక్క గడియ అయినా ఉండనని రామలింగేశ్వరుని పాదాల సాక్షిగా ప్రమాణం చేసి నన్ను పరిగ్రహించి తీసుకువచ్చావు.ఇప్పుడు నన్ను ఎడపెట్టిన ఆ ప్రమాణం ఏమైనట్టు? అడినమాట తప్పని రాజని మనసా నమ్మి నీ పెళ్ళికి ఒప్పుకున్నాను. ఆ సమక్షముతోనే నీ వెంట వచ్చాను. ధర్మసింహాసనం మీద కూర్చున్న నీ వంటి ఏలిక అసత్య మాడవచ్చునా? అవన్నీ ఈశ్వర పాదసాక్షిగా పలికినది గాలికి వదలి వేస్తున్నావు. ఈలాటి కల్లరితో నాకేం చెల్లుతుంది కాపురం? నీ మాయమాటలు నమ్మి వచ్చి నందుకు రెంటికిచెడ్డ రేవణ బ్రతుకయింది నా బ్రతుకు. నిశ్చింతగా మందరిగిరి ప్రాంతాన ఈశ్వర పాదసేవ చేసుకుంటూ హాయిగా కాలం గడపడం లేదు. ఇక్కడ నీతో అంతఃపుర కాంతగా కాలక్షేపం చేయడం లేదు. నా కెందు కీ అగడు బ్రతుకు? అనుభవించినంతకాలం అనుభవించావు. ఇప్పుడు చప్పగా విడిచిపెట్టావు. ఇంక నువ్వు నన్ను చేరదీస్తానన్నది గంజిపోస్తూ ఉంటే ఉట్టివైపు చూసినట్టే................అని నీరసంగా నిష్ఠూరంగా మోహిని నాలుగుమాటలని ముందుకు నాలుగైదడుగులు వేసిందో లేదో సంధ్యావళి ఎదురయింది. ఆమెను చూడగానే మోహిని ముందుకు వెళ్లలేక బెదురుతూన్నట్టు నటించి తలుపుదాపుగా నిల్చుండిపోయింది. అప్పుడు సంధ్యావళి దరిజేరి ఇలా అన్నది.

**తగునా? :**

మోహినీ? విన్నాను నీ మాటలు. శ్రుతి మీరకూడదని సాహసించి వచ్చాను. రెండు మాటలు అనవలసివచ్చి అంటున్నాను. విను.

బ్రహ్మామానసపుత్రివట నువ్వు, మరి నీకు తెలియని ధర్మాలున్నాయంటే నేను నమ్మను. కానీ పామరభామల్లాగా ఏమేమో అనడం నాకు ఆశ్చర్యం కలుగుతూంది.

భక్తితో పతిచేసే వ్రతంవద్దని అనే వనిత ఉంటుందా? పతి మాట దాటక అనుకూలవతి అయి నడుచుకోడం సతికి ధర్మం. నువ్వు ఇందుకు ప్రతికూలంగా నడవడం తగునా?

పతిని ప్రత్యక్షదైవంగా భావించి భక్తితో ఆతని మాటకి అనుగుణంగా ప్రవర్తించడం, ఆ మాట వేదవాక్కుగా మన్నించడం, పతి నియమించినది తన వ్రతంగా చేయడం, పతి ఆదరంగా ఇచ్చిన పదార్థం పదివేలుగా భావించి సంతోషించడం, పతివంక చుట్టాలను ప్రాణబంధువులుగా చూడడం, పతికి విరోధులైన వారిని కలనైనా చూడకపోవడం - అనేవి సతీ ధర్మసూత్రాలు. వీటిని త్రికరణశుద్ధిగా అనుసరించవలసిందే.

భార్య ముందుగా లేచి స్నానంచేసి వేణ్ణీళ్లు సిద్ధపరచి భర్తకి స్నానం చేయించాలి. ఆతనికి మనసా నచ్చిన కూరలూ, కూడు వేళకి వండి వడ్డించాలి. ఆయన భుజించి విడిచిన ఆహార పదార్థములు అమృత సమములుగా భావించి ఇల్లాలు ఆరగించాలి. పక్క దులిపి మడతదుప్పటి పరచి తలదిండు సర్ది పానుపుపై ఆయన వ్రాలగా తాంబూల మివ్వాలి. తాంబూలచర్వణం అయి ఆతడు నిద్రించేవరకు సున్నితంగా పాదాలొత్తాలి, ఆ తరువాత తను విడెము వేసుకుని అనువైనచోట నిద్రించాలి.

ఇల్లాలు మందెమేలపుమాట లాడరాదు. ఎదురుమంచం ఎక్కరాదు. పతిమాట లేక అరకాసైనా కర్చు చెయ్యకూడదు. ఎప్పుడైనా దేనికైనా కోపించి ఏమైనా పరుషంగా అంటే ఎదిరించి మాటాడరాదు. ఓర్పుతో నేర్పుతో చెప్పి ప్రసన్నుణ్ణి చేసుకోవాలి. నగలు కావాలని గొంతెమ్మ కోరికలతో మగని మనసు కలత పెట్టకూడదు. చనువిస్తున్నాడని దేనికీ స్వతంత్రించరాదు. తెలిసి కులటతో చెలిమి చెయ్యకూడదు. తెల్లవారిన పిదప నిద్రింపరాదు. మగనికన్నా ముందు చీకటి ఉండగానే మేల్కొని నిత్యకృత్యాలు నెరవేర్చుకోవాలి. ఏ పరిస్థితిలోనూ భర్త కంటె ముందు భార్య భుజించరాదు. అన్యపురుషులతో హాస్యప్రసంగాలు ఇల్లాలికి నిషిద్ధాలు. ఎరిగి మరిచి ఎన్నడూ ఈ ధర్మసూత్రాలను విరుద్ధంగా గృహిణి నడవకూడదు.

పతిభక్తిలేక ఏ వ్రతాలూ చేసినా, ఎన్ని ఉపవాసాలున్నా, ఏ తీర్థాలలో మునిగినా, ఏ దేవతలను పూజించినా పాపమే తప్ప లవలేశమైనా పున్నెం రాదు.

ఇహ వరాలిచ్చే పతిభక్తిని విడిచి ఇంకొక విధంగా మోక్షం సంపాదించడానికి ప్రయత్నించడం బంగారు పర్వతాన్ని తలగడగా చేసుకొని పడుకొన్న వ్యక్తి కంకరరాళ్ళు ఏరడం వంటిదే అవుతుంది.

భర్త పేదరికంలో బాధపడుతూన్నా, రోగాలతో చీకాకుపడుతూన్నా ముసలితనంతో అసురుసురంటున్నా ఇల్లాలు అనుకూలంగా ఉంటూ ఆదరంగా ఆదుకుంటూ సేవించాలి గాని విసువు చెందరాదు.

సతికి పతిభక్తి కల్పవృక్షం. పతిసేవ సర్వశోభనాలనూ కలిగించే కామధేనువు ఇష్టసిద్ధులకు చింతామణి పతిభక్తి. పతి అనురాగం సతికి జన్మఫలం. పతిదయ పసిడిమూట. పతిభక్తి అనే సంపద సతికి ఏ దేవకాంతలూ పొందలేని శుభాన్ని కలిగిస్తుంది.

ఒకప్పుడు పతి పరభామను వరించినట్టు తెలిస్తే సతి కోపగించకూడదు. అతనికి అనుకూలంగా నడుస్తూ మంచిని బోధించి తనవైపు త్రిప్పుకోవాలి. పతి కోపంగా ఉన్నపుడు అతని పానుపునకు చేరువనే నేలపై నిద్రించాలి.

పతి పరదేశం వెళ్లినపుడు తిరిగి వచ్చేదాకా నల్లపూసల కుతికంటు, గాజులూ, మంగళసూత్రం, మొగాన పసుపు, అక్షతలబొట్టు మాత్రం ధరిస్తూ మాసిన వలువలతో కాలక్షేపం చెయ్యాలి కానీ అలంకరించుకో గూడదు. అతడు క్షేమంగా ఇంటికి చేరాలని కోరుతూ ఇంటిదేవతను నియమంగా ఆరాధిస్తూ ఉండాలి.

ఇల్లాలికి మంగళసూత్రమే శృంగారపేటి. ఐదవతనమే కడలేని తేజస్సు. భర్త దృఢంగా ఉండడమే భాగ్యం. పతి హితం కన్నా మిన్నయైన శోభనం మరొకటి లేదు. ఇహపరాలిచ్చే పతి మహిమ తెలియక ఇలా వాదులాడడం తగునా మగువా?

పతికి కోపం కలిగించడం, పతిపై కోపగించడం సతికి పాపహేతువులు. భర్త ఉన్నంతవరకే భార్యకు భోగభాగ్యాలు. భర్త లేనప్పుడు ఆ భార్యకు ఏమీలేనట్లే. జీవచ్ఛవానికి అందచందలూ ఐశ్వర్యమూ భోగభాగ్యాలూ లెక్కకి వస్తాయా! (సతీ సహగమన విషయాన్ని తొలగించడమైనది.)

పెనిమిటి చెప్పినట్టు నడవని పెడసరి అనరాని వినరాని బాధ అనుభవిస్తుంది. దీనికి ఉదాహరణగా ఒక కథ చెప్తాను విను.

**పెడసరి పురుగు:**

నా పుట్టింట పన్నెండేళ్ల వయసులో నే మున్నప్పుడు సేవకుడు కర్రలు చీల్చుతున్నాడు. నేను అక్కడ నిల్చుని చూస్తున్నాను. వాడు కర్రలు చీల్చుతుండగా ఒక కర్ర చీలి దానిలోంచి ఒక పురుగు ఎగిరివచ్చి నేలమీద పడ్డది. దానిని కాకులు చీకాకుచేయగా అది తప్పించుకున్నది. నేను ఆ కాకుల్ని బెదరగొట్టి ఆ కీటకాన్ని మరొక చోటికి తీసుకెళ్లి నీళ్ళు చల్లి మెల్లగా మేను రాశాను, ఆ సేవతో కొంతసేపటికి అది తేరుకుని మనుష్యుల మాటతో ఇలా చెప్పింది.

## ఏకాదశీ మాహాత్మ్యం

చల్లని మనసుగల తల్లీ! నన్ను కాకిమూకనుంచి తప్పించి కాపాడిన నీ కృప నేమని చెప్పగలను? నేను తొలి పుట్టువులో భర్తమీద కోపించి చేసిన చెడ్డపనికి ఫలితం ఇది. అదేమిటో చెప్తాను విను.

సముద్రతీరాన ఒక గ్రామం. దానిపేరు మాణిక్యపురం. ఆ గ్రామంలో ఒక బ్రాహ్మణుడు. అతనిపేరు విష్ణుశర్మ. ఆయన వేదాలకు గాదె. శాస్త్రాలకు బోదె. అతనికి ఒక కొడుకు. అందచందాలకు పెట్టింది పేరు. అతనిపేరు పద్మనాభుడు. నే నతనికి అగ్ని సాక్షిగా చేపట్టిన ఇల్లాలిని. అతని స్వభావం తండ్రికి శుద్ధవ్యతిరేకం. ఒక్కమాటలో నా పతిని గురించి చెప్తాను. విటచక్రవర్తి. చదువుకోవడం అంటే ఏదో తప్పుచేసినట్టు ఎంచి గుంటలోనే గంట వాయించేశాడట! తీర్థయాత్రకి తిలోదకా లిచ్చేసాడు. సంధ్యావందనాదులకు ముందుగానే స్వస్తి పలికాడు. ఇక జపం హోమం వంటివి  చెట్టెక్కిపోయాయి. చదివినదంతా కామశాస్త్రం. ఎన్ని అవృత్తులో చదివాడు. కంఠపాఠం చేశాడు. జూదరులకు గురువయ్యాడు. నటులు విదూషకులు ప్రాణమిత్రులు. విలువిద్యలో సవ్యసాచి. స్త్రీలను వశపరచుకునే మందులు, మంత్రాలు, మాయలు నేర్చిన గురువుకి గురువయ్యాడు. వాళ్లకి కానుకలు, కట్నాలూ పంపుతూ అదే జన్మఫలంగా సంచరించ నారంభించాడు.

మామగారు సదా కప్పుకునే సేలువ, అది పట్టుదుప్పటి. దానిని అదను చూచి అపహరించి ఒకతెకు ఇచ్చివేశాడు. కంఠమాల ఒక కలికికి కానుకగా సమర్పించాడు. బంగారుపువ్వుల వెండిపళ్ళెరం ఒక భామకి ఇచ్చాడు. మాన్యం అమ్మి ఒక వెలయాలికి ఆ సొమ్మంతా ముడుపు చెల్లించాడు. తరతరాలుగా ఇంటనున్న పల్లకీ ఒక పల్లవాధర కిచ్చాడు. పరుపుతో సహా ఉయ్యాల మంచం ఒక తొయ్యలికి చేరవేశాడు.

మంచిపనికి ఒక దమ్మిడీ అయినా వెచ్చించక జారకాంతలకు ఇంట ఉన్న సొమ్మంతా చూరలిచ్చాడు. కుంచన్న కూడబెడితే మంచన్న మాయం చేశాడన్నట్టయింది మా యింటి బ్రతుకు.

న న్నెన్నడున్నూ కన్నెత్తి  చూసినదే లేదు. పెదవి కదిపి పిలిచినదీ లేదు. నికృష్టులతో, నీచులతో, కులభ్రష్టులతో నిరంతరం స్నేహం. దుర్వ్యాపారాలకు దుబారా ఖర్చు.

ఇక వస్తాడు. ఆకలితో నకనకలాడుతూ ఉంటాడని, నే నెంతో శ్రద్ధగా శుద్ధిగా బుద్ధిగా ఇల్లలికి ముగ్గులు పెట్టి అలంకరించి, స్నానానికి నీళ్ళుపెట్టి రుచిగా శుచిగా వండి ఎదురుచూస్తూ ఉంటాను. ఒకనాడైనా వేళకి ఇంటికి చేరేదీ, నన్ను చూసేదీ

అప్యాయంగా మాట్లాడేది లేదు. ఆ నీళ్ళు అదరాబాదరాగా తలమీద రెండు మూడు చెంబులు పోసుకుని అటూ ఇటూ ఒళ్ళు తుడుచుకుని గబగబా వంటింటికి రావడం పీటమీద సరిగా కూర్చోక, విస్తరిలో ఏముందో సరిగా చూడనేనా చూడక, పందెం వేసినట్టు నాలుగు ముద్దలలో అయిందనిపించి లేవడం ఒక్క అడుగులో గడపదాటి వీధినపడి తిలదానం పట్టినవాడిలాగా తిరిగిచూడక వెళ్ళి పోవడం ఇదే వరుస. క్షణమైనా భుజించాక ఇంటిపట్టున ఉండేదే లేదు.

ఇలా ఇంటి యజమాని నడుస్తూ ఉంటే ఆ ఇంట ఏమి మిగులుతుంది? ఇల్లు గుల్లయిపోయింది. మరి విలాసాలకు సొమ్మెలా వస్తుంది? ఎంత చెప్పినా నా మాట లక్ష్యపెట్టక అప్పులు చెయ్యడం మొదలైంది. అలా దొరికినంతవరకూ అప్పుచేసి ఖర్చుచెయ్యడం.......క్రమంగా పరపతి పోయింది. కాని అప్పులిచ్చినవారు ఊరకుంటారా? సొనులు ఉత్తచేతులతో పంచకు చేరనిస్తారా? ఏమి చెయ్యాలి?

అప్పిచ్చినవారు అక్కడక్కడా పట్టుకొని నోటికి వచ్చినట్టు కారుకూతలు కూసి చిదగగొట్టి చెవులు మూసి పంపారు. వారి బాధ పడలేక ఒకనాడు కొందరు ఋణదాతలను తీసుకువచ్చి వీధిచావడిలో ఉంచి మా ఆయన నా వద్దకు వచ్చి చేతులు జోడించి.............

నువ్వు కాంతారత్నానివి. నేను మతివూలి నిన్ను సరిగా చూడక ఏడిపించినందుకు నాగతి ఇలా కాలింది చూడు. వీపు తోలూడునట్టు ఆ అప్పులిచ్చిన పెద్దమనుషులు ఎలా కొట్టారో? క్షమించు తప్పుచేశాను. మరి నా ఆపదకి నువ్వుకాక అడ్డుపడే వారెవరున్నారు? నీ నగలిచ్చి నన్నీ ఊబిలోంచి గట్టెక్కించవా? నీకు కొద్దికాలంలోనే మళ్లీ చక్కని నగలు చేయించి పెట్టుతాను.

తల్లి, తండ్రి, గురువు నాకు నువ్వే. బుద్ధివచ్చింది. ఈ నిముషం నుంచి నీకు అనుకూలంగా నడుచుకుంటాను. జూదం వగైరా అన్నీ వదులుకుంటున్నాను. నీమీద ఒట్టువేసి చెప్తున్నాను. నీ వంటి సుగుణాలదొంతికి నావంటి దుండగీడు తగడు, అయిందేదో అయింది. నా మాట మన్నించు తెలిసిన బుద్ధిమంతురాలవు. ఎంత నికృష్టుడైనా పతిని సతి ఎడబెట్టరాదు కదా అని చప్పున నా పాదాలమీద పడిపోయాడు. నేను అలాగే అతని తల త్రోసివేసి కొంచెం దూరంగా నిల్చుని ఆపరాని కోపంతో నాలుగు మాటలన్నాను.

నువ్వు మన్మథపూజతో జారిణుల ఇళ్లలో పూజారివై యున్న బుద్ధిహీనుడవు. జూదం, దొంగతనం నీ విద్యలు. అసత్యం నీ వ్రతం. పుస్తె కట్టినది మొదలు ఈ

నాటిదాకా నన్ను కన్నెత్తైనా చూశావా? పిలిచినా పలికావా? నోరెత్తి మాటాడావా? ఆతురసన్న్యాసం పుచ్చుకుని ఇప్పుడు అంగలారుస్తావా? చేతులు కాల్చుకుని ఆకులు పట్టుకోవడం వివేకిలక్షణమా?

కట్ట బట్టా, కొప్పుకి పువ్వు చేచేతులా తెచ్చి ఒకనాడైనా ఇచ్చిన పాపాన పోయావా?

అగ్నిసాక్షిగా పెళ్ళాడిన ఇల్లాలి బ్రతుకు అధ్వాన్నం చేసిన ప్రబుద్ధుడవు. నువ్వేమి మగడవు! నేనేమి భార్యను! నీ పగ తప్పించుకునేందుకు వగలుచూపి నగ లడుగుతున్నాను. చూడు. నా వంటిమీద నున్న ఈ నగలలో ఏ ఒక్కటైనా నువ్వు చేయించినదేమో! ఇవన్నీ మా పుట్టింటివారూ, చుట్టాలూ చేయించి పెట్టినవే. వీటి నడగడానికి నీకు నోరెలా వచ్చింది? నీకు సిగ్గు లేదూ? వీటిలో ఒక్కటికూడా ఇచ్చేది లేదు. నా బ్రతుకంతా నువ్వే అని మంగళసూత్రధారణ కాగానే నిన్ను నమ్మి ఆ యింటి నుండి ఈ యింటికి వచ్చిన అడుదానను. నన్ను గాలికి వదలి అడ్డమైన నడకలు నడిచి ఇప్పుడు నంగనాచి మాటలాడుతావా? వెళ్లువెళ్లు. నీ దారి నీది. నా దారి నాది. నేను పుట్టింటికి పోతున్నాను.

అని చరచరా గదిలోకి వెళ్లిపోయాను. ఈ భాగోతమంతా చూస్తున్న అప్పులవాళ్ళు చప్పున లోపలికి వచ్చి ఆయనను పట్టుకుని నాలుగుతన్ని తాళ్లతోకట్టి ఒక మూల పడవేసి రేపు వస్తాము. మా అప్పు తీర్చకపోతే నీ అంతు చూస్తాము. జాగ్రత్త! అని బెదిరించి వెళ్ళిపోయారు.

అంతలో సూర్యుడు అస్తమించాడు. క్రమంగా కటికచీకటి క్రమ్మింది. జగమంతా అంధకారబంధురమైంది. ఆ చీకటిలో నా మగడు మెల్లమెల్లగా కట్లు దిగజార్చుకుని బయడపడి ఆ చీకటితోడుగా పరారై పోయాడు. తెల్లవారిన తర్వాత నేను లేచి మా పుట్టింటికి వెళ్ళిపోయాను. తరువాతి కథ ఆయన కొంతకాలం అయాక తిరిగివచ్చి చెప్పినది చెప్తున్నాను విను.

అయన అలాగు పల్లెలూ పట్టణాలూ కొండలూ కోనలూ దాటి పోయి పోయి ఒకసముద్రం వద్దకు చేరాడు. అక్కడ రత్నాలవర్తకుల ఓడ ఒకటి కనిపించగా ఆ వర్తకులను ప్రార్థించి వారు అనుమతితో ఓడ ఎక్కాడు. సముద్రములో ఓడ వెళ్తుండగా ఒక కొండప్రక్కకు చేరేసరికి పెనుగాలి వీచి ఓడలో ఉన్నవారికి గుండెదడ పుట్టించింది. వారు అతి ప్రయాసతో ఓడను కొండదరికి చేర్చి లంగరు దించి బ్రతుకు జీవుడా! అనుకున్నారు. ఆ రాత్రి వాళ్ళకి కాళరాత్రిలా తోచగా భయపడకండి అని వారికి అభయమిచ్చినట్టు చంద్రోదయమైంది.

ఆసమయంలో నా భర్త ఆకలికి తాళలేక 'ఈ కొండమీద ఏవేనా ఫల వృక్షాలుండవా? ఆ పళ్ళుతిని ఇన్ని నీళ్ళుత్రాగి ఈ రాత్రికి ప్రాణాలు నిలిపుకుంటే చాలు. తెల్లవారాక చూడవచ్చు తరువాతి కథ. ఊరక ఈ ఓడలో చావడమెందుకు?' అని ఆలోచించి పడవ దిగి కొండ ఎక్కాడు. ఆ కొండమీంచి నలువైపులా చూడగా ఒక దిగుడుబావి కనిపించింది. గబగబా కొండమీంచి ఆ బావివద్దకు చేరి దానిలో స్నానం, సంధ్యావందనం చేసి దప్పితీరా ఇంతనీరు త్రాగాడు. తరువాత అక్కడనుంచి ముందుకు వెళ్ళి వెళ్ళి ఒక మామిడితోటలో ప్రవేశించాడు. చెప్పేదేముంది. ఇన్ని పళ్ళు తెంపి కడుపారా ఫలరసం పీల్చి ఆకలి తీరిన ఆనందంతో ఆ చెట్ల క్రింద చల్లని వెన్నెల గాలి వీచుతుండగా పడుకున్నాడు.

## రాక్షస సుందరి:

అలా సుఖంగా నిద్రిస్తూండగా కొంతసేపయాక అక్కడి కొక రాక్షససుందరి వచ్చి లేపింది, లేచి కళ్ళు తెరిచి చూశాడు. ఎట్టఎదుట ఒక సుందరి. మన్మథ దీపమా? రతిచేతి చిలుకా? రతనపు బొమ్మా? మెరుపా? నవచంద్రరేఖా? వసంతుడు పెంచిన పువుతీగా? జయంతుని పట్టపుదేనుగా? అన్నట్టున్న మోహనాంగి. ఆశ్చర్యపడి అడిగాడు.

కోమలీ! ఎవరు నువ్వు? నీ వా రెవరు? ఎక్కడినుంచి వస్తున్నావు ఇక్కడి కెందుకొచ్చావు వివరించి చెప్పు.

అని అనగా ఆమె వినవయ్యా చెప్తాను. చల్లకి వచ్చి ముంత దాచడ మెందుకు? ఈ కొండమీద తారకుడనే రాక్షసు డొకడుంటున్నాడు. అతడు ఇచ్చవచ్చిన చోటికి వెళ్ళి కనిపించిన సంసారిని క్షణంలో చంపుతూ ఉంటున్నాడు. అతని కది ఒక ఆట. నే నా తని భార్యను. నా పేరు సుకేశి అని అంటారు. నేను జాతికి రాక్షసినే కాని నా భర్త చేస్తున్నపని మంచిది కాదని మంచిగా కాస్త పెలుసుగా చెప్తూ ఉంటాను. అతడు నా మాట పెడచెవిని పెట్టి జీవహింస చేస్తూనే వున్నాడు. ఇంట భోజనం వగైరా అతనికి నచ్చేట్టు చేస్తున్నా చచ్చేట్టు నన్ను కూడా కొట్టుతూ ఉంటాడు. చివరకు ఇలా వచ్చాను. నాకు కామరూపవిద్య తెలుసు. ఇప్పుడు చెప్పవలసేది ఒకటి ముఖ్యమైనది చెప్తాను విను.

కాశీరాజు 'పాంచాలశేఖరుడు' అని పేరుగల దొడ్డవాడు. అతని కూతురు చాలా అందగత్తె. పేరు పద్మిని. ఇంకా పెళ్లికాలేదు. ఆ కన్యను నా భర్త నిన్న సంధ్యాసమయంలో నిద్రపోతుండగా ఆ పానుపుతోనే ఎత్తుకువచ్చి మా నివాసానికి ప్రక్కనున్న తోటలో చదునైన చోట ఉంచాడు. దాని అందచందాలకు మురిసి

నన్ను పొమ్మని తూలనాడాడు. సరే నీ పని పట్టిస్తానుండు అని అనుకుని వాడు ధరించే విల్లూ బాణాలూ కాజేసి తెచ్చాను. ఇవిగో చూడు. వీటిని ఉపయోగించి ఆ నీచుణ్ణి హతమార్చావా, నిన్ను చేపట్టి కామరూపనై సుఖపడేట్టు చేస్తాను- అని విల్లమ్ములు ముందు పెట్టింది. అవి చూసి ఈయన అంతా బాగానే ఉంది గాని సుందరీ! ఆడవాళ్లను నమ్మినవాడు గాడిద అని పెద్దలంటారు.కోపానికీ మొండిపట్టుకీ ఆటపట్టు ఆడవాళ్లు. సమయం చూసి స్వార్థం కోసం ప్రాణం తీసేస్తారు. దేనికీ జంకరు. విషం లోపల ఉంచుకుని తేనె మాట లాడుతారు. వాటిని నమ్మి నడిచాడా ఆ మగవాని పని ఆ నిమిషంతో సరి. కనుక నిన్ను ఎలా నమ్మేది? అందునా సామాన్యురాలవు కావు. రాక్షసినని చెప్తున్నావు. నిన్ను నమ్మి నేను నిలబడితే మృత్యువుకి ఎదుట నిలిచినట్టే అని అన్నాడు. ఆ మాట కది నమ్మికగా ప్రమాణవాక్యాలు పలికింది.

నా మాట నమ్ము. నేను అసత్యమాడితే బ్రాహ్మణుణ్ణి చంపిన పాపం. యజ్ఞం నాశనం చేసినందువల్ల వచ్చే కల్మషం, కన్న కొడుకుని చంపిన దోషం నాకు వచ్చుగాక!

ఇక భర్తను చంపమంటున్నానని అనుమానించకు. నన్ను ఆ దుర్మార్గుడు బలాత్కరించి మా పుట్టింటినుంచి ఎత్తుకువచ్చినవాడు గాని జాతిసంప్రదాయం ప్రకారం పుస్తెకట్టిన మగడు కాడు. కనుక వానిచావు గురించి సందేహించకు.

అని విల్లమ్ములందించింది. ఆ మాటలు నమ్మినా భర్త వాటిని అందుకుని రాక్షసుడి గుండె రగిలేట్టు వింటి నెక్కుపెట్టి నారి సారించాడు. ఆ ధ్వని విని రాక్షసుడు కోపించి వచ్చి ఎదిరించాడు.

ఇద్దరికీ పోరు ఘోరంగా సాగింది. కొంతసేపటికి రక్కసునిబలం సన్నగిల్లడం, అది గ్రహించి నా భర్త చిన్ననాడు సాధించిన విలువిద్య యందలి నేర్పు చూపి వాడి కోలతో ఆ రక్కసుని తల తెగవేయడం జరిగింది.

ఇక ఆ రాక్షస సుందరి ఆనందానికి హద్దు ఉందా? అలాగే నా భర్తను కౌగిలించుకుని అభినందించింది.

అంతలో తెల్లవారింది. సుకేశి నా భర్తను పద్మిని ఉన్నచోటికి తీసుకెళ్ళి భయపడకు పద్మినీ! ఈ బ్రాహ్మణునివల్ల బ్రతికిపోయాము మన మిద్దరమున్నూ. ఆ రాక్షసుడితనితో పోరాడి మట్టిలో కలిశాడు. నిన్ను నీ తలిదండ్రుల వద్దకు చేర్చుతాను - అని వెంటనే హంసిగా మారిపోయి ఇద్దరినీ చెరొక రెక్కమీద కూర్చుండబెట్టుకుని అవలీలగా సముద్రం దాటి కాశీపురం చేరింది. అక్కడ ఇద్దరినీ

దింపి తానను సుందరిగా మారి పద్మినీ! ఇదిగో గంగానది. అదుగో డుంఠివినాయకుడు. ఆ మూర్తి భైరవస్వామి. అతడే ఆదికేశవుడు. అదే మణికర్ణిక. ఏమి! నీకు పరిచితమైన ప్రదేశం ఇది. అవునంటావా? అనుమానిస్తున్నావా? అవి అనగా పద్మిని తేరుకుని చిరునవ్వుతో ఔను అనుమానం లేదు. ఇది మా కాశీ నగరమే అంది. సుకేశి కూడా చిరునవ్వుతో రా! ముందుకి పోదాము - అని అనగా ముగ్గురూ ముందడుగు వేశారు.

**కాశి:**

అదిగో విశ్వజనయిత్రి విశాలాక్షీదేవి. ఆ దేవళమే జగజ్జనకుడు శ్రీ విశ్వేశ్వరస్వామి ఉండేది. ఈ దివ్యక్షేత్ర మహిమ నావంటి వారేమి వర్ణించగలరు.

ఎంగిలి తిన్న పాపం, బ్రాహ్మణుణ్ణి చంపిన దోషం, పరకాంతను కూడిన కల్మషం, యజ్ఞం పాడుచేసిన పాపం, తల్లినీ ఆడుదానిని చంపిన పాపం ఈ విశ్వేశ్వరుని పురమందు నివసిస్తే గాలికి ధూళిలాగా ఎగిరి పోతాయట.

సజీవంగా ఉండి ఎన్నెన్నో పుణ్యకర్మలు చేసినా మోక్షమన్నది దుర్లభం. కాశిలో మరణించిన ఏ జంతువైన ఈశ్వరరూపం ధరిస్తుందట. ఈ భాగ్యం బ్రహ్మకి కూడా కలగదంటారు విజ్ఞులు.

శ్రీ విశ్వేశ్వరుని వంటి దైవం, కాశీక్షేత్రాన్ని పోలిన పుణ్యక్షేత్రం, గంగవంటి తీర్థం, శ్రీ విశాలాక్షి వంటి మహాశక్తి నేలపై ఎక్కడా సమకూరవని తెలిసిన పెద్ద లంటారు.

ఇక్కడ ఉన్న చెట్లన్నీ కల్పవృక్షాలే. చిదిపిరాలన్నీ సిద్ధలింగాలే. ఆవులన్నీ కామధేనువులే. పల్లపు నీటి గుంటలన్నీ అమృతకూపాలే. జల ప్రవాహాలన్నీ గంగ సమములే. చండాలు రందరూ దేవతలే. దోమలన్నీ పక్షిరాజులే. తీవలన్నీ పంజివి లతలే. అటు కనిపించే గండశిలలన్నీ పరుసవేదులే. కమలగర్భుడైనా కాశీమహిమ వర్ణించలేడు.

కాశీ స్మరణ, కాశీ దర్శనం, కాశీ నివాసం, కాశియందు మరణం శివరూపప్రదం.

అని కాశీప్రభావం చెప్పి సుకేశి నా భర్తను పద్మినిని గంగ దరికి తీసుకువెళ్ళి స్నానాలూ చేద్దామంది. సరే అన్నారు. ముగ్గురూ గంగలో స్నానం చేసి శ్రీ విశ్వేశ్వరదర్శనం చేశారు. అక్కడ స్వామివారికి పాదాభివాదం చెల్లించి భక్తితో ప్రస్తుతించారు.

తరువాత కాలభైరవుణ్ణి భజించి, డుంఠి విఘ్నేశ్వరుణ్ణి అర్చించి, ఆ విశాలాక్షిని సేవించి, ఆదికేశవునకు పాదాభివందనం చేసి, లోలార్కుణ్ణి మనసారా స్తుతించి, సిద్ధలింగాలను సేవించి, ముక్తిమంటపమందు కొంతసేపుండి జ్ఞానవాపి మొదలైన తీర్థాలలో తేలి రాజమందిరం వద్దకు వెళ్లారు. పద్మినిని చూడగానే ద్వారపాలకుడు వెనుకకుతగ్గి దారి ఇచ్చాడు. ముగ్గురున్నూ తిన్నగా రాజున్న అంతఃపురానికి వెళ్ళారు. సుకేశి పద్మినిని లోనికి పంపింది. తామూ పద్మనాభుడూ వెలుపలనే ఉన్న ఆసనాలపై ఆసీనులైనారు.

కూతురు ఉన్నది ఉన్నట్టుగా మాయమైపోయింది. ఏమీ చేయడానికీ తోచక శోకమూర్తి అయి ఉన్న రాజు ఎట్టెదుట నిలుచున్న కూతుర్ని చూచి గభ్భునలేచి 'నాతల్లీ వచ్చావా!' అని గాఢంగా కౌగిలించుకుని ఆనందాశ్చర్యాలతో ఉల్లుకుపోయాడు. ప్రక్కనే కూర్చుండ బెట్టుకుని 'ఏమి జరిగింది? ఎక్కడికి వెళ్లావు ఎలా వచ్చావు? అని ఆత్రంగా అడిగాడు.

'ఏ ప్రమాదమూ జరుగలేదు. నా ప్రాణదాతలు ద్వారం ప్రక్క ఉన్నారు' అని తండ్రిని పద్మిని వెలుపలకు తీసుకుని వచ్చి సుకేశినినీ, పద్మనాభుణ్ణి చూపింది. రాజు వారికి స్వాగతం చెప్పి రండని ముగ్గుర్నీ భార్య ఉన్న మేడకి తీసుకుని వెళ్ళాడు. అక్కడ రాణి కూతురికోసం బెంగపెట్టుకుని బల్లిలాగా పానుపును అంటిపెట్టుకుని ఉంది. భర్తనూ, కూతురిని చూచి చప్పున లేచి అలాగే చేరదీసుకుని కౌగిలించుకుంది. 'బ్రతికి ఉన్నావా చిట్టితల్లీ! ఎంత పున్నెం చేశానో? చల్లగా వచ్చి నా కళ్ళపడ్డావు. ఆ వెనుక ఉన్న వారెవ్వరు? ఏమిటి జరిగింది? అని ప్రశ్నల వర్షం కురిపించింది.

'అమ్మా! కంగారుపడకు. వారే నన్ను బ్రతికించి ఇక్కడకు సుఖంగా తీసుకువచ్చిన పుణ్యమూర్తులు' అని సుకేశీ పద్మనాభులను లోనికి రప్పించి ఆసనాలు చూపింది పద్మిని. ఇద్దరూ కూర్చున్నారు.

తరువాత పద్మిని తన్ను ఎత్తుకుపోయింది మొదలు తిరిగి వచ్చిందాకా జరిగినదంతా చెప్పింది. అదంతా విని రాజదంపతులు సుకేశీ పద్మనాభుల్ని ఎంతో అభినందించారు. ఇద్దరికీ రత్నభూషణాలూ,అమూల్యములైన వస్త్రాలను బహూకరించారు. ఆపైన రాజు అన్నాడు.

బ్రాహ్మణోత్తమా! మా చిన్నారి పద్మినికై మేము పడుతూన్న బాధ మేము నమ్మిన దేవుళ్ళు శ్రీ విశాలాక్షి విశ్వేశ్వరులకే ఎరుక. ఉన్నట్టుండి చప్పున మాయమైపోయిందంటే ఏమనుకోవాలి? ఆ జగజ్జననీ జనకులే మీ రూపాలతో

కాపాడి కసుగందకుండా తీసుకువచ్చి మాకు అప్పగించారని అనుకుంటున్నాను. ఇది మా అదృష్టమే. ఆ దుష్టరాక్షసుణ్ణి సంహరించి మా పిల్లను రక్షించిన మీ దయను ఏమని వర్ణించేది. మీరు చేసిన ఈ ఉపకారానికి ప్రత్యుపకారం నన్ను నా రాజ్యాన్నీ మీ అధీనం చేసినా చాలదేమో! నా నిశ్చయాన్ని తెలుపుతున్నాను. అంగీకరించి నన్ను ధన్యుణ్ణి చేయవలసిందని కోరుతున్నాను, అలించు.

రక్కసుని చేతినుంచి రక్షించి మా కప్పగించిన మా పాపను నీకు భార్యగా సమర్పించదలచినాను – అని దోసిలిపట్టి సవినయంగా అన్నాడు. మంచిదన్నారు. రాణి, సుకేశి. సరే అన్నాడు పద్మనాభుడు.

మహదానందంగా రాజు బంధువులను రప్పించాడు. తగినవారిచే పురాలంకారం చేయించాడు. పురోహితుని రావించి శుభముహూర్తం నిర్ణయించి పద్మనాభుని పాదాలు కడిగి పట్టువస్త్రాలూ, మధుపర్కం ఇచ్చాడు. సాలంకృతంగా కన్యాదానం చేశాడు.

తరువాత వధూవరులు కల్యాణవేదికపై జరుపవలసే సాంప్రదాయిక వైవాహిక కాండ, సప్తపదులు త్రొక్కించడం, చంద్రముఖులు దవళం పాడడం, ద్విజులు మంత్రాలూ చెప్తూండగా లాజహోమం వగైరా పురోహితుడు జరిపించడం పూర్తి అయింది. లాజహోమానికి సంబంధించిన ధూమం పద్మిని కనులకు కాటుకయ్యై, వక్షముపై ఇంద్రనీల మణిహారమ్మై, ముంగురులకు నల్లకలువ పూదండయ్యై, నెమ్మోము తమ్మిపై కొదమ తుమ్మెదయ్యై, నుదుట కస్తూరి బొట్టుచందమ్మై సొంపు నింపింది.

వివాహానంతరం రాజు నవవధూవరులకు తృప్తిగా అమూల్యములైన అంబరాలూ, ఆభరణాలూ, అరణంగా వాహనాలూ దాసదాసీజనం ఇచ్చి సగౌరవంగా సాదరంగా పంపాడు.

అలా మహారాజోచితమ్మైన వైభవముతో ఇరువురి భార్యలతో నా భర్త మా పుట్టింటికి వచ్చి రెండు మూణ్ణాళ్లుండి మా పుట్టింటి వారిని కూడా వెంటపెట్టుకుని నాతో మా యూరికి వచ్చాడు. పాడైపోయిన ఇల్లూ వాకిలీ చక్కగా నిర్మింపచేసి అందరికీ అనువైనట్టు వసతు లేర్పాటు చేశాడు. ఆ వైభవానికీ ఐశ్వర్యానికీ ఆమందానందభరితులై మా పుట్టింటివారు కొన్నాళ్ళుండి తమ ఊరికి వెళ్ళిపోయారు.

నేను నాటి నా భర్త సౌశీల్యానికీ వైభవానికీ సవతుల మైత్రికి సిగ్గుపడుతూనే కాలం గడుపుతూ ఉండేదానను. ఆయన మా ముగ్గుర్నీ ఏకవాక్యగా ఏకమనస్సుతో లాలిస్తూ పాలిస్తూ ఉండేవాడు.

ఇది ఉంది అది లేదు - అనేదిలేక చాలాకాలం దివ్యభోగాలే అనుభవించాము.

కొంతకాలానకు నా భర్త కాలానుసారంగా దివంగతుడైనాడు. తరువాత నే నెంతో కాలం జీవించనే లేకపోయాను. అతనియెడ నేను చేసిన తప్పులు నిమిష నిమిషమూ నన్ను చంద్రనిప్పుల్లా కాల్చసాగాయి. నా సవతులు ఉపశమన వాక్కులతో లాలిస్తూ ఉన్నా నేను తేరుకోలేదు. ఆ చింతతోనే మరణించాను.

మరణించిన తర్వాత నరకానికే వెళ్ళానని వేరే చెప్పనక్కర లేదు. నరకములో నన్ను యమధర్మరాజు శాసనం ప్రకారము జముని దూతలు పెట్టిన యాతన చెప్పతరం కాదు.

ఉడుకు నూనెలతో ఉడికించారు. బాడిదచెట్టుకి కట్టి ఇనుపముళ్ల కొరడాలతో కొట్టేరు. గండుకుక్కలచే కండలు కరిపించారు. చత్రాతిపై పడుకోబెట్టి చిదగగొట్టారు. వాడికోలలతో గుండెపై గ్రుచ్చి ఏడిపించారు. ఉక్కురంపాలతో మాంసం కోసేరు. నిప్పుల ఏటిలోకి త్రోసి వెంట తరిమేరు. మంటలలో త్రోసి మొగం కాల్చారు, ఇలాగ ఎన్నెన్ని శిక్షలో చెప్పలేను. ఎంతకాలమో తెలియదు. చివరకు కర్రలో బ్రదికే పురుగుగా యముడు నన్ను పుట్టించాడు.

అని చెప్పి పురుగు నన్ను జాలిగా చూసి 'అమ్మా! మాఘమాసంలో నువ్వు పుణ్యనదిలో స్నానం చేసిన పుణ్యఫలం ఒకనాటిది కనికరించి ధారపోస్తే నాకీ నికృష్టపు జన్మ పోయి స్వర్గానికి పోతాను' అని ప్రాధేయపడి అడిగింది. సరే ఇచ్చానన్నాను నేను. వెంటనే ఆ పురుగు దివ్యకాంతగా మారిపోయింది. దివ్యాంబరాభరణాలతో దివ్యకాంతులు విరజిమ్ముతూండగా దివ్యవిమానం వచ్చింది. ఆ విమానం ఎక్కుతూ ఆమె చిరునవ్వుతో నన్ను చూసి 'చిర సుమంగళీ భవ!' అని వెళ్ళిపోయింది.

'విన్నావా! మోహినీ!' అని సంధ్యావళి ఇంకా ఇలా అన్నది;

'పతియే ఇల్లాలికి పరమదైవం. పతిని ధిక్కరించే ఇల్లాలు పలుకరాని పాపం పాలవుతుంది. నా మాట మన్నించు. వాదులాడకు; ఆయన వ్రతం చేయనీ! అడ్డుపడకు.అతని మనస్సు సంతోషించేట్టు ప్రవర్తించు. పనికిరాని పట్టుదల విడిచిపెట్టు'- అని అనగా విని మోహిని కోపంతో చురచుర చూసి ఇలా గన్నది.

**పిలవని పేరంటం:**

భావా! పాపం పున్నెం బాగా తెలిసిన పండితురాలివలే ఉన్నావు. మెచ్చవచ్చు. నిన్ను పాపపుణ్యాలు ఇక్కడ అడిగిన వారెవరు? తగుదునమ్మా!

అని పిలవని పేరంటం అన్నట్టు వచ్చి సిగ్గులేక మామధ్య నిల్చుని మగనిముందు కథలు చెప్తున్నావే. పనికిమాలిన ప్రేలాపన కట్టిపెట్టు. నీ మాటకారితనం నీలోనే వుంచుకో! ఇక్కణ్ణుంచి దయచేయి. ఆతనితో నేనేదో చెప్తున్నాను. ఇక్కడ నీ మాటలు వినిపించవు. పనికిరావు. కంచుమద్దెళ్ల మ్రోతముందు ఢక్కచప్పుడు వినిపిస్తుందా? అగ్రహారంలో దమ్మళిజోస్యం అన్నట్టు నా ముందు నీ టక్కులు సాగవు. తెలిసిందా? నీ అరుపులకు భయపడతాననుకోకు. ఎద్దు బెదిరితే బెదరవచ్చుగానీ గానుగ బెదురుతుందా ఎక్కడేనా? నీ అడ్డకర్ర మాటలు ఇంతతో చాలించు. తెలివి గలవాళ్ల నడవడి ఇదికాదు. నీకు తెలియదు కనుక చెప్తున్నాను విను.

నీ మాటకి అడుగైనా దాటనని ఈయన శంకరుని ముందు ప్రమాణం చేశాడు. ఆ శపథం దాటవచ్చునా? సత్యం అంటే అంత సన్నగిల్లి పోతుందా? అని రాజువేపు తిరిగి ఇలా అన్నది మోహిని:

**మాటకి ప్రాణం:**

రాజా! ఎందుకీ మాటకి మాట. తెలియనివాడవా? మాటకి మాట తెగులు, నీటికి నాచు తెగులు అనేది. ఆనాడు నువ్వన్నమాట ఏమైనట్టు? ఇక్కడ నీ అంద్రందరూ నాపై గాంద్రిస్తూ ఉంటే చూస్తూ ఊరకుంటావేమి? చీకూచింతా లేక స్వేచ్ఛగా అక్కడ కాలం గడుపుతూన్న నేను నీమీది ప్రేమతో నీ మాట నమ్మి వచ్చి యిలా గతిమాలిన దాననయ్యాను. బుద్ధి కర్మానుసారిణి అనే పెద్దలమాట నాయందు ఋజువైంది.

అసత్యం పాపమూలం. దానివల్ల ఉన్న పుణ్యం హుష్కాకీ ఊడిపోతుంది. కీర్తి నశిస్తుంది. అనరాని వినరాని రోగాలు అసత్యంవల్ల వస్తాయి. సిరీ సంపదా హరించుకు పోతాయి. ఆయువు కూడా తరిగి పోతుంది. ఇది నీకు తెలియదా? ఆడినమాట తప్పవచ్చునా రాజా!

కడజాతివాడితో అసత్యమాడితే యమునింట పదేళ్లు శిక్షపడుతుంది. శూద్రునితో మిథ్య పలికితే నలభై ఏళ్లు జమునింట కఠినశిక్ష అనుభవిస్తారు. వైశ్యునితో అబద్ధమాడితే యమునివీట నూరేళ్లు శిక్ష. క్షత్రియునితో కల్లలాడితే యముని పట్టణంలో వెయ్యేళ్లుండాలి. బ్రాహ్మణునితో అసత్యమాడితే సంయమనీ నగరంలో లక్షసంవత్సరాలు నరకయాతన అనుభవించవలసి వస్తుంది. తనను నమ్మి ఉన్న ఇల్లాలితో కల్లలాడితే లెక్కలేనన్ని సంవత్సరాలు రౌరవాది నరకయాతన. ఇది నే నన్నది కాదు. తెలిసిన పెద్దలు చెప్పినది నీవు వినలేదా?

చిరకాలం తీర్థాలను సేవించినందువల్లను, తులాపురుషదానం వల్లను, కలకాలం తపశ్చర్యవల్లను, నూరుయజ్ఞాలు చేసినందువల్లను వచ్చే పుణ్యం ఒక సత్యవాక్కుకి సరికావు. దేవపూజలూ, భూదేవ పాదపూజలూ ఎన్నో నియమాలతో చేసినందువల్ల వచ్చే పుణ్యం ఒక్కవాక్కుకి సాటికావు. మానవుడు సత్యం మరచి మనరాదు. అసత్యం వినరాదు.

సత్యమును పోలిన ధర్మం, శాంతమును పోలిన తపస్సు, సజ్జనమైత్రివంటి లాభం, వినయంవంటి గుణం, సత్సంతానంవంటి సంతోషం, దయవంటి పుణ్యతీర్థం, బుద్ధిమంతులు స్తుతించే భాగ్యం ఎక్కడా ఉండవు.

సమస్త రాజ్యసౌఖ్యం విడిచి, ఇల్లాలినీ పిల్లవాణ్ణి అమ్మి, కడజాతి వానికి కింకరుడై కాటికాపరియైన హరిశ్చంద్రుడు సత్యవ్రతాన్ని ఎంతగా పాలించాడో వినలేదా? సత్యపాలనకై అతడు పడినపాట్లు దివ్యశక్తులు కలవేలుపులకు కూడా ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఆ విధంగా పుణ్యాత్ములు, సత్యహరిశ్చంద్రుడని అన్ని లోకాలవారిచే మెప్పు పొందుతున్నాడు ఈ నాటికిన్ని.

ప్రాణికి ప్రాణం శ్రుతి. కోటకి ప్రాణం భయమెరుగని సేన. ఆటకి ప్రాణం తాళం. మాటకి ప్రాణం సత్యం.

శమము (ఇంద్రియ నిగ్రహశక్తి) లేని తపస్సు, గుణవతియైన సతిలేని సుఖం, ప్రభువుక్షేమం కోరని భటునిసేవ, పాత్రమెరుగని దానం, పగను అణచగలేని బలం, సత్యంలేని మాట నిష్ఫలం.

కులసతికి వన్నె మానం; కలిమికి వన్నె దానం; భటునకు వన్నె ధైర్యం, మాటకి వన్నె సత్యం.

అసత్య మాడడంకన్నా పాపంలేదనే మాట అర్థం చేసుకుని రాజా నీవన్న మాట నిలుపుకో!

మనపెండ్లికి ముందు పరమేశ్వరుని పాదసాక్షిగా నీ వన్నమాట నిలుపుకో! నేను, నా భార్యలూ నీ మాట ఆనందంగా చెల్లిస్తామని నీవన్నమాట ప్రకారం నడవకున్నావు. నిన్ను విడిచి నిముషమైనా ఉండలేని నన్ను గౌరవించవేమి? రాజా! నన్ను తీసుకువచ్చే ముందు నీకున్న నియమాలూ వ్రతాలూ చెప్పితే నిన్ను తేరిచూస్తానా? ఇప్పుడీ రగడ జరుగుతుందా? ఆలోచించు, లే. ఆలోచించు, నన్ను చులకన చేయకు.

నన్ను బ్రహ్మ ఏ సంకల్పంతో పుట్టించాడో గానీ వ్రతం పేరు చెబితే వెంటనే తల మండుతూన్నట్లు ఏదో బాధ కలుగుతుంది నాకు. హాయిగా ఆ పాన్పుమీద పడుకోక వ్రతంపేరుతో ఇలా అనవచ్చునా? అందనున్న ఆత్మానందాన్ని అర్పవచ్చునా? ఏనుగునెక్కి దిడ్డిదూరడం అంటే ఇదే.

మాట విను. రాజ్యాంతమందు నరకం తప్పదని పెద్దలంటారు ఇక్కడితో నీ రాచరికానికి స్వస్తి చెప్పి నీ కొడుకుకి అప్పగించు. నాతో హాయిగా స్వర్గసుఖం అనుభవించు.

ఈ ప్రాయం, అందం, చందం, శరీరబలం హరించుకుపోయాక నువ్వు నన్ను తలచుకుంటావా? కల్ల! చనిపోయాక గగుర్పాటు పుట్టుతుందా? లే! మన్మథరాజ్యానికి పట్టం కట్టు. కాదంటావా? నన్ను బహిష్కరించు. అంతేకాని మిట్టకీ పెట్టుకీకాని పిట్టని చెయ్యకు.

## నిర్ణయం:

అని విసువుతో రోసరోసలాడుతూ పలికిన మోహినిని అలా ఒకమారు తేరిచూసి అన్నాడు రాజు;

భామినీ! నన్నెందుకు నిందిస్తావు. నేను కల్లలాడానా? నా కొడుకుగానీ, నా భార్యలు గాని నీకు చేసిన కీడేమి?

వేయారులకైనా బొంకను. లక్షకైనా అన్యాయం చెయ్యను. 'విడువుము' అని అనరాని వ్రతం ఇది. దీనిని నేను ఎలా విడిచేది? ఎందుకు నీకీ పంతం?

రాజసూయం మొదలైన యజ్ఞాలకు సంబంధించిన దీక్షలలోనైనా ఏకాదశి మానరాదు. జీవితానికి మెరుగులుదిద్దే కల్యాణ సమయమందైనా ఏకాదశి వదలరాదు. పితృదేవతల పూజాకాలమందైనా ఏకాదశి విడువరాదు. జాతాశౌచ మృతాశౌచములందైనను ఏకాదశి పరిత్యజించరాదు.

బాలురు, వృద్ధులు, గర్భవతులు, రోగులు, చికిత్సలో ఉన్న వారున్నూ తాము పట్టిన ఏకాదశీవ్రతాన్ని విడువకూడదు. ఇక నా నిర్ణయం విను మోహినీ! నా ఏలుబడిలో ఉన్న నేలనంతా వదులుకొంటాను. భోగభాగ్యాలన్నీ విడుస్తాను. నన్ను కట్టుకున్న, నన్ను నమ్ము కున్న యీ ఇల్లాండ్రనందరినీ పరిత్యజిస్తాను. చివరిమాట చెప్తున్నాను.

నిశితఖడ్గధారతో నా కొడుకు శిరస్సు తెగనరకమన్నా నరుకుతాను గానీ నువ్వు వదలమన్న ఏకాదశి పాలనను దేవతలందరూ వచ్చి అర్థగించనీ – వదలను అని ఆవేశంగా రుక్మాంగదుడు అనినమాట విని మోహిని తన వచ్చినపని నెరవేరలేదని మనసులో కలతపడి మొండికెత్తి క్రూరధోరణితో అన్నది;

రాజా! ఆ నిర్ణయానికే కట్టుపడి అనిన మాటప్రకారం నడవవలసిందిగా కోరుతున్నాను.

నీ కొడుకు తల తెగనరకడమే కర్తవ్యం. కన్నతండ్రివై కొమరునిపై కనికరంలేక తల తెగవేస్తానంటున్నావు. నీ మాటకి కన్నతల్లి ఈ రాణికూడా కిమ్మనక ఊరకున్నది. మీ ఇద్దరికీలేని దయ నాకెలా ఉంటుంది? అయినా మరోమారు హెచ్చరికగా అంటున్నాను ఆలోచించు. కోరికననుసరించి ఏకాదశీవ్రతం వదలి నాతో ఉంటావా! నీ నిర్ణయానుసారం నీ కొడుకు తల తెగనరకుతావా?

ఏమంటాడు రుక్మాంగుదుడు? పేరుకి మోహిని, ఆకారానికి ఆడుది. కాని ఆ నోటిమాట రాజు గుండెల్లో వజ్రంతో పొడిచినట్టు తగిలింది. మారు మాటాడలేక ఊరకున్నాడు. ఆ క్లిష్టపరిస్థితిలో సంధ్యావళి మరీ దగ్గరగా వచ్చి అన్నది!

## నీ తరమా:

మోహినీ! నీ ధోరణి ఎంత వింతగా ఉంది! ఇన్నాళ్లూ మాతో ఉన్నదానవు. దేనికీ మా పరిచయం నీలో మార్పు కలిగించ లేదు. ఏకాదశీవ్రతం మానకపోతే కొడుకుని చంపమంటున్న నీ పద్ధతి గుడిలో ఉండి గుడితాళ్లు కొయ్యడం కాదా?

మాకూ మా పతికి దురంతమైన సంతాపం కలిగేటట్లు కొడుకుని చంపవలసిందని పిడుగుపాటుకన్నా భయంకరమైన మాట నీ నాలుక మీంచి ఎలా వచ్చింది? అవునులే. గొడ్రాలికి బిడ్డకుట్లు ఎలా తెలుస్తాయి?

మనసారా వరించి ప్రేమించి వెంటవచ్చానని ఈ పుణ్యపురుషునితో అంటున్నావు. నీ ప్రేమ తామరాకుమీది నీటిచుక్కలా ఉందని స్పష్ట మౌతుంది.

రమణుని ప్రేమ నిండుగా ఉందని క్రమవిరుద్ధంగా మాటలాడడం చెరుకు తియ్యగా ఉందని వ్రేళ్ళతో నమలడమే కాదా?

నువ్వు ఎరుగవు గాని వ్రతపాలనలో ఈయన ఎంత దృఢంగానో ఉంటాడు. వ్రతం మానిపించడం నీ తరమా? ఏనుగుకి దంతం వచ్చిన తర్వాత మళ్ళీ దానిని లోపలికి ఎంతవాడైనా నెట్టగలడా?

అని పతిని చూచి అన్నది ఈ సతీరత్నం ఇలాగా-

ప్రభూ! పామరుడులాగా అలా విచారిస్తూ కూర్చున్నావెందుకు? నాకు తోచినమాట చెప్తున్నాను. నీ మనశ్శుద్ధిని పరీక్షించడానికి హరిహర బ్రహ్మలు ఈమెను సృష్టించి పంపి ఉంటారు. అలా కాకపోతే నిన్ను పతిగా మనసా వరించివచ్చిన సామాన్యకాంత అయితే నీ వ్రతం విడువవలసిందని ఇంత పంతం పట్టుతుందా?

ఇక నీ త్యాగశీలం గురించి నేను చెప్పనక్కరలేదు.

'పాత్రం త్యాగాయ' తగినచోట త్యాగం తరగని పుణ్యఫలం ఇస్తుందని అద్భుతమాట। పుత్రకళత్రాదులను, తన శరీరాన్ని కూడా తగిన చోట త్యాగత

చెయ్యడం ధర్మబుద్ధి గలవారికి అవశ్యకర్తవ్యం. కాబట్టి ఈ పనికి సిద్ధపడవలసినదే. ఆచంద్రార్కంగా యశస్సును స్థాపించవలసిందే అని నా మనవి. ధనం కానీ.... తనువు కానీ.................శాశ్వతమా?

అని సంధ్యావళి హెచ్చరిస్తూ ప్రోత్సహిస్తూ పలుకుతూన్న సమయంలో విషయం తెలిసి కొడుకు ధర్మాంగదుడు వడిగా అక్కడికి వచ్చి తల్లికీ తండ్రికీ మ్రొక్కి తండ్రి కెదురుగా చేతులు జోడించి యిలాగన్నాడు.

## ధర్మ మొక్కటే:

పితృదేవా! ఏకాదశీవ్రతం నెపముతో ఒక స్త్రీ నీ కొడుకు ప్రాణం కోరినపుడు వెనుకాడడ మెందుకు? ప్రాణత్యాగానికి నేను త్రికరణశుద్ధిగా అంగీకరిస్తున్నాను. నా కింతకన్నా మిన్నగా పున్నెం వస్తుందా?

ఈ యమ్మ మనసు కోరిక నెరవేర్చి వ్రతం సాగించుకుని చరితార్థుడవు కావలసిందే గాని ఇలా విచారించడము నీ వంటి పురుషోత్తమునకు తగునా?

శరీరం అశాశ్వతమని పెద్దలనిన మాట అబద్ధమా? ఆలోచించి చూస్తే అన్నిటికన్న నిస్సారం ఈ శరీరం. దీనికోసం విచారమెందుకు? పలువిధాలైన జ్వరాలు, ఔషధాలకు అసాధ్యములైన కుష్ఠు, పాండువు, ఉబ్బసము మొదలైన దుష్టరోగాలు, కఫ వాత పిత్తవ్యాధులు ఈ శరీరాన్ని కలచి ఎండబెట్టి పొట్టని పెట్టుకోడానికి కాచుకుని ఉంటాయి. అలాటి రోగాలకు బలి ఇచ్చేకన్నా. ఇహపరసాధనమైన వ్రతానికి నివేదించడం ఉత్తమోత్తమమైన సత్క్రియ కదా!

చర్మం కోసి సహజ కవచకుండలాలు బ్రాహ్మణుని కిచ్చిన కర్ణుడు ఆచంద్రార్కమైన కీర్తి సంపాదించాడు. మేనికండలు తెగకోసి డేగకిచ్చిన శిబి పరమపదం పొందాడు. వెన్నెముక వేల్పులకిచ్చి దధీచి వెలకట్టరాని పున్నెం మూట కట్టుకున్నాడు. తన తనువును త్యాగం చేసిన జీమూతవాహనుడు శాశ్వత పుణ్యలోకం పొందాడు. వీరేకాక ఎందరో మహానుభావులు ధన తను త్యాగంచేసి మానవులకు మార్గదర్శకులైనవారు పురాణాలలో వినవస్తూ ఉంటారు. వారి వృత్తాంతాలు తెలిసి తెలిసి అస్థిరమైన ఈ శరీరంకోసం ఆరాటమెందుకు? శాశ్వతమైన ధర్మంకోసం చర్చ ఏల?

నేను ఒక్కడనే పుత్రుడను. నన్ను పోగొట్టుకుంటే అపుత్రత్వం; ఉత్తమగతి కలుగదు – అని విచారించడం ఎందుకు? నూర్గురు భార్యలున్నారు. ఏ సాధ్వికైనా కొడుకు కలుగకపోదు. కాబట్టి ఏకపుత్ర విషయం గురించి విచారించవద్దు. నన్ను కూడా ఏదో అనరాని వినరాని మార్గాన వదలుకోవడం కాదే. ఏ దేవుణ్ణి నమ్మి

విడువని నియమనిష్ఠలతో ఇంతకాలమూ గడపినాడవో ఆ శ్రీహరి వ్రతానికై నన్ను నివేదిస్తున్నావు. ఇంతకన్నా నీకూ నాకూ తగిన అవకాశం ఎప్పుడు వస్తుంది?

ఈ తనువు, ఈ ధనం, కోటా, పేటా, విభవం, స్త్రీలు,కొడుకులూ తోబుట్టువులూ, బంధుమిత్రులూ స్థిరమా? కాలానుసారంగా ఇక్కడినుండి తరలిపోయే దినుసులే – ఒకరికోసం ఒకరు వెంటవస్తారా? వారి వారి కర్మననుసరించి వారికి విధి నియమించిన త్రోవను పోయేవారే. ఈ సంబంధం వ్యక్తి కల్పించుకున్నదే కానీ ఎవరి కెవరు నాయనా? అన్నీ తెలిసిన వాడవు; నీకు చెప్పేపాటివాడనా?

ధర్మగతి అతివేగం గలది. దాని ననుసరించి ప్రవర్తించాలి. ఆలసించక పుణ్యకార్యాలు చేయడమే బుద్ధిమంతుల లక్షణం. కొడుకును చేచేతులా చంపుకోడమా? అనే సందేహం విడిచిపెట్టు. నీ పట్టిన వ్రతం సాగించు. వైకుంఠపురవాసం సాధించు. ఇంద్రాదులు కూడా నిన్ను శ్లాఘిస్తారు.

అని తండ్రిని ప్రబోధించి ధర్మాంగదుడు వెళ్లి స్నానంచేసి నూతన వస్త్రాలూ, వస్తువులూ ధరించి వచ్చి తండ్రిముందు పద్మాసనస్థుడై కన్నులుమూసి చేతులు జోడించి పద్మనాభుని పాదపద్మాలను హృదయ పద్మ పీఠమున భక్తిభావంతో ప్రతిష్ఠించి జ్ఞాననిమగ్నుడైనాడు.

## తెంపరి మాటలు:

అంతలో ఆకసమంతా దివ్యప్రభాభాసమాన మయింది. శ్రీహరి లక్ష్మీదేవితో వచ్చి పైన గరుడుని రెక్కలపైనుండి చిరునవ్వు మోముతో దేవిని చూశాడు. ఆ క్షణంలోనే ఇంద్రాదిదేవసంఘం అటూ ఇటూ ఆశ్చర్యంగా నిలిచి చూస్తుండగా లక్ష్మీదేవి శ్రీపతి మోముచూసి స్వామీ! ఏమిటిలా వేడుకగా చూస్తున్నావు? ఆ రాజు ఇంతకాలం తదేకదీక్షతో సేవిస్తున్నందుకు నీ విచ్చే ఫలం కన్నకొడుకుని చంపడానికి సిద్ధమైన భక్తుణ్ణి ఆనందంగా చూడడమా? అనుగ్రహించి ఆపదనుంచి ఆ రాజవంశాన్ని రక్షించు ప్రభూ! ఇంకా ఏమిటా పరీక్ష! ఇది చాలదా? అని ఆత్రంగా అన్నది. తొందరపడకు. ఏమీ వికటంగా జరుగదు చూస్తూ ఉండు – అని అన్నాడు శ్రీహరి.

రుక్మాంగదుడు దిగ్గున లేచి ఖడ్గం అందుకున్నాడు కొడుకును చంపడానికి. తెగించిన రాజును, అంగీకరించిన రాణిని, చావడానికి సిద్ధపడి కూర్చున్న ధర్మాంగదుణ్ణి చూసి మోహిని తెల్లబోయింది. ఆమె మనస్సు పెనుగాలికి ఊగినట్టయింది. ఏదో భయం.......విచారం........ఆశ్చర్యం.... ముందుకు వచ్చి కత్తితో సహా రాజుచేయి పట్టుకుని ఆగు రాజా! అని అరిచింది.

ఏమిటీ తెంపరితనం! అరదమ్మిడీ విలువచెయ్యని ఏకాదశిపేరుతో ఏదో సాధించాలనుకుని కన్నకొడుకును కత్తికి ఎరవెయ్యడానికి సిద్ధపడుతున్నావా! మేకుకోసం మేడ కాల్చుకోవడమంటే ఇదే కదా! హరివాసర వ్రతంవల్ల ఎప్పుడో ఏదో ఫలితం వస్తుందంటే దాని నెవడు ఎరుగునుగానీ కొడుకును చంపుకుంటే ముందు దుఃఖం, లోకంలో అపకీర్తి, ఆ పైన పాపం. ఇవి తప్పవు. వ్రతంవల్ల మోక్షం వస్తుందని కన్నకొడుకుని చంపుకోడం మింటకమ్మిన మేఘాన్ని చూసి చెరువుకు గండికొట్టడం అవుతుంది. 'అపుత్రస్య గతి ర్నాస్తి' పుత్రుడు లేనివానికి ఏ విధంగానూ గతి లేదనే శ్రుతివాక్కు నీ వెరుగవా?

పుత్రసంతతిని కోరి సగరుడు శంకరుణ్ణి గూర్చి ఎంతటి కఠోర నియమాలతో తపస్సు చేశాడో! సగర చరిత్ర చదువలేదా? కొడుకు కలగాలని దిలీపుడు నందినిని సేవిస్తూ చేసిన వనవాస జీవితం నీ గురువులు చెప్పలేదా? దశరథుడు పుత్రకామేష్టి చేసినది ఎందుకు? పాండుమహారాజు కొడుకులకోసమే కదా దేవతలను ఆరాధించాడు. మందపాలుడు, జరత్కారుడు మొదలైన మహారాజులు కొడుకులు లేకపోవడంవల్ల పుణ్యగతి పొందడానికి ఏలాటి ఘోరతపస్సులో చేయవలసి వచ్చిందని పెద్దలు చెప్పిన కథలు వినలేదా?

కామాంధుడవు. నువ్వు ఆడవాళ్ళముందు అర్భాటాలు పలుకుతున్నావు, మెచ్చవచ్చు.

స్త్రీ లోలుడు హితవు వినడు సరేకదా, చెప్పినవారిమీద కోపిస్తాడు. అలాంటివాణ్ణి బంధువులు విడనాడుతారు. ధర్మం తప్పిపోతుంది. ధైర్యం నశిస్తుంది. ధనం తరిగిపోతుంది. కర్తవ్యం తెలియదు, చేసినది మరచి పోతాడు. అపకీర్తికి భయపడడు. రాబోయే అనర్థాలు గ్రహించడు. లజ్జాభిమానాలు విడిచి పెడతాడు. అసత్యానికి వెనుదీయడు. పాపానికి భయపడడు. కులశీలవినాశం గుర్తించడు. సత్యానికి స్వస్తి చెప్తాడు. దొరతనము, నీతి, నియమము విడిచి పెట్టుతాడు....

నువ్వు ఒకతె కాదు, ఇద్దరు కాదు, నూర్గురు కాంతలుకల కామలోలుడవు. ఎంత ఆలోచించినా నీలో సద్భావానికి అవకాశం ఎక్కడిది? అని రాజును తూలనాడి ధర్మాంగదుని ఉద్దేశించి అంటూంది!

కుమారా! ధర్మాంగదా! తెంపరిమాటలు నీ తండ్రికి సరిపోయాయి గాని నువ్వెందుకు మరణించడానికి తల ఒగ్గుతున్నావు? చచ్చాక అనుభవించే దేముందోయీ? చచ్చేటంత కలవస్తే మేలుకోవాలి కాని నిద్ర పోకూడదంటారు.

పడుచుబుద్ధులు విడిచిపెట్టు. అందచందాలకు పెట్టినపేరుగా ఉన్న యువకుడవు. ధర్మసాధనకు శరీరమే ప్రధాన సాధన మని పెద్దలన్న మాట వినలేదా?

పనికిమాలిన వ్రతాలతో ప్రాణం వదలడం అవివేకం. ఉన్న విభవాన్నీ. రాచరికాన్నీ, సుష్ఠుగా అనుభవించాలి కానీ ఈ వెఱ్ఱితనం ఏమిటి? బ్రతికుంటే బలుసాకైనా తిని కాలం గడపవచ్చు. నీ తండ్రి కోపానికి లొంగి క్రూరంగా ప్రవర్తిస్తున్నాడు. నీ కెందుకీ నీచవృత్తి? చేచేతులా కన్న కొడుకుని ఖండించడానికి తాను సిద్ధపడవచ్చు గాని ప్రాణత్యాగం కోసం నువ్వు బ్రతుకు పాడుచేసుకోవడం భావ్యం కాదు.

అని బోధించి మోహిని అటునుంచి ఇటు తిరిగి రాజును చూచి అన్నది.

రాజా! విను. కలిగినవాడు నీకు ఈ ఒక్కడే కొడుకు. సామాన్యుడు కాడు. సౌమ్యుడు, నిర్మలచిత్తుడు, సద్గుణుడు, ధర్మపరుడు, భక్తుడు, వంశపావనుడు, రాబోయేకాలంలో మీకు ఇతడే అన్నిటికీ దిక్కు. అలాటి ఏకైకపుత్రుణ్ణి చంపడానికి కత్తి ఎత్తడం బుద్ధిమంతుడి లక్షణం కాదు. ఎందుకీ వ్రతం? కులవినాశకరం. ఎందుకీ పట్టుదల? తలమునిగే చెట్టపని. తొందర పడకు. ఆలోచించు. నీ వంశ క్షేమం కోరి నేను చెప్పేది విను. వినక చంపడానికి ప్రయత్నించడం వెఱ్ఱితీరింది రోకలి తలకు చుట్టమన్నట్లే అవుతుంది.

మోహిని మాటను విన్నాడు రుక్మాంగదుడు. రెండేమాట లన్నాడు.

మోహినీ! నీ హితబోధ ఇక చాలించు. నా నిర్ణయం విను. బ్రహ్మాది దేవతలు వచ్చి వలదన్నా వెనుకంజ వేసేది లేదు.

అని మోహినిని త్రోసివేసి కత్తి ఎత్తి కొడుకుతల పట్టుగా చూసి వేశాడు. చిత్రం. ఆ కత్తి దివ్యపుష్పమాలికయ్యై ధర్మాంగదుని కంఠభూషణమ్మై పోయింది. ఎట్టఎదుట శ్రీమన్నారాయణుడు లక్ష్మీదేవితో ప్రత్యక్షమయ్యాడు.

**శ్రీహరి:**

ఇరుప్రక్కల సనకాది మునులు భక్తితో స్తుతిస్తున్నారు. తుంబురు నారదులు వీణలపై విష్ణుకీర్తనల్ని పలికిస్తున్నారు. బ్రహ్మ, శివుడు అనుచరులై వెంట ఉన్నారు. రంభాది దేవవేశ్యలు నాట్యాభినయాలు చేస్తున్నారు. వ్యాసాది భాగవతులు శ్రీహరి మాహాత్మ్యం వినిపిస్తున్నారు. సిద్ధ గంధర్వాదులు చేతులు జోడించి ప్రక్కల నిల్చున్నారు.

క్రతువులు, ఋతువులు, కాలములు, వేదములు, నదులు, నిధులు, వనధులు, యతులు, వాక్పతులు, బ్రహ్మాండములు, కుండములు, రుద్రులు, అద్రులు, చతుశ్రుతులు, గతులు, దైత్యులు, భృత్యులు, ధర్మములు, కర్మములు, దినములు, ఘనములు, దిశలు, నిశలు, పక్షములు, ఋక్షములు, పవనములు, సవనములు, మందులు, మంత్రాలు, తంత్రాలు, మణులు, ఘృణులు, ఆగములు, వల్లులు, నగములు, కుంజాలు, చౌషష్టి కళలు, వేదాధ్యయన రతులు, యతులు, వ్రతులు, శక్తులు, ఇతిహాస సూక్తులు, రవులు, భైరవులు నిజమూర్తులు ధరించి శ్రీహరి ముందు నిల్చున్నారు.

ఇంద్రుడు, అగ్ని, యముడు, నిర్ఋతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశానుడు శ్రీహరి పాదసేవకులై ఉన్నారు. గిరిజ, భారతి, శచి వింజామరలు వీస్తున్నారు. మదనుడు, స్కందుడు, వినాయకుడు నుతులు చేస్తున్నారు.

ఈలాగు మహోన్నత దివ్యవైభవంతో సర్వేశ్వరుడు ఇందిరారమణుడు శ్రీహరి ప్రత్యక్షంకాగా అందరూ సంభ్రమాశ్చర్యాలతో లేచి వరుసగా నిల్చుని శిరసులు వంచి, చేతులు జోడించి భక్తితో మ్రొక్కి స్తుతించారు. వారిలో ముందున్న రుక్మాంగదుడు సాష్టాంగ ప్రణామం చేసి లేచి ఇలా స్తుతించాడు.

**నుతి:**

కౌస్తుభవక్షా! సురమునిపక్షా! ఖలశిక్షా! సజ్జనరక్షా! శరణు శరణు.

సన్ముని నికాయశరణ్యా, సకల దేవవరేణ్యా! వందనం, బలదర్ప మహిమ విరాజితా! యోగపూజితా! భక్త పారిజాతా! నమోవాకం.

శ్రుతులు హరించి సముద్రంలో దాగియున్న నీచ రాక్షసుణ్ణి మీనరూపాన సంహరించి వేదాలు వాణీపతి కిచ్చిన నీ శౌర్యాన్ని ఏమని పొగడగలము? భక్తపోషణా! సురభూషణా! సురాసురు లమృతమునకై మందరగిరి కవ్వముగా, వాసుకి తరిత్రాడుగా చేసి పాలకడలి మథించగా మునిగిన పర్వతాన్ని కూర్మరాజువై వీపున ధరించి అమృతం సురగణాని కిచ్చిన కారుణ్యమూర్తీ? నీ కరుణ నేమని వర్ణించగలము?

అక్షరమైన శౌర్యగర్వంతో భూమిని చాపగా చుట్టి ఏపు మిగిలి అతలానికిపోయే హిరణ్యాక్షుణ్ణి ఆదివరాహమూర్తివై హతమార్చి భూతలాన్ని ఒక కొమ్మున మీదికెత్తిన నీ మహిమ నెంతని చెప్పగలము?

ఇక్కడ ఉన్నాడు, అక్కడ లేడని సందేహించ నేల? అని నిన్ను వెదకి చూడవలసిందని చెప్పిన కొడుకును బాధించి క్రూరుణ్ణి హిరణ్యకశిపుణ్ణి

సభాస్తంభమునందు నరసింహరూపంతో ఉద్భవించి చీల్చిచెండాడిన నీ ఉగ్రరూప పరాక్రమాన్ని సక్రమంగా వివరించడం మా తరమా? మూడడుగులకై భూమిని ఒక పాదముతో, అధోలోకము నొక పాదముతో నాక్రమించి మూడవ పాదంతో బలి నణగద్రొక్కిన నీ వామనావతార నైపుణి నేమని వివరించగలము? మహోగ్రపరశుధారతో ఇరువదియొక్క మార్లు భూమిని పరిభ్రమించి రాజులను ఆ రోజులలో వధించి తద్రక్తంతో మడుగులు నిర్మించిన నీ శౌర్యసంపద్విభవాన్ని ఏమని పొగడగలం? ఎంతని పొగడగలం? దశరథుని పుణ్యఫలముగ, కౌసల్య నోముపంటగా సూర్యవంశము నందు జన్మించి తాటకను గీటడంచి, కౌశికుని జన్నమును గాచి, శివుని విల్లు విరిచి, జానకిని చేపట్టి, పరశురాముని భంగపరచి, తాపసవేషం ధరించి కానకేగి పితృవాక్పరిపాలకుడుగా పేరుగాంచిన వాడవు. ఇలా ఎంతని చెప్పగలము?

ఖరదూషణాదులను గడియలో ఖండించి, మాయలేడిని మంటలో గలిపి, వాలిని ఒక్కకోలతో నేలగూల్చి, సుగ్రీవు నేలి, దుస్తరమైన సముద్రాన్ని దాటి, శరణన్న పగవాని తమ్ముని తమ్మునిగా చేసుకున్న ధన్యచరిత్రుడవు. కన్నెత్తి చూడరాని రావణ కుంభకర్ణుల హతమార్చి, విభీషణుని లంకాధిపతిం జేసి, జానకీ సమేతుడవై అయోధ్యకువచ్చి పట్టాభిషిక్తుడవై లోకాభిరామముగా రాజ్యమేలిన ఆ రామ చంద్రుడవు నీవేకదా!

కంసాది ఖలులను కసిమసగిన గరిమ, విశ్వజనినమై గీతాతత్త్వ శాస్త్రం పార్థునికి ఉపదేశించి జీవలోకానికి ఆత్మదృష్టిని కలిగించిన పెరిమగల కృష్ణమూర్తీ! ప్రణతిశతం!

అహింసాధర్మబోధతో సత్యజ్ఞానభిక్ష పెట్టిన బుద్ధమూర్తివి నీవే అని మ్రొక్కుతున్నాము. అనుగ్రహించు దేవా!

ఉత్తామాశ్వం నధిష్ఠించి నిశిత కరవాల సహాయుడవై ఖలజన సంహారం చేసే కలికిదేవుడవు నీవే అని స్తుతించే మాకు సద్గతి ప్రసాదించు సర్వేశ్వరా!

'రుక్మిణీశా! వేదాంతవేదీ! నమో నమః' అనే దివ్యమంత్రం తప్ప భక్తుల నుద్ధరించే దింకేముంది ప్రభూ!

సూర్యచంద్రులు, గ్రహనక్షత్రతారకలు, దివారాత్రులు, దిశలు, నదులు, భూమ్యాకాశాలు, నగాలు, సముద్రాలు, అగ్నులు, ఇంద్రాదులు, అనంతుడు, అంబుజగర్భుడు, ఈశ్వరుడు, దిక్పాలురు, యజ్ఞం, యజమాని, యజ్ఞఫలం నీవే కదా గదాధరా!....

అని మ్రొక్కి రుక్మాంగదుడు శిరసు వంచి నిల్చున్నాడు. ఆ స్తుతి విని శ్రీహరి మెచ్చి మనసునందు కలిగిన కనికరం మాటలలో తేనెలు కురియగ ఇలా గన్నాడు.

**కోరుకో:**

రుక్మాంగదా! నీ వీరవ్రతానికీ, నీ మనశ్శుద్ధికీ, నీ మహౌదార్యానికీ మెచ్చాను. నీ ఇచ్ఛవచ్చిన వరం కోరుకో ఇస్తున్నాను. ఒక్కమాట.

ఈ మోహిని నీకు అనుకూలగాని ప్రతికూల కాదు. నీపై గల పేర్మినీ కూర్మినీ విడిచి దుష్కర్మకు పూనిందని అనుకోకు. నీ భావశుద్ధి తెలుసుకోవాలనీ, నీ త్యాగం నీ భక్తియోగం లోకానికి తెలివిడి కావాలనీ సంకల్పించి బ్రహ్మ ఈ సుందరిని సృష్టించి నిన్ను పరీక్షించడానికి పంపాడు.

ద్వాదశిపారణ చేసి ఆ పగటిపూట నిద్రించరాదు. అలా నిద్రించే వారి పుణ్యం ఈమెకి చెందుతుంది.

ఈమె బ్రహ్మ మానసపుత్రి. శోభనదేవత.

నీకు, నీ భార్యలకు, నీ పుత్రునకున్నూ మోక్షం ఇస్తున్నాను. నీ కొడుకు నీలాగే సద్భక్తిచిత్తుడై సద్ధర్మనిష్ఠుడై భూమిని పాలించి తను త్యాగం వేసిన తరువాత నా సన్నిధికి వస్తాడు.

నీ కొడుకుకి విధివిధానంగా ఇప్పుడు నేనే పట్టాభిషేకం చేయిస్తాను నీ భార్యలతో నీవు నాతో వైకుంఠానికి వత్తువు గాని.

అని శ్రీమన్నారాయణుడు దేవతలను, గరుత్మంతుణ్ణి చూసి ధర్మాంగదుని పట్టాభిషేకానికి కావలసిన ఉపకరణాలు సమకూర్చండి అని ఆజ్ఞాపించాడు.

**పట్టాభిషేకం:**

వెంటనే వారు గంగాది పుణ్యనదీజలాలు, సముద్రోదకం బంగరు బిందెలతో తీసుకువచ్చారు. సకల ధాన్యాలు, వజ్రవైఢూర్య ప్రవాళ రత్నాలు, పారిజాత కదంబ పద్మప్రసూనాలూ, పనస రంభా చూత ఫలాలు పట్టమాంజిష్ఠ నేత్ర శోభనపటాలు, చందన కస్తూరీ కర్పూరాలు, తాంబూల దళాలు, పోకలు, కుశతిలలు, వ్రీహిలాజలు తగిన పాత్రలయందు సమకూర్చి ఉంచారు.

కల్యాణవేదికపై ఉదుంబరోన్నత భద్రపీఠం నిలిపి దానిమీద సింహచర్మం వేశారు. తగిన వేదవేదాంగ వేత్తలైన విప్రులకు ఆహ్వానాలు పంపారు.

హోత భీమేశుడు, అచ్యుతశర్మ, ఎఱ్ఱావధాని, యజ్ఞేశుడు, అధానయాజి, చల్లవల్లభుడు, గోవిదుడు, భట్ట మేభళుడు, దర్భల ముకుందుడు ఈశ్వరభట్లు, బ్రహ్మేంద్ర వఝలు, క్రమదాడి మాధవభట్టు, జంధ్యాల పెద్ద, భాస్కరవఝలు, చక్రపాణి చతుర్వేది, కౌంతికృష్ణుడు, నారసింహ వాజపేయి, అదికేశుడు, వర్ది దామోదరుడు, పట్టవర్ధన ఎల్లన్న, పల్లమంచి మొదలైన బ్రాహ్మణులు తోరణం కట్టినట్టు సందడిగా వచ్చారు. శ్రీపతికి సాష్టాంగ నమస్కారం చేసి నిల్చున్నారు.

మంచిది. సక్రమంగా జరిపించండి పట్టాభిషేకం అని శ్రీహరి చిరునవ్వుతో సెలవిచ్చాడు.

ప్రభూ! దయచేసి దగ్గర ఉండవలసింది అని వా రనగా సరే పదండి అని ఇందిరారమణుడు వారితో పట్టాభిషేక మండపానికి వెళ్ళాడు.

మకరతోరణాలతో, కదళీస్తంభాలతో, బహుపతాకాలతో, ధవళ ఛత్రచామరాలతో, వివిధ సురభిళ కుసుమమాలికలతో నేత్రపర్వమై, గజతురగ రథ నానారాజకుమార సామంతసంకులమై, శంఖభేరీ మృదంగాది వాద్యాల ధ్వనులతో మారుమ్రోగుతూన్న రాజమార్గాన గజగమనుడై వెళ్ళి పట్టాభిషేక మండపాన్ని సమీపించాడు. ఆ మంటపం దివ్యవైభవం రూపొందినట్టు ఉంది.

కర్పూరనీరాజన సమన్వితములైన కనకపాత్రలు ధరించి కామినీ గణం ముందు నిల్చున్నారు. వారిని అలాగే మందహాసంతో ఆదరించి ధర్మాంగదుని చేయి పట్టుకుని మంటపంమీదికి తీసుకువెళ్ళి నడుమ ఉన్న సింహాసనంమీద కూర్చుండ బెట్టాడు.

బ్రహ్మాదులు పావన జలపూర్ణములైన సువర్ణకలశాలు అందుకుని ప్రక్కనే నిల్చున్నారు. లక్ష్మీ సరస్వతులు, శచి, అరుంధతి, అనసూయ మొదలైన పుణ్యాంగనలు గౌరీకల్యాణం పాడుతూ ముత్యాలసేసలు చల్లుతూండగా వేదవేదాంగవేత్తలైన విప్రులు చతుర్వేదాలతో ఆశీస్సులు పలుకుతూండగా ధర్మాంగదుణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేశాడు.

## సశరీర వైకుంఠం:

ఆ విధంగా పట్టాభిషేకం చేసి లక్ష్మీవిభుడు ధర్మాంగదా! నిత్యశ్రీ సమృద్ధితో, ధర్మబుద్ధితో, చిత్తశుద్ధితో, సకలభూతరంజకంగా చిరకాలం నేలనేలుదువు గాక! అని మంగళాశాసనం పలికి వెలుపలకు వచ్చి బ్రహ్మాదులను వారివారి విమానాలను అధిష్ఠించండని ఆజ్ఞ యిచ్చాడు. అందరూ విమానారూఢులై కదిలారు.

రుక్మాంగదుణ్ణి అతని భార్యలను దివ్యరథాసీనులను చేయించాడు. లక్ష్మీసమేతుడై తాను పక్షీంద్రరథ మధిష్ఠించాడు.దివ్యరథం కదిలేముందు సంధ్యావళీ రుక్మాంగదులు కొడుకును చూచి చేతులూపారు. జయధ్వనులు మిన్నుముట్టాయి. విమానాలు ముందు బారలు చాచుకుంటూ పందెం వేసినట్టు గాలిలో ఎగురుతూ వెళ్తున్నాయి. వాటివెనుక రుక్మాంగదుని దివ్యరథం దానివెనుక శ్రియఃపతి పక్షివాహనం, ఏ వాహనం అక్కరలేకుండా సనక సనందనాది సిద్ధయోగులు గాలిపటాల్లాగా గగనమండలాన హాయిగ ప్రయాణం సాగిస్తున్నారు. శ్రీమన్నారాయణుని ఆదేశానుసారంగా వాహనాలన్నీ వైకుంఠమార్గాన వెళ్తున్నాయి.

భూలోకాన్ని దాటి భువర్లోకాన్నీ చేరి అక్కణ్ణించి అవలీలగ సురలోకాలు ఇరవై మూడున్నూ మీరి, మహర్లోకాన పయనించి, జనలోకాన్ని విడిచి, తపోలోకాన్ని దాటి, బ్రహ్మలోకాన్ని చేరిన విమానాలు క్షణంలో శివలోకాన్ని సమీపించాయి.

శివలోకం ఇది అని ఎవరో అన్నారొకచోట.

సరి! సరి! చూడవయ్యా ఇది వైకుంఠం. శ్రీమహావిష్ణుదేవుని శృంగారసీమ అని అన్నాడు అటునుంచే విమానంతో వెళుతూన్న వ్యక్తి.

అలా లోకాలన్నీ అవలీలగా దాటి అందరున్నూ రుక్మాంగదునితో హాయిగా వైకుంఠం చేరారు.

అందరూ సందడిగా విమానాలనుంచి దిగారు. శ్రీపతి ఆనాడు అందరినీ ఆహ్వానించి తన దివ్యసభామండపంలో సలాంఛనంగా కొలువు తీరాడు. జయవిజయులు జయజయ ధ్వనులతో శ్రీహరికి రుక్మాంగదునికి స్వాగతం పలికారు. తర్వాత విష్ణుమూర్తి అందరికీ సెలవిచ్చి రుక్మాంగదునకు అతని కాంతలకున్నూ తగిన దివ్యవైభవం ఏర్పాటుచేసి వారిని స్వయంగా ఆ దివ్యభవనాలకు తోడుకు వెళ్ళి సలక్షణంగా గృహప్రవేశం చేయించారు. లక్ష్మీదేవి సంధ్యావళి మొదలైన కాంతలకు కుంకుమబొట్టు పెట్టింది.

తరువాత శ్రీ మహావిష్ణువు రుక్మాంగదుణ్ణి ఆప్యాయంగా చేరదీసి 'భక్తశిరోమణీ' నీ చరిత్ర పరమపావనం. ఇక్కడ నీకు సశరీ వైకుంఠ యాత్రగా అక్షయపుణ్యఫలం ప్రాప్తించిందంటే నీవు ఏకాదశీవ్రతాన్నీ పాటించడంలో అవలంబించిన కఠోరనియమమే కారణం. ఇక్కడ నిత్య సంతోషమూర్తివై నీ భార్యలతో హాయిగా ఉండు' అని చెప్పి లక్ష్మీదేవి చేతిని విలాసంగా అందుకుని తన ప్రాసాదానికి విచ్చేశాడు.

రుక్మాంగదుని ఆనందం అర్ణవమయింది.

**ఫలశ్రుతి:**

మునులారా! పరమ తపోధనులారా! రుక్మాంగద చరిత్ర విన్నారా! ఏకాదశీమాహాత్మ్యం వర్ణించడానికి నాకే కాదు సహస్రముఖుడైన అనంతునకున్ను తరం కాదు.

ఈ పుణ్యకథ చదివేవారు, వినేవారు, పుస్తకరూపేణ వ్రాసేవారును శ్రియఃపతి కరుణకు పాత్రు లౌతారు. ఇహలోకంలో పుత్రపౌత్ర ధనధాన్య వృద్ధి, ఐశ్వర్య సమృద్ధి కలవారై శత్రుజయమూ, సద్భక్తి ఒప్పగా, సుస్థిరమైన ఆరోగ్యముతో, సుదీర్ఘమైన అయుర్భాగ్యముతో సుఖసంతోషాలతో గడిపి జన్మాంతమందు వైకుంఠం చేరి శ్రీహరి పదపద్మపీఠం సన్నిధిని నివసిస్తారు.

వారి పుత్ర పౌత్రాదులు కూడా అలాగే జన్మాంతమందు విష్ణుపద సన్నిధానవర్తులౌతారు. ఇది నా మాట కాదు. మా గురుపాదులు అపరనారాయణులు శ్రీవ్యాసులవారి మాట అని సూతుడనగా మునులందరూ చేతులు జోడించి తథాస్తు! అని అన్నారు.

స్వస్త్యస్తు

T.T.D. Religious Publications Series No. 471

Price : Rs.15/-

భగవంతుని ఉపాసనావిధానంలో భాగంగా హైందవధర్మంలో ఎన్నో వ్రతాలు, నోములు, పూజలు అర్చనలు ఆవిష్కరింపబడి, ప్రజా బాహుళ్యంచేత ఆచరింప బడుతున్నాయి.

వీటివల్ల తెలిసికొన్ని, తెలియకకొన్ని చేసిన పాపాలు అన్నీ నశించడమేగాక పుణ్యం కలుగుతుంది. తద్వారా ఇహపర సుఖాలు ఇబ్బడిముబ్బడిగా కలుగుతాయి.

వ్రతాల్లో ముఖ్యంగా ఏకాదశీ వ్రతాన్ని గూర్చి వివరింపబడిన ఈ గ్రంథంలో రుక్మాంగద చక్రవర్తిగాథ పేర్కొనబడింది. రాజశాసనం ప్రకారం నియమం తప్పకుండా ప్రజలందరూ ఏకాదశీ వ్రతాన్ని ఆచరించినందువల్ల రుక్మాంగదుని రాజ్యంలో పాపదేవతకు నిలువనీడ లేకుండా పోయింది. అంతేకాదు, శ్రీమన్నారాయణుని కృపచేత ప్రజలందరూ, సర్వసౌఖ్యాలను అనుభవించి చివరకు మోక్షాన్ని పొందారు. ఈ గొప్పదనం ఇందులో చక్కగా వివరింపబడింది.

Published by Sri **A.P.V.N.SARMA**, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams and Printed at T.T.D. Press, Tirupati.